Prajalakshyam Telugu Daily
ప్రజాలక్ష్యం
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : గోలి సమ్మిరెడ్డి

## పెరుగుతున్న ఎండల తీవ్రత

**- అప్రమత్తంగా ఉండాలని ప్రధాని సూచన**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

న్యూఢిల్లీ,మే27 : దేశంలో రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రజలకు ఓ కీలక విజ్ఞప్తి చేశారు. దేశంలోని అనేక ప్రాంతాల్లో ఎండ తీవ్రత పెరుగుతోందని పేర్కొన్నారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా ప్రజలు రోజువారీ జీవితంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ మేరకు

11 లో

## తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి: వేముల

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిజామాబాద్,మే27 : అకాల వర్షంతో తడిసిన ధాన్యం కొనగడంతో పాటు, నష్టపోయిన రైతలను ఆదుకోవాలని మాజీమంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి డిమాండ్ చేశారు. సకాలంలో పంటలు కొనుగోలు చేసివుంటే ఈ దుస్థితి వచ్చేది కాదన్నారు. అలవికాని హామీలు ఇచ్చి గద్దదెనెక్కిన కాంగ్రెస్ వాటి అమలులో పూర్తిగా విఫలమైంది. రేవంత్ సర్కార్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత, అసంతృప్తి రగులుతున్నది. బీఆర్ఎస్ కు రోజురోజుకూ ప్రజా మద్దతు పెరుగుతున్న దని మాజీ మంత్రి, ఎమ్మెల్యే అన్నారు. వచ్చే ఎన్నికల్లో

11 లో

సంపుటి: 17 | సంచిక: 3 | కరీంనగర్ | గురువారం 28 మే 2026 | పేజీలు: 12 | వెల: 2.00

# ప్రధాని మోడీతో సీఎం విజయ్ భేటీ

**- రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి ప్రధానికి సిఎం వినతి**

**- పలు అంశాలపై ప్రకటన విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

న్యూఢిల్లీ,మే27 : తమిళనాడు ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ ఢిల్లీలో తొలిసారి జరుపుతున్న అధికారిక పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీని సేవతీర్థ్‌లో బుధవారంనాడు కలుసుకున్నారు. ఉభయులూ 25 నిమిషాల సేపు సమావేశమయ్యారు. తమిళనాడు సీఎం విజయ్ బుధవారం ప్రధాని మోదీతో భేటీలో పలు అంశాలు చర్చించారని సమాచారం. తొలుత దిల్లీలోని తమిళనాడు భవన్‌కు చేరుకున్న విజయ్.. అనంతరం ప్రధాని కార్యాలయానికి వెళ్లి మోదీని మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎం అయ్యాక ఆయన తొలిసారి ప్రధానితో

11 లో

# త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమం

**- ఇప్పటికే సుమారు లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తి**

**- జీహెచ్ఎంసీ పరిధిలో 18వేల ఇళ్లు మంజూరు**

**- కెటిఆర్ సవాల్‌పైనా మరోమారు ఘాటు విమర్శలు**

**- మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,మే27 : రాష్ట్రవ్యాప్తంగా త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమం చేపడతామని తెలంగాణ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే సుమారు లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తయిందని చెప్పారు. జూన్ చివరి నాటికి మరో లక్ష పూర్తవుతాయన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో 18వేల ఇళ్లు మంజూరు చేశామని మంత్రి వివరించారు. సచివాలయంలో సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్‌తో కలిసి పొంగులేటి మీడియా సమావేశం నిర్వహించారు. తొలిదశలో హైదరాబాద్‌లో లక్ష ఇళ్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దీనికి అవసరమైన కార్యాచరణ కోసం క్షేత్రస్థాయిలోకి వెళ్లాం. 13 చోట్ల స్థలాలు పరిశీలించాం. జీహెచ్ఎంసీలో స్థలం కొరతతో 18వేల ఇళ్లే ఇచ్చాం. పేదల ఇళ్ల కోసం విలువైన ప్రభుత్వ భూములను కేటాయిస్తున్నాం. జీవనోపాధికి అనుగుణంగా ఉండే ప్రాంతాల్లో, నివాసయోగ్యమైన ప్రదేశాల్లో ఇళ్లు నిర్మించి ఇస్తాం అని వివరించారు. పేదల ఆలోచనలు, సూచనలకు అనుగుణంగానే యుద్ధ ప్రాతిపదికన ఇళ్లు నిర్మిస్తాం. ఒక్క

11 లో

## కల్లాల వద్ద దైన్యంగా రైతులు

- పంటల కొనుగోలు లేక దీనావస్థ
- వారిని వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలి
- బిఆర్ఎస్ శ్రేణులు రైతులకు అండగా నిలవాలి
- పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పిలుపు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,మే27 : రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న అకాల వర్షాలు, ఈదురు గాలుల కారణంగా అనేక వ్యవసాయ మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన వరి, మొక్కజొన్న తదితర పంటలు తీవ్రంగా దెబ్బతినడం అత్యంత బాధాకరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తారక రామారావు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, రైతాంగానికి అండగా ఉండాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ ఆపత్కాలంలో రైతన్నలకు భరోసా ఇవ్వాలని

11 లో

## అకాల వర్షంతో చల్లబడ్డ వాతావరణం

- పలు జిల్లాల్లో ఉరుములు, ఈదురుగాలుల వర్షం
- కల్లాల్లో తడిసిన ధాన్యంతో రైతుల ఆందోళన
- తక్షణమే ధాన్యం కొనుగోళ్లు చేయాలని డిమాండ్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,మే27 : భానుడి భగభగలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న రాష్ట్ర ప్రజలకు భారీ వర్షంఎండల నుంచి ఉపశమనం కలిగించినా, అన్నదాతలక మాత్రం కన్నీరు మిగిల్చింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి తెలంగాణలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. అకాల వర్షాలకు పలు కొనుగోలు కేంద్లా ధాన్యం తడిసిపోయింది. పలుచోట్ల చెట్లు విరిగిపోయాయి రవాణాకు అంతరాయం ఏర్పడింది. సంగారెడ్డిలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. కామారెడ్డి జిల్లాలో వర్షాలకు కల్లాల్లోని ధాన్యం కొట్టుకుపోయింది. సిద్దిపేట జిల్లా ముత్యాలో అత్యధికంగా 12.3 సెం.మీ. వర్షపాతం నమోదయింది. మహబూబూనగర్ జిల్లా భూత్పూర్ మండలంలో 11 సెం.మీ., నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేటలో 8.4 సెం.మీ., నల్లగొండ జిల్లా గుండ్లపల్లిలో 6.2 సెం.మీ. వర్షం కురిసింది. సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. పిడుగులు పడే అవకాశం ఉండటంతో వాతావరణ శాఖ ప్రజలను అప్రమత్తం చేసింది. ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ధాన్యం తడిసిపోయి నష్టపోతున్నామని రైతులు ఆరోపించారు. డిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెక్కలు ముక్కలు చేసుకొని, అప్పులు జేసి ఇంటిల్లిపాది ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తే.. అన్నదాతలకు చివరకు కన్నీళ్లే మిగిలాయి. ప్రభుత్వ నిర్లక్ష్యంతో కాంటా పెట్టాల్సిన వడ్లు అకాల వర్షాలకు కండ్ల ముందే నీళ్లలో

11 లో

## సింగరేణిలో 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు మాయం

**- హరీష్ రావు ఆరోపణల నుంచి దృష్టి మరల్చే యత్నం**

**- తనపై నిందలు మోపి మళ్లీ జైలుకు పంపే కుట్రలు**

**- మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆరోపణ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,మే27 :సింగరేణిలో 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు మాయం పై హరీష్ రావు సంచలన ఆరోపణల నుంచి దృష్టిని మరల్చడానికే మంత్రులు తనపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తెలిపారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి కార్మిక సంఘం సమావేశంలో తాను మాట్లాడిన మాటలను వక్రీకరించి తనపై కాంగ్రెస్ ఎమ్మెల్సీలు డీజీపీకి ఫిర్యాదు చేసినట్లు సమాచారం ఉందని పేర్కొన్నారు. సింగరేణిని సీఎం బామ్మర్దికి అప్పగించారని ఆరోపించారు. తనపై తెలంగాణ ఉద్యమంలో 226 కేసులు ఉన్నాయని, సీసీఎస్



డార్క్ సెల్‌తో సహా హైదరాబాద్ నగరంలో అన్ని పోలీస్ స్టేషన్‌లో ఉన్నానని వెల్లడించారు.సింగరేణి కార్మికులు, ప్రజల ఓట్లతో రెండు సార్లు గెలిచాను. ప్రజల దృష్టిని మరల్చడానికి తన వ్యాఖ్యలను

11 లో

## పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ

**- అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశం**

**- ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలన్న రేవంత్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,మే27 : వాతావరణ శాఖ పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలులపై అలర్ట్‌గా ఉండాలని దిశానిర్దేశం చేశారు. ప్రత్యేకంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అదనపు

11 లో

## రైతుల ఆగ్రహంలో కాంగ్రెస్ కొట్టుకుపోతుంది

**- ధాన్యం సేకరణలో ఎప్పుడూ లేనంత నిర్లక్ష్యం**

**- మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శలు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



వనపర్తి,మే27 : రైతులకు దుర్భర పరిస్థితులు కల్పించిన కాంగ్రెస్ ప్రభుత్వం మట్టికొట్టుకు పోవడం ఖాయమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. బుధవారం బీఆర్ఎస్ శ్రేణులతో కలసి జిల్లాలోని పెద్దమందడి మండలంలో పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాతలపై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరిత చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలమవడం రేవంత్ రెడ్డి చేతగానితనం, నిర్లక్ష్యమేనని ఆరోపించారు.

11 లో

## గోనె సంచుల్లో డబ్బుల మూటల తరలింపు

**అందుకే సంచుల కొరత: ఆర్ఎస్‌పి ఆరోపణ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,మే27 :కాంగ్రెస్ సర్కార్ పాలనలో కొనుగోలు కేంద్రాల్లో సరిపడా గోనె సంచుల సరఫరా లేక ధాన్యం అమ్ముకోలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిసిందే. అయితే ఆ గోనె సంచుల్లేకపోవడానికి కారణం సీఎం రేవంత్ రెడ్డేనంటూ బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చురకలించారు. బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కావాల్సిన గోనె బస్తాలు ఎందుకు లేవో తెలుసా..?

11 లో

## డిజిటల్ చెల్లింపుల్లో జాగ్రత్త

**ప్రజలను హెచ్చరించిన సిపి సజ్జన్నార్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,మే27 : బక్రీద్ పండుగ నేపథ్యంలో.. డిజిటల్ చెల్లింపుల విషయంలో వ్యాపారులు జాగ్రత్తగా ఉండాలని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. ఇటీవల కాంచన్‌బాగ్, రాజేంద్రనగర్ పీఎస్‌ల పరిధుల్లో రెండు డిజిటల్ మోసాలు వెలుగులోకి వచ్చాయని సీపీ తెలిపారు. కాంచన్‌బాగ్‌లో ఆరుగురు వ్యక్తులు ఒక వ్యాపారితో బేరమాడి, రూ.5వేలు చెల్లించినట్లుగా చూపించే నకిలీ యాప్ స్క్రీన్‌ను చూపించి రూ.68వేల విలువైన పశువులతో ఉడాయించారని తెలిపారు. అదేవిధంగా, రాజేంద్రనగర్‌లో నలుగురు

11 లో

## సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అదనపు పని వేళలు

**రద్దీని తట్టుకునేందుకు ప్రభుత్వం చర్యలు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,మే27 : రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. మే 29 నుంచి జూన్ 3 వరకు అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అదనపు పని వేళలు అమలు చేయనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఉదయం 9:30 గంటల నుంచి రాత్రి 7:30 గంటల వరకు రిజిస్ట్రేషన్ సేవలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా స్లాట్ బుకింగ్‌ల సంఖ్యను

11 లో

# అకాల వర్షాలతో తడిసిన వడ్లు, మక్కలు

**- ప్రతి ఒక్క రైతుకు బిఆర్ఎస్ నేతలు అండగా నిలవాలి**
**- తడిసిన దాన్యాన్ని, మక్కలను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలి**
**- రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్ సిటి (గోదావరిఖని), మే 27 : అకాల వర్షాల వల్ల ప్రభావితమైన అన్ని మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాలను పార్టీ శ్రేణులు సందర్శించాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఒక ప్రకటనలో తెలిపారు.రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాల వలన మార్కెట్ యార్డుల్లో రైతులు తమ ధాన్యం...మక్కలను కోల్పోతున్నా రని ఆయన పేర్కొన్నారు.ప్రభుత్వ అసమర్థత, ముందుచూపు లేకపోవడం వల్లే నేడు రైతన్నలకు ఈ దుస్థితి వచ్చిందన్నారు.మార్కెట్ యార్డుల్లో తడిసిన వరి, మొక్కజొన్న తదితర ధాన్యాన్ని తేమ శాతం, తరుగు లేకుండా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మిగిలిన ధాన్యాన్ని కాపాడుకోవడానికి రైతులకు సరిపడా టార్పాలిన్ కవర్లను తక్షణమే అందజేయాలని కోరారు.వెంటనే మార్కెట్ యార్డులలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని కోరారు.పంట కొనుగోలు పైన ప్రత్యేక దృష్టి సారించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న అకాల వర్షాలు, ఈదురు గాలుల కారణంగా అనేక వ్యవసాయ మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన వరి, మొక్కజొన్న తదితర పంటలు తీవ్రంగా దెబ్బతినడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ఆపత్కాలంలో రైతన్నలకు భరోసా ఇవ్వాలని బి ఆర్ఎస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారుఅకాల వర్షాలకు పలు మార్కెట్ యార్డుల్లో వడ్లు వర్షానికి కొట్టుకుపోతుంటే రైతన్నలు కన్నీరుమున్నీరు అవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.కరెంటు లేక సెల్‌ఫోన్‌ల వెలుతురులో రైతులు తమ ధాన్యాన్ని కాపాడుకోవడానికి పడుతున్న అవస్థలు ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయని మండిపడ్డారు.ప్రభుత్వ అసమర్థత, ముందుచూపు లేకపోవడం వల్లే నేడు రైతన్నలు ఈ దుస్థితిని ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న తీవ్ర జాప్యం వల్లే రైతుల ఆరుగాలం కష్టం కళ్లముందే నీళ్లపాలవుతోందని ధ్వజమెత్తారు. ఈ కష్టకాలంలో రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఎంతైనా ఉందని ఆయన స్పష్టం చేశారు.ఈ విపత్కర పరిస్థితుల్లో రైతాంగానికి అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ శ్రేణులన్నీ క్షేత్రస్థాయిలోకి వెళ్లాలని కోరుకంటి చందర్ సూచించారు. రామగుండం నియోజకవర్గం పరిధిలోని బిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు.నాయకులు.కార్యకర్తలు తక్షణమే తమ తమ పరిధిలో అకాల వర్షాల వల్ల ప్రభావితమైన అన్ని ఐకేపీ సెంటర్ లను వడ్ల కొనుగోలు కేంద్రాలను సందర్శించాలని ఆదేశించారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట కళ్లముందే తడిసిపోయి ఆందోళనలో ఉన్న ప్రతి రైతుకు పార్టీ తరఫున అండగా నిలవాలని, పూర్తి మద్దతు ఇచ్చి సంఘీభావం తెలపాలని పిలుపునిచ్చారు .రైతుల పక్షాన నిలబడి ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసేలా, రైతులకు న్యాయం జరిగేలా రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి పెంచాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.మార్కెట్ యార్డుల్లో తడిసిన వరి, మొక్కజొన్న తదితర ధాన్యాన్ని తేమ శాతం, తరుగు లాంటి ఎలాంటి సాకులు చెప్పకుండా బేషరతుగా కనీస మద్దతు ధరకు (ఎం ఎస్ పి ) ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరుకంటి చందర్ డిమాండ్ చేశారు.అలాగే, వెంటనే మార్కెట్ యార్డులలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించి, మిగిలిన ధాన్యాన్ని కాపాడుకోవడానికి రైతులకు సరిపడా టార్పాలిన్ కవర్లను తక్షణమే అందుబాటులో ఉంచాలన్నారు.వర్షాలకు పంట నష్టపోయిన రైతులందరికీ వెంటనే నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.రైతు కంటతడి పెడితే ఏ ప్రభుత్వానికీ మనుగడ ఉండదు అని అన్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని చందర్ డిమాండ్ చేశారు.

# రామగుండం నగరాన్ని నివాస యోగ్యంగా విద్య, ఉపాధి కేంద్రంగా తీర్చిదిద్దుతున్నాం



**రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్ సిటి (గోదావరిఖని), మే 27 : నగరాన్ని నివాసయోగ్యమైన నగరంగా, విద్యా, ఉపాధి కేంద్రంగా ప్రణాళికాబద్ధంగా తీర్చిదిద్దుతున్నామని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ అన్నారు. డిఎంఎఫ్‌టి నిధులు రూ.4.18 కోట్లతో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 26, 02వ డివిజన్లలో సి సి, బి టి రోడ్ల నిర్మాణం, 48వ డివిజన్‌లో వర్షపు నీటి కాలువ నిర్మాణం, అలాగే 49వ డివిజన్‌తో పాటు ఇతర డివిజన్లలో ప్రహరీ గోడల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ బుధవారం టీచర్స్ కాలనీ లో నిర్వహించిన కార్యక్రమంలో మేయర్ మహంకాళి స్వామి తో కలిసి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ 800 కోట్లతో మునిసిపల్ కార్పొరేషన్ లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని మరో రూ 400 కోట్ల నిధుల మంజూరుకు ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. త్వరలో కొత్తగా ఎనిమిది కొత్త ట్యాంకులు నిర్మించి నగరమంతా 24x7 నీటి సరఫరా ఆరంభించనున్నామని అన్నారు. ప్రతి చిన్న వీధిలోనూ సకల సదుపాయాలు కల్పించాలని ఇందుకు అవసరమైన నిధులు తీసుకువస్తున్నామని అన్నారు. నిధులు కొరతతో అర్ధాంతరంగా ఆగిపోయిన కోర్టు భవనాన్ని నిధులు మంజూరు చేయించి పూర్తి చేయిస్తామని అన్నారు. ప్రభుత్వ పాటశాలలు అద్భుత భవనాలతో నాణ్యమైన విద్య అందిస్తున్నందున అందులోనే పిల్లల్ని చేర్పించాలని అన్నారు.కబ్జా కు గురయిన ప్రభుత్వ భూమి అంగుళం కూడా తగ్గకుండా తిరిగి స్వాధీనం చేసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. త్వరలో ఇక్కడ అందుబాటులో ఉన్న భూమి లో హరిత హోటల్ నిర్మిస్తామని అన్నారు.మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ ఎంఎల్ఏ ఆదేశాల మేరకు టీచర్స్ కాలనీలో వర్షాకాలంలో వరద ప్రభావం లేకుండా చర్యలు తీసుకోవడం జరిగిందని అన్నారు. టీచర్స్ కాలనీలో కాలువను కుదించి నిర్మించిన ఆక్రమణ లు వెంటనే తొలగించడానికి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. గతంలో ద్విచక్ర వాహనం వెళ్లడానికి కూడా అవకాశం లేని టీచర్స్ కాలనీ, కెసిఆర్ కాలనీ, ఆర్‌టిసి కాలనీలలోని వీధుల్లో రోడ్లన్నీ నాణ్యత తో చేపట్టడం జరిగిందని అన్నారు. చివరి ఇంటి వరకు కూడా రోడ్లు, యుజిడి, మంచి నీళ్ళు, వీధి దీపాలు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), రామగుండం నగర పాలక సంస్థ కమీషనర్ జె.అరుణ శ్రీ, కార్పొరేటర్లు రేణికుంట్ల నిర్మల, సాగి సంతోష్ రావు, వెంగళ బాపు, బాలసాని తిరుపతి, దాసరి సాంబమూర్తి, బదావత్ నర్సమ్మ, భాగ్యలక్ష్మి,సత్య ప్రసాద్, నగర పాలక సంస్థ ఎస్ఇ గురువీర తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి జిల్లా పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలి : జిల్లా కలెక్టర్ కె.హరిత




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, మే 27 : రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లాలో పర్యటించనున్నందున అవసరమైన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా ఎస్.పి. నితికా పంత్, అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, డి.ఎస్.పి. అశోక్ తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో పర్యటన ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 1వ తేదీన కెరమెరి మండలం కొటారి గ్రామంలో ఇందిరమ్మ నివాస గృహాల ప్రారంభోత్సవ కార్యక్రమం, లబ్ధిదారులతో కలిసి భోజనం, ముఖాముఖి కార్యక్రమం ఉన్నందున హెలిపాడ్ వద్ద ప్రముఖులకు స్వాగతం, గ్రామస్తులతో మాట్లాడనున్నందున అవసరమైన ఏర్పాట్లు షామియానా, పైలాన్ ప్రారంభం, ప్రముఖుల పార్కింగ్, అధికారుల వాహనాల పార్కింగ్, గ్రామాలలో పారిశుద్ధ్య పనులు, త్రాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా అధికారులు ఏర్పాటు చేయాలని తెలిపారు. రహదారిపై గుంతలను పూడ్చాలని సూచించారు. సాయంత్రం కాగజ్ నగర్ ఎక్స్ రోడ్ సమీపంలో బహిరంగ సభ ఉన్నందున సభకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు లేకుండా త్రాగునీరు అందించాలని, సభా ప్రదేశంలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, హెలిపాడ్ వద్ద భారీ కేడింగ్ ఏర్పాట్లు, వైద్య బృందాలు, అంబులెన్స్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సభకు వచ్చే ప్రముఖులు, అధికారులు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, కొఠారి గ్రామం నుండి కాగజ్ నగర్ ఎక్స్ రోడ్ బహిరంగ సభకు ముఖ్యమంత్రి రోడ్డు మార్గాన వస్తున్నందున అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని తెలిపారు. బహిరంగ సభలో ప్రముఖుల గ్యాలరీ, వీడియో గ్యాలరీ ఏర్పాటు చేయాలని, అధికారులు సమన్వయంతో వ్యవహరించి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని తెలిపారు. అంతకుముందు ఈనెల 29న రెబ్బెన మండలం రౌట సంకెపల్లిలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ పర్యటించను నందున సమీకృత కలెక్టరేట్ అధికారులతో కేంద్ర ప్రభుత్వ పథకాలు రాష్ట్ర ప్రభుత్వం పథకాల సమీక్ష నిర్వహిస్తారని, అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. గవర్నర్ హెలికాప్టర్ ద్వారా వస్తున్నందున హెలిప్యాడ్ ప్రదేశంలో అంబులెన్స్ కాన్వాయ్ ను సిద్ధంగా ఉంచాలని, కలెక్టరేట్ కు వస్తున్న తరుణంలో గవర్నర్ కు పోలీసు గౌరవ వందన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. గవర్నర్ పర్యటనకు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేపట్టాలని తెలిపారు.

ఈ సమావేశంలో పోలీస్, రెవెన్యూ, విద్య, వైద్య, విద్యుత్, పంచాయతీరాజ్, ఇంజనీరింగ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలను అరికడితేనే బాలికల భవిష్యత్తుకు భరోసా



**జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, మే 27 : బాల్య వివాహాలను అరికడితేనే బాలికల భవిష్యత్తుకు భరోసా లభిస్తుందని, అందరూ కలిసి సమిష్టిగా ములుగు జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని, ప్రతి వివాహానికి ముందు వయస్సు నిర్ధారణ తప్పనిసరిగా చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు పిలుపునిచ్చారు. చదువు, ఆరోగ్యం, స్వేచ్ఛను కాపాడాలంటే బాల్య వివాహాలకు పూర్తిగా చెక్ పెట్టాల్సిన అవసరం ఉందన్నారు.మహిళా అభివృద్ధి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై బుధవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ వాసుదేవరావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాలు ఒక సామాజిక దురాచారమని పేర్కొన్నారు. బాల్య వివాహాల వల్ల బాలికలు విద్య, ఆరోగ్యం, హక్కులు,స్వేచ్ఛను కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఆడపిల్లలకు సురక్షితమైన బాల్యాన్ని అందించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.బాల్య వివాహాల సమాచారం ముందుగా తెలిసే అవకాశం పురోహితులు, ఖాజీలు,పాస్టర్లు, టెంట్ హౌస్ నిర్వాహకులు, ఫోటోగ్రాఫర్లకు ఎక్కువగా ఉంటుందని,వారు సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి బాల్య వివాహాలను అడ్డుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా మున్సిపల్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ చింత నిప్పుల చంద్రకళ మాట్లాడుతూ బాల్య వివాహాలు ఆడపిల్లల జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేస్తాయని,సమాజం మొత్తం కలిసికట్టుగా పనిచేసి బాల్య వివాహాలు లేని ములుగు జిల్లాను నిర్మించాలని కోరారు. జిల్లా సంక్షేమ అధికారిణి ఈ.పి. ప్రేమలత మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే సామాజిక, ఆరోగ్య, కుటుంబ పరమైన దుష్ప్రభావాలను వివరించారు. బాల్య వివాహాలు ఒక్క వర్గానికే పరిమితం కావని, అన్ని వర్గాల్లోనూ జరుగుతున్నాయని పేర్కొన్నారు.బాల్య వివాహాల నిర్మూలనలో వయస్సు నిర్ధారణ అత్యంత కీలకమని, వివాహాల నిర్వహణకు ముందు వయస్సు నిర్ధారణ పత్రాలను తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ములుగు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఆసియా షాహిన్ రియాజ్ మీర్జా, సిడిపిఓ కె.శిరీష,బాలల పరిరక్షణ అధికారి జె ఓంకార్, సూపర్వైజర్లు,జిల్లా మిషన్ కోఆర్డినేటర్ రమాదేవి,సఖి కేంద్రం సెంటర్ అడ్మిన్ లావణ్య, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ నరేష్,జిల్లా బాలల పరిరక్షణ విభాగం,సఖి,డిహెచ్ఈడబ్ల్యూ సిబ్బంది సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి



**- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, మే 27 : రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని,ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు.బుధవారం ములుగు మండ లం ఇంచర్ల గ్రామంలోని పి.ఏ.సి.ఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్ జి తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న ధాన్యం సేకరణ ప్రక్రియ, రైతులకు అందుతున్న సౌకర్యాలు, ధాన్యం తూకం విధానం, తేమ శాతం నమోదు, రికార్డుల నిర్వహణ, ధాన్యం నిల్వ విధానం తదితర అంశాలను జిల్లా కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు.ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు తాగునీరు, నీడ, వంటి మౌలిక సౌకర్యాలు తప్పనిసరిగా కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం, జాప్యం చోటు చేసుకోకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాల ప్రకారం వేగంగా కొనుగోలు చేసి, కొనుగోలు అనంతరం ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అకాల వర్షాలను దృష్టిలో ఉంచుకొని కొనుగోలు కేంద్రాల్లో తగిన టార్పాలిన్లు, కవర్లు సిద్ధంగా ఉంచాలని, ధాన్యం తడవకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వర్షం కారణంగా రైతులు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.కొనుగోలు కేంద్రాల్లో రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, రైతులకు డబ్బుల చెల్లింపులు సమయానికి జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులు ఎటువంటి మధ్యవర్తులపై ఆధారపడకుండా నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకురావాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రైతులు ఇబ్బందులు పడకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డిఎం క్రిష్ణవేణి,సంబంధిత శాఖల అధికారులు,పి.ఏ.సి.ఎస్ ప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, కొనుగోలు కేంద్ర సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

**- అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలి**
**- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంనగర్, మే 27 : జూన్ 2న నిర్వహించే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అన్ని శాఖల సమన్వయంతో ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో జరిగే వేడుకలకు ప్రోటోకాల్‌కు అనుగుణంగా సీటింగ్, వసతులు, భద్రతా ఏర్పాట్లు పక్కాగా చేయాలని సూచించారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతిబింబించేలా ప్రత్యేక ప్రదర్శనలు, థీమ్ ఆధారిత స్టాల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, మండలాలు, గ్రామ స్థాయిలో కూడా వేడుకలను ఘనంగా చేపట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ డి.శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓ మహేశ్వర్, డీసీపీ వెంకటరమణ, జిల్లా ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి, డీఎంహెచ్‌వో వెంకటరమణ, మెప్మా పీడీ స్వరూప రాణి, డీఆర్‌డీఓ గీత, వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, బీసీడీవో అనిల్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఏడుపాయల వన దుర్గా మాతను దర్శించుకున్న మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు దంపతులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మెదక్, మే 27 : తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన శ్రీ ఏడుపాయల వనదుర్గామాతను బుధవారం నాడు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు శివాని దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందించారు.ఈసందర్భంగా డా.మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ ఏడుపాయల అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాం తులతో ఉండాలని,జిల్లా అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని కోరుకుంటున్నాననీ తెలిపారు. దేవస్థాన అభివృద్ధికి,భక్తుల సౌకర్యాలకు ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లింగంపేట నరేందర్ గౌడ్,నాగ్సన్ పల్లి సర్పంచ్ దండెం సుశీల దుర్గయ్య, మండల నాయకులు కుర్తివాడ ప్రసాద్ గౌడ్,ముశెట్టి కిష్టయ్య,కే.భరత్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ కానుగు రాధిక భూపతి రాజ్,వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్,దేవస్థాన సిబ్బంది సూర్య శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.



# మాదక ద్రవ్యాల నియంత్రణ లక్ష్యం

**జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**


(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, మే 27 : జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణే లక్ష్యం అని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి తో కలిసి నార్కోటిక్ మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నియంత్రణ,రోడ్డు భద్రత అంశాలపై సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిషేధిత మాదకద్రవ్యాల సరఫరా,క్రయవిక్రయాలపై పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. ముఖ్యంగా జిల్లా, రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహిం చాలని, అనుమానిత ప్రాంతాలు,దుకాణాలు, గోదాములు,రహదారుల వద్ద పోలీసు జాగిలాలతో నిరంతరం తనిఖీలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాల పరిసర ప్రాంతాల్లో మాదకద్రవ్యాల విక్రయాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రత్యేక సదస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు.మాదకద్రవ్యాలపై సమాచారం అందించేందుకు ప్రజలు డ్రగ్స్ ఇన్ఫర్మేషన్ టోల్ ఫ్రీ నెంబర్‌ను వినియోగించు కోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఎక్కడైనా మాదకద్రవ్యాల విక్రయాలు,రవాణా, అనుమా నాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వం ఏర్పాటు చేసిన డ్రగ్స్ ఇన్ఫర్మేషన్ టోల్ ఫ్రీ నెంబర్-1908కు సమాచారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఆర్డిఓ ప్రతాప్,వరంగల్ నార్కోటిక్ ఈగల్ విభాగం డీఎస్పీ రమేష్ కుమార్,డీఈఓ సిద్ధార్థ రెడ్డి, ఐటీడీఏ డీడీ జనార్ధన్, రవాణా శాఖ జిల్లా అధికారి బి.శ్రీనివాస్,జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 1500 కుటుంబాలకు ఉచిత పచ్చడి మామిడికాయల పంపిణీ

**- ముఖ్య అతిథిగా పాల్గొన్న డీసీసీ**
**- ఖమ్మం కార్పొరేషన్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ఖమ్మం, మే 27 : ఖమ్మం నగరంలోని త్రీ టౌన్ పరిధి 30వ డివిజన్‌లో బుధవారం ఉచిత పచ్చడి మామిడికాయల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. డివిజన్ అధ్యక్షులు అర్వపల్లి శివకుమార్, కాంటెస్టెడ్ కార్పొరేటర్ అర్వపల్లి స్వాతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి డీసీసీ ఖమ్మం కార్పొరేషన్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి ముఖ్య అతిథిగా హాజరై పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. డివిజన్‌లోని సుమారు 1500 కుటుంబాలకు ఒక్కో ఇంటికి 20 చొప్పున పచ్చడి మామిడికాయలను అందజేశారు. ఈ సందర్భంగా నాగండ్ల దీపక్ చౌదరి మాట్లాడుతూ ప్రజాసేవ పట్ల అర్వపల్లి శివకుమార్, స్వాతి దంపతులు చూపుతున్న నిబద్ధత అభినందనీయమన్నారు. కరోనా సమయంలో వారు అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. ప్రజల ఆశీర్వాదాలతో భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించే అవకాశం కలగాలని ఆకాంక్షించారు. అర్వపల్లి శివకుమార్ మాట్లాడుతూ గత ఐదేళ్లుగా ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా పచ్చడి మామిడికాయల పంపిణీ చేపడుతున్నామని తెలిపారు. డివిజన్ ప్రజలు కుటుంబ సభ్యుల్లా ఆదరిస్తూ తాను చేసే సేవా కార్యక్రమాలకు అండగా నిలుస్తున్నందుకు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు కోసూరు ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ కోనేటి నారాయణ, మహిళా నాయకురాలు సట్టు మంగ, కొత్త జ్యోతి, స్పందన, యామిని, కొప్పుల మాలతి, కొప్పుల రమాదేవి, దారావత్ శివకుమార్, చల్ల ఉపేందర్, చింతల వెంకన్న, కొప్పుల రాము, అర్వపల్లి అశోక్, బొగ్గారాపు చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యా సంవత్సరానికల్లా గురుకులాలు పూర్తి సిద్ధం కావాలి

**- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క - ప్రతి గురుకులంలో అన్ని సీట్లు భర్తీ కావాలి.. నిర్లక్ష్యానికి తావులేదు - ప్రతి రెసిడెన్షియల్ స్కూల్‌కు జిల్లా అధికారిని ఇన్‌చార్జిగా నియమించాలి - విద్యార్థుల ఆరోగ్యంపై ప్రతి నెల వైద్య పరీక్షలు నిర్వహించాలి**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, మే 27 : రాబోయే విద్యా సంవత్సరానికి అన్ని గురుకుల, సంక్షేమ వసతి విద్యాసంస్థలు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. గురుకుల పాఠశాలల్లో ప్రతి సీటు భర్తీ అయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యానికి ఎలాంటి తావు ఉండకూడదని స్పష్టం చేశారు. బుధవారం ఖమ్మం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులతో కలిసి గురుకుల, సంక్షేమ వసతి విద్యాసంస్థలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ జిల్లాలో ప్రతి ఏడాది గురుకుల పాఠశాలల్లో అడ్మిషన్లు పెరిగేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సీట్లు పూర్తిగా భర్తీ కాని రెసిడెన్షియల్ పాఠశాలలపై ప్రత్యేక అధ్యయనం చేసి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. జూన్ 12 నుంచి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో వేసవిలోనే అన్ని మరమ్మతులు, మౌలిక వసతుల పనులు పూర్తి చేయాలని తెలిపారు. ప్రతి గురుకుల పాఠశాలలో డైట్ ఛార్జీలు, మెనూ వివరాలను తప్పనిసరిగా ప్రదర్శించాలని సూచించారు. ప్రతి విద్యాసంస్థకు ఒక జిల్లా అధికారిని ఇన్‌చార్జిగా నియమించి, వారు ప్రతి నెల పాఠశాలలను సందర్శించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. అలాగే వైద్యులు కూడా ప్రతి నెల విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించాలని పేర్కొన్నారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాలపై సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించిన ఆయన, అవసరమైన మరమ్మతులు నిరంతరం చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఐదు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవనాల పనులను వేగవంతం చేయాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాల్లో ఎన్ని అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయో, యంగ్ ఇండియా పాఠశాలలు పూర్తయ్యాక ఎన్ని తరలించవచ్చో ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ప్రాంతీయ సమన్వయకర్తలు వచ్చే 12 రోజుల్లో అన్ని పాఠశాలలను చెక్‌లిస్ట్ ప్రకారం పరిశీలించి సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరానికి పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు విద్యార్థులకు సకాలంలో అందించడాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలని పేర్కొన్నారు. విద్యపై ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, భారీగా నిధులు వెచ్చిస్తున్న నేపథ్యంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని డిప్యూటీ సీఎం సూచించారు. సిబ్బంది జీతాలు, డైట్ ఛార్జీలు, అద్దెల చెల్లింపులు ప్రభుత్వం క్రమం తప్పకుండా చెల్లిస్తోందని తెలిపారు. మరమ్మతుల నిధులు కూడా విడుదల చేస్తున్న నేపథ్యంలో పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పనుల బిల్లులను పెద్ద ఎత్తున క్లియర్ చేసినట్లు ఆయన వెల్లడించారు. విద్యాశాఖ పనుల బిల్లుల చెల్లింపులకు డీఎంఎఫ్‌టీ నిధులను కూడా వినియోగిస్తామని తెలిపారు. విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్ అందుతున్న నేపథ్యంలో స్వంత భవనాల్లో నడుస్తున్న గురుకులాల్లో సోలార్ ప్యానెల్ల ఏర్పాటు కోసం కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో గురుకులాల ప్రాంతీయ సమన్వయకర్తలు, ఎస్ఈ ఎన్పీడీసీఎల్ శ్రీనివాస్, విద్యాశాఖ అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



# రాష్ట్ర అవతరణ వేడుకల ఏర్పాట్లపై సమీక్ష

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పెద్దపల్లి, మే 27 : రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని రెవిన్యూ డివిజనల్ అధికారి గంగయ్య ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 2న జరిగే వేడుకలకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. ఫ్లాగ్ ఏర్పాట్లు, గ్రౌండ్ సిద్ధం, వేదిక, సీటింగ్ తదితర పనులను ప్రోటోకాల్ ప్రకారం పూర్తి చేయాలని పోలీస్, రెవెన్యూ, ఆర్ అండ్ బీ శాఖలకు ఆదేశించారు. వేడుకల వద్ద వైద్య శిబిరాలు, త్రాగునీటి సదుపాయాలు కల్పించాలని, ఆహ్వాన పత్రాలు అందరికీ చేరేలా చూడాలని తెలిపారు. స్వశక్తి మహిళా సంఘాల ప్రతినిధులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని మెప్మా అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల వివరాలను మే 29 లోగా అందజేయాలని సూచించారు. సమావేశంలో ఏసీపీ జి.కృష్ణ, కలెక్టరేట్ పరిపాలన అధికారి బి.ప్రకాశ్, సి.విభాగం సూపరింటెండెంట్ కుమారస్వామి, మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, తహసీల్దార్ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# తడిసిన ధాన్యాన్నీ కొనుగోలు చేస్తాం... రైతులు ఆందోళన చెందొద్దు...

**- ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



యాదాద్రి భువనగిరి, మే 27 : యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు కేంద్రంలో నిల్వ ఉంచిన ధాన్యం తడవడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే కొనుగోలు కేంద్రానికి చేరుకుని రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన ఆయన రైతులు ఎలాంటి అధైర్యానికి గురికావద్దని, ప్రభుత్వం ప్రతి గింజ ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని భరోసా ఇచ్చారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఆలస్యం జరగకుండా అదనపు లారీలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని తరలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా వంగపల్లి గోదాంలో ధాన్యం నిల్వ చేసేందుకు సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. బొమ్మలరామారం, తుర్కపల్లి మండలాల్లో ఉన్న ధాన్యాన్ని అదనపు లారీలతో వంగపల్లి గోదాంలోకి తరలించాలని లారీ కాంట్రాక్టర్లకు సూచించారు. రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద రోజుల తరబడి నిరీక్షించే పరిస్థితి రాకూడదని, ధాన్యాన్ని వేగంగా కొనుగోలు చేసి మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గోదాంల వద్ద ధాన్యం అన్లోడ్ విషయంలో అధికారులు లేదా కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వర్షాలకు తడిసిన ధాన్యం విషయంలో రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, రైతులు నష్టపోకుండా అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

# మహిళల ఆత్మ గౌరవం చిహ్నాలే మహిళా సమైక్య భవనాలు

**- ప్రజా దర్బార్ లో వచ్చిన ప్రతి దరఖాస్తుకు ప్రాధాన్యత ఇస్తూ వెంటనే పరిష్కరించాలి**

**- 100 రోజుల పనులు, గ్రామీణ అంతర్గత అభివృద్ధి, సీసీ రోడ్లు,చెక్ డ్యాములు రోడ్ల పనుల్లో వేగం పెంచాలి**

**- దేశంలో ఎక్కడా లేని విధంగా మహిళల స్వయం ఆర్థిక అభివృద్ధి కోసం వడ్డీ లేని రుణాలను పంపిణీ చేయడం జరుగుతుంది**

**- అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్, ఇందిరమ్మ ఇండ్లు, అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం**

**- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా,స్త్రీ శిశు సంక్షేమ,శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క**








(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, మే 27: ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని, ప్రజా దర్బార్‌లో వచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, అధికారులకు మంత్రి సీతక్క సూచించారు. బుధవారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, ఎస్పీ డాక్టర్ శబరిష్, డీఎఫ్ఓ విశాల్ బత్తుల, ఆర్డిఓ క్రిష్ణవేణి, జడ్పీ సీఈవో పురుషోత్తం, జిల్లాస్థాయి ఉన్నతాధికారులందరితో కలిసి మహబూబాబాద్ జిల్లా ములుగు నియోజకవర్గ పరిధి కొత్తగూడ ఏజెన్సీ ఓటాయి, కొత్తగూడ మండల కేంద్రం లో రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క, ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామపంచాయతీ సర్పంచులు, సూచించిన సమస్యల పరిష్కారం నిమిత్తం వెంటనే కార్యక్రమంలో పాల్గొన్న అధికారులకు ఆదేశాలు తగ్గ సూచనలు జారీ చేశారు, ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించి సంబంధిత విభాగానికి పంపి అర్హులైన ప్రతి ఒక్కరిని గుర్తించి వారు చేసుకున్న సంక్షేమ ఫలాల పథకాల ద్వారా లబ్ధి చేకూరే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం సుమారు 60 వేల 400 కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలను అందించడం జరుగుతుందని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ లబ్ధిదారులు మహిళా సంఘాలలో సభ్యులుగా ఉంటే ఆర్థిక భరోసా కింద లక్ష రూపాయలు అందించడం జరుగుతుందన్నారు. గతంలో ఐదు లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇవ్వడం జరిగిందని, ప్రస్తుతం రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో 10 లక్షల రూపాయల వరకు వడ్డీ లేని రుణాలను అందిస్తున్నామని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో 100 రోజుల పనులలో అధికంగా కూలీలు పాల్గొని వేగంగా ఆ పనుల్లో నిమగ్నం కావాలని తద్వారా మీ యొక్క ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళల ఆత్మ గౌరవం నిమిత్తం మహిళా సమైక్య భవనాలను నిర్మించడం జరుగుతుందని, అందులో భాగంగానే మండల పరిధిలో ఇప్పటికే 40 భవనాల నిర్మాణ శంకుస్థాపనలు చేయడం జరిగిందని, ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో భాగంగా పాలపిట్ట రంగులో చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేయడం జరిగిందని ఇప్పుడు చిలకపచ్చ రంగులు అద్భుతంగా చీరలను అందించడం జరుగుతుందన్నారు,ల్.రైతుల పొలాల వద్దకు వెళ్లడం కోసం రహదారుల నిర్మాణం లో ఫారెస్ట్ అధికారులు రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రోడ్లు నిర్మించాలని తెలిపారు. పేదవాడి సొంత ఇంటి నిర్మాణ కలను సహకారం చేయడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని అందులో భాగంగానే జిల్లాకు వచ్చిన కోటాకు అదనంగా మరో రెండు వేల మంది లబ్ధిదారులను ఎంపిక చేయడం కోసం చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు, జిల్లాలోని ఇండ్లు నిర్మించుకోలేని పరిస్థితిలో ఉన్న వారి సౌకర్యార్థం ఒక సంస్థ ద్వారా ఇండ్లు నిర్మించుకునే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో కరెంటు సమస్యలను తీర్చడం కోసం ఉపముఖ్యమంత్రి గారి చేత ప్రత్యేకంగా కరెంటు స్తంభాల మంజూరు నిధుల మంజూరు చేయించడం జరిగిందని ప్రతి ఒక్కరికి ఎలాంటి ఇబ్బంది లేకుండా నాణ్యమైన కరెంటును అందించాలని మంత్రి కోరారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క స్వయంగా ప్రజల సమస్యలను ఓపికగా వింటూ దరఖాస్తులను స్వీకరించారు. అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యల తీవ్రతను అడిగి తెలుసుకున్నారు. ప్రజా దర్బార్‌లో పలు అంశాలపై ప్రజలు మంత్రికి వినతి పత్రాలు అందజేశారు. ప్రజల నుండి వచ్చిన కొన్ని దరఖాస్తులను మంత్రి సీతక్క గారు అక్కడికక్కడే పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులకు బదిలీ చేశారు. ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించకుండా, చట్టపరిధిలో ప్రతి అర్జీని వీలైనంత త్వరగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి సీతక్క చూపిన చొరవ, ఆప్యాయతపై ప్రజా దర్బార్‌కు వచ్చిన ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి ప్రత్యేక చొరవతో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ప్రజలకు మరింత సేవ చేయాలనే మంచి ఉద్దేశంతో నిర్వహించడం జరిగిందని ఈ ప్రజా దర్బారు ద్వారా వచ్చిన ప్రతి ఒక్క దరఖాస్తును పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలను అందించి వారికి న్యాయం చేయడం కోసం జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని తెలిపారు. కొత్తగూడ మండల పరిధిలో ట్రైబల్ వెల్ఫేర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి నా పిల్లలను మంత్రి సన్మానించారు, ప్రజా దర్బార్‌లో ఓటాయి గ్రామంలో 167, కొత్తగూడ రైతు వేదికలో 142 మొత్తం 309 దరఖాస్తులు వచ్చాయాని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రజా దర్బార్ కార్యక్రమంలో ములుగు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రేగ కళ్యాణి, డి ఆర్ డి ఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు,డిసిఓ వెంకటేశ్వర్లు,అన్ని విభాగాలజిల్లాఅధికారులు,తహసిల్దార్ రాజు,ఎంపీడీవో మునవర్ బేగ్, అన్ని గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# "నిశ్శబ్ద యోధురాలు" లైకా సేవలకు ఎస్పీ ప్రశంసలు

**అనారోగ్యంతో బాధపడుతున్న డాగ్ స్క్వాడ్ ట్రాకర్‌ను పరిశీలించిన జిల్లా ఎస్పీ సునిత రెడ్డి**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, మే, 27 : ఎస్పీ సునిత రెడ్డి ఆధ్వర్యంలోని వనపర్తి జిల్లా పోలీసు శాఖలో డాగ్ స్క్వాడ్ విభాగానికి చెందిన ట్రాకర్ డాగ్ "లైకా" అనారోగ్యానికి గురికావడంతో హైదరాబాద్ మోయినాబాద్‌లోని పోలీసు వెటర్నరీ ఆసుపత్రిలో ఐదు రోజులపాటు ప్రత్యేక చికిత్స అందించారు. చికిత్స అనంతరం బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో లైకా ఆరోగ్య పరిస్థితిని ఎస్పీ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. గత పదేళ్లుగా "లైకా" వనపర్తి జిల్లా పోలీసు శాఖకు విశేష సేవలు అందించిందని తెలిపారు. ఎన్నో మర్డర్, దొంగతనం మరియు ఇతర క్లిష్ట కేసుల విచారణలో తన అద్భుతమైన ఘ్రాణశక్తితో కీలక ఆధారాలను గుర్తించి నేరస్థులను పట్టుకోవడంలో లైకా విశేష పాత్ర పోషించిందన్నారు. పోలీసు శాఖలో డాగ్ స్క్వాడ్ విభాగం నిశ్శబ్ద యోధుల్లా పనిచేస్తూ కేసుల ఛేదనలో కీలక పాత్ర పోషిస్తోందని, పోలీసు సిబ్బందిలాగే సేవలందిస్తున్న జంతువుల ఆరోగ్యం, సంక్షేమం పట్ల కూడా శాఖ సమాన బాధ్యతతో వ్యవహరిస్తుందని ఎస్పీ పేర్కొన్నారు. డాగ్ హ్యాండ్లర్‌కు లైకాను మరింత జాగ్రత్తగా చూసుకోవాలని, సమయానికి ఆహారం, మందులు అందించాలని సూచించారు. లైకా త్వరగా పూర్తిస్థాయిలో కోలుకుని మళ్లీ ఆరోగ్యంగా సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాజేష్ మీనా, బాలాజీ నాయక్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు అప్పలనాయుడు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు అండగా ఉంటాను

**రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్ సిటి (గోదావరిఖని), మే 27 : కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని రామగుండం ఎమ్మెల్యేరాజ్ ఠాకూర్ అన్నారు. బుధవారం ఎన్‌టీపీసీలోని మిలీనియం హాల్‌లో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి కార్యకర్త నా కుటుంబ సభ్యుడని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం నుంచి ఎన్నికల సమయంలో కష్టనష్టాలను లెక్కచేయకుండా పని చేసే ప్రతి కార్యకర్తే పార్టీకి నిజమైన బలం అని కొనియాడారు. తన విజయంలో కార్యకర్తల శ్రమ, అంకితభావం ఎంతో ఉం దని, వారి సేవలను ఎప్పటికీ మరువనని తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు అన్ని వేళలా అందుబాటులో ఉంటానని, వారికి ఏ సమస్య వచ్చినా తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యకర్తల సంక్షేమం, గౌరవం తనకు ముఖ్యమని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి అందరూ ఐక్యంగా పని చేసి ప్రజల విశ్వాసాన్ని మరింతగా గెలుచుకోవాలని సూచించారు. రామగుండం నియోజకవర్గ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, సంక్షేమ పథకాల అమలు, గ్రామాలు మరియు పట్టణాల సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయాలని కార్యకర్తలకు సూచించారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ రామగుండం ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సమావేశంలో నగర మేయర్ మహంకాళి స్వామి, బొంతల రాజేష్, కాల్వ లింగస్వామి, దిటి బాలరాజు, ఎండీ ముస్తఫా, అసిఫ్ పాషా, పెండ్యాల మహేష్ తో పాటు నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర అవతరణ దినోత్సవ ఏర్పాటుపై సమీక్షా సమావేశం

**- అదనపు కలెక్టర్ రెవెన్యూ కె. అనిల్ కుమార్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మహబూబాబాద్ టౌన్, మే 27 : జూన్ రెండవ తేదీన కలెక్టరేట్ కార్యాలయంలో జరిగే రాష్ట్ర అవతరణ వేడుకలు ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టర్ అనిల్ కుమార్ సూచించారు. బుధవారం కలెక్టరేట్ అదనపు కలెక్టర్ ఛాంబర్ లో సంబంధిత అన్ని విభాగాల అధికారులతో ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించే వేడుకలలో ప్రోటోకాల్ ప్రకారం అతిథులకు అన్ని ఏర్పాట్లు చేయాలని, ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాల పురోగతిపై ప్రసంగం కాపీని సిద్ధం చేయాలని, వేదిక, సీటింగ్, స్నాక్స్, సౌండ్స్, లైటింగ్, సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు ఇతర ఇబ్బందులు లేకుండా పోలీస్ విభాగం చర్యలు తీసుకోవాలని, వేదిక ప్రాంగణంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని, త్రాగునీరు సిద్ధంగా ఉంచాలని, సానిటేషన్ చేయాలని సూచిం చారు. సంబంధిత అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో కలిసి రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం కోసం ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో అన్ని విభాగాల జిల్లా అధికారులు, సెక్షన్ సూపర్డెంట్ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో జాప్యంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు

**- రైతాంగ సమస్యలపై ఆందోళన వ్యక్తం చేసిన బీజేపీ నాయకులు**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)


జయశంకర్ - భూపాలపల్లి, మే 27 : ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం, కనీస సౌకర్యాల లేమితో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సరైన ప్రణాళిక లేకుండా వ్యవహరించడం వల్ల తెలంగాణ వ్యాప్తంగా వరి, మొక్కజొన్న కొనుగోళు గందరగోళానికి గురయ్యాయని విమర్శించారు. జిల్లాలోని ఘనపూర్ మండలం చెల్పూర్ గ్రామంలో మూడో రోజు బుధవారం నిర్వహించిన "రైతు గోస -- బీజేపీ భరోసా" కార్యక్రమంలో బీజేపీ ఫ్లోర్ లీడర్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన్ రావు, ఎమ్మెల్యేలు కాటిపెల్లి వెంకటరమణారెడ్డి, పైడి రాకేష్ రెడ్డి, రామారావు పటేల్, ఎమ్మెల్సీ అంజి రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బసవపురం లక్ష్మీనర్సయ్య తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిషిధర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చందుపట్ల కీర్తిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాలను సందర్శించిన నాయకులు రైతులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోళ్లు ఆలస్యం కావడం, వర్షాల కారణంగా ధాన్యం తడిసి నష్టపోవడం, సకాలంలో చెల్లింపులు జరగక రైతులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విషయాలను రైతులు నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. రైతన్నలు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల వద్దే ఉండాల్సిన పరిస్థితి నెలకొందని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు, గోదాములు, తాగునీరు, నీడ, రవాణా వంటి కనీస వసతులు కూడా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

ఇప్పటికే కొనుగోలు చేసిన ధాన్యానికి కూడా సకాలంలో డబ్బులు చెల్లించక రైతాంగాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేస్తున్నారని ఆరోపించారు. ధాన్యం కొనుగోళ్లలో పారదర్శకత పూర్తిగా లోపించిందని, రైతులకు న్యాయం చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. తెలంగాణ రైతాంగానికి భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ప్రతి గింజ ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసే వరకు బీజేపీ పోరాటం కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, బీజేపీ కార్యకర్తలు, రైతులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# మా ప్రభుత్వం పేదల ప్రభుత్వం

**- మెదక్ జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హాఫీజ్ మొల్సాబ్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మెదక్, మే 27 : జూన్ 2వ తేదీన రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ఇందిరమ్మ జీవిత బీమా పథకం ప్రారంభోత్సవం. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం నూతనంగా ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు మెదక్ జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆఫీస్ హాఫిజుద్దీన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇందిరమ్మ జీవిత బీమా రాష్ట్ర ప్రజలకు కోటి 15 లక్షలమందికి ఐదు లక్షల బీమా సౌకర్యం కలుగుతుందని తెలిపారు. ప్రజల శ్రేయస్సుకే పథకాలను అమలు చేస్తూ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రికి ధన్యవాదాలు చెప్పారు. గత పాలకులు రాష్ట్ర ప్రజల కోసం భీమా సౌకర్యం కలిగించలేదని ఇప్పుడు ప్రజల శ్రేయస్సు కోసం ప్రజల బాగు కోసం పరితపించి మా నాయకుడు ఇందిరమ్మ భీమ ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. జూన్ 2వ తేదీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా ఈ పథకం అందుబాటులోకి వస్తుందని వెల్లడించారు. ఈసందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రికి రాష్ట్ర మంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజాలక్ష్యం

సంపాదకీయం

## అక్రమ వలసలపై ఉక్కుపాదం మోపాల్సిందే !

దేశంలోకి నానాటికీ పెరుగుతున్న అక్రమ వలసలతో దేశ ఆర్థిక వ్యవస్థకు సవాల్‌గా మారింది. అలాగే దేశంలో అలజడులకు కారణమవుతోంది. పెరుగుతున్న జనాభాకు తోడు అక్రమంగా దేశంలోకి ప్రవేశిస్తున్న వారి కారణంగా పలు రాష్ట్రాలు తీవ్ర ఇక్కట్ల పాలవుతున్నాయి. దేశంలో అస్థిరతకు కారణం అవుతున్నారు. ఓటర్లుగా ఉన్న విదేశీయు లను మొన్నటి ఎన్నికలకు ముందు సర్ ప్రక్రియలో లక్షల్లో తొలగించారు. దీనిపై నాటి సిఎం మమతా బెనర్జీ నానా యాగీ చేశారు. అసలు ఎంతమంది ఉన్నారన్నదానికి లెక్కా పత్రం లేనంతగా ఇక్కడ అక్రమ వలసదారులు చేరిపోయారు. అమెరికాలో ట్రంప్ వచ్చాక నిర్దాక్షిణ్యంగా అక్రమ వలసదారు లను తన్‌ఇన తరిమేశారు. ప్రపంచ దేశాలు నిరసనలు వ్యక్తం చేసినా ట్రంప్ పట్టించుకోలేదు. ఇది ఓ హెచ్చరికగా అన చర్యలు నిలి చాయి. ఇప్పుడు భారత్ కూడా అలాంటి చర్యల ను కఠినంగానే తీసుకోక తప్పదు. ఈ క్రమంలో బెంగాల్లో అక్రమవలస దారులపై ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. ఇకపోతే అక్రమ వలసతకు చెక్ పెట్టడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. అక్రమ వలసలు, చొరబాట్లు, ఇతర అసాధారణ కారణాలతో దేశంలో జరుగుతున్న అసహజ జనాభా మార్పులపై అధ్యయ నానికి ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటిం చారు. ఈ సమస్య భారత దేశ సార్వభౌమత్వానికి, జాతీయ భద్రతకు, సామాజిక సమతుల్యతకు, గిరిజన సమాజాల పరిరక్షణకు పెనుసవాలుగా మారడంతో ఈ నిర్ణయం తీసు కున్నారు. ఈ కమిటీ ఏర్పాటుకు సంబంధించి గత ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం నాడు ప్రధాని మోదీ వాగ్దానం చేశారని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ప్రకాశ్ ప్రభాకర్ నవోలేకర్ అధ్యక్షత వహించే కమిటీలో మాజీ ఐఏఎస్ అధికారి దుర్గా శంకర్ మిశ్రా, మాజీ ఐపీఎస్ అధికారి బాలాజీ శ్రీవాస్తవ, ఆర్థికవేత్త డాక్టర్ షమికా రవి, జనగణన కమిషనర్ సభ్యులుగా ఉంటారని, హోంశాఖ సంయుక్త కార్యదర్శి సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తారని 'ఎక్స్'లో చేసిన పోస్టులో షా పేర్కొన్నారు. అక్రమ వలసలు, సరిహద్దుల్లో చొరబాట్లు, ఇతర అసాధారణ కారణాలతో దేశవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న మార్పులతో పాటు మత, సామాజికవర్గాల వారీగా అసాధారణ జనాభా మార్పుల సరళిని ఈ కమిటీ సమగ్రంగా విశ్లేషిస్తుందని తెలిపారు. ఈ సమస్యలకు అర్థవంతమైన, విధానపరమైన, కాలపరిమితి తో కూడిన పరిష్కారాలను ప్రభుత్వానికి సిఫారసు చేస్తుందని అమిత్ షా తెలిపారు. ఇదిలా వుంటే బెంగాల్లో అక్రంగా తిష్టవేసిన వారు ప్రభుత్వాలను శాసించే స్థాయికి చేరారు. మమతా బెనర్జి హయాంలో బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా చొరబడ్డవారు ఆధార్ కార్డులు, ఓటరు కార్డులు పొంది, స్థానికులనే సవాల్ చేసే స్థాయికి చేరారు. ఈ క్రమంలో కొత్తగా అధికారం చేపట్టిన సువేందు అధికారి నేతృత్వం లోని బిజెపి ప్రభుత్వం అక్రమ వసలదారులను తరిమేసే పనులు చేపట్టింది. కొంచెం కఠినంగానే హెచ్చరించింది. తన్ని తరిమేసే వరకు ఆగకుండా పారిపోవాలని హెచ్చరించింది. ఈ క్రమంలో సరిహద్దులకు బంగ్లా అక్రమచొరబాటుదార్లు చేరుకుంటున్న దృశ్యాలు చూస్తున్నాం. దీనిని బట్టి ఎంతగా ఇక్కడ తిష్టవేశారో అర్థం చేసుకోవచ్చు. ఇదంతా జరుగుతున్న క్రమంలోనే బెంగాల్లో కొత్త ప్రభుత్వం కఠిన చర్యలు ఇప్పుడు అక్కడ అక్రమవసలదారుల గుండెల్లో దడపుట్టిస్తోంది. తమ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకొనేలోపే రాష్ట్రం విడిచి పారిపో వాలని చొరబాటుదారులను సీఎం సువేందు అధికారి తీవ్రం గా హెచ్చరించారు. భారత్ నుంచి తమ పౌరులను తిరిగి స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నట్లు బంగ్లాదేశ్ ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిందని, వారిని తీసుకెళ్లడం ఆ దేశ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. చొరబాటుదారులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని జైలుకు పంపవద్దని కూడా పోలీసుల ను ఆదేశించారు. అసలు మనం వారికి ఆశ్రయం ఎందుకివ్వాలి? వారికోసం మన దేశ వనరులను ఎందుకు వృథా చేసుకోవాలి? ఈ చొరబాటుదారులేమైనా మన అల్లుళ్లా?' అని సువేందు ప్రశ్నించారు. గుర్తించండి, తొలగించండి, బహిష్కరించండి నినాదంతో రాష్ట్రంలో అక్రమంగా నివసిస్తున్న విదేశీ పౌరులను వెనక్కి పంపడానికి బెంగాల్ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. బంగ్లాదేశ్ అక్రమ వలసదారులపై విదే శీయుల చట్టం కిందే ఈ చర్యలు తీసుకుంటామని చెప్పారు. తక్షణం అక్రమవలసదారులు ఈ ప్రదేశాన్ని వదిలివెళ్లాల్సిం దేనని అన్నారు. తమ పౌరులను వెనక్కి తీసుకునే బాధ్యత బంగ్లాదేశ్ ప్రభుత్వంపైనే ఉందన్నారు. కాగా, అక్రమ వలసదా రులను వెనక్కి పంపించేందుకు బెంగాల్ ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేయడంతో బంగ్లాదేశీయులు స్వదేశానికి తిరుగు ముఖం పడుతున్నారు. ఉత్తర 24 పరగణాల జిల్లా లోని హకింపూర్ సరిహద్దు వద్ద మంగళవారం ఉదయం పెద్ద ఎత్తున వారు గుమిగూడారు. రాష్ట్రంలో ఎస్ఐఆర్ సమ యంలోనూ ఇలాంటి ఘటనలు అనేకంచోటు చేసుకు న్నాయి. ఈ క్రమంలో అక్రమ వలసదారులపై పశ్చిమ బెంగాల్ ప్రభు త్వం ఉక్కుపాదం మోపుతోంది. రాష్ట్రంలోకి అక్రమంగా చొర బడి.. చట్ట విరుద్ధంగా ఉంటున్న బంగ్లాదే శీయులు, రోహిం గ్యాల ను తక్షణమే నిర్బంధ కేంద్రాలకు తరలించాలని ఆదే శించింది. ఆయా జిల్లాల్లో నిర్బంధ కేంద్రాలను ఏర్పాటు చేయా లని సూచించింది. ఈ మేరకు రాష్ట్ర హోం శాఖ అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకు పట్టుబడిన విదేశీయులు, దేశ బహిష్కరణకు గురైన వారు, జైలు నుంచి విడుదలై.. తమ తమ దేశాలకు వెళ్లేందు కు ఎదురు చూస్తున్న విదేశీ ఖైదీలను తక్షణమే నిర్బంధ కేంద్రా లకు తరలించాలని ఆదేశించింది. ఈ మేరకు అన్ని జిల్లాల కలెక్టర్లకు రాష్ట్ర హోం శాఖ లేఖలు రాసింది. మొత్తంగా బెంగాల్లో ఏరివేత కారణంగా బీహార్, అసోం తదితర రాష్ట్రాల్లో వారు షెల్టర్ పొందకుండా చూడాలి. అక్కడి ప్రభు త్వాలు కూడా కఠినంగా వ్యవహరించాలి. అలాగే హైదరాబా ద్‌లో తిష్టవేసిన రోహిగ్యాలను కూడా పట్టుకని పంపించాలి.

# తెలుగు ప్రజలకు వరం సురవరం

## మే 28... సురవరం ప్రతాపరెడ్డి జయంతి



రామకిష్టయ్య సంగన భట్ల
9440595494

అవి తెలుగు భాషను గుర్తించని, స్థానిక ప్రాంతీయ భాషకు విలువలేని, తెలుగు భాషలో చదువు కోవడానికి కూడా సౌకర్యాలు అంతగా లేని రోజులు. నిజాం పాలకుల నిరంకుశ పాలనలో సామాజిక చైతన్యం దాదాపు శూన్య స్థితిలో స్తబ్ధంగా ఉన్న సమయం. తెలం గాణ ప్రాంతంలో అధికార భాష ఉర్దూ మాధ్యమంలో చదువులు సాగడం, ఉర్దూ లోనే ప్రభుత్వ, వ్యావహారిక కార్య క్రమాలు కొనసాగడం, చదువుకున్న వారు ఉర్దూ చదవటం ఒక హోదా చిహ్నం గా ప్రజలు భావించే కాలం. అప్పుడు రాజభాషగా, పాలనా భాషగా, వ్యవహారభాషగా ఉర్దూ ఉం డగా, ఉర్దూ భాషలోనే మీజాన్, జామీన్, రయ్యత్ పత్రికలు వచ్చేవి. అప్పటికి రెండు తెలుగు వార పత్రికలు మాత్రమే 'నీలగిరి' నల్లగొండ జిల్లా నుండి, 'తెలుగు' వరంగల్ జిల్లా నుంచి వెలువడు తుండేవి. అలాంటి నిజాం రాజ్యంలో, ప్రతికూల వాతా వరణంలో తెలుగు పత్రికని స్థాపించడమే ఓ సాహసం. ఉర్దూ, సంస్కృతం, మరాఠీ భాషలు రాజ్యమేలుతున్న నిజాం రాజ్యంలో తెలుగు సాహిత్యం నిలదొక్కు కునేందుకు 'గోలకొండ పత్రిక' బీజం వేసింది.

హైదరాబాద్ సంస్థానంలోని తెలుగు ప్రజల విజ్ఞానానికి తెలుగులో పత్రికను ప్రారంభించాలని నిశ్చయించారు. అంధకార బంధుర మైన నాటి పరిస్థితులలో గోలకొండ పత్రిక అనే చిరుదివ్వెను వెలిగించి తన బహుముఖ ప్రజ్ఞతో సంస్థలను, ఉద్యమాలను నిర్మించి, ప్రజల చైతన్యాన్ని తట్టిలేపే బృహత్తర కార్యక్రమం ప్రారంభించారు సురవరం ప్రతాపరెడ్డి. మాతృ భాషలో చదువుకొనే అవకాశాలు లేక అంతా ఉర్దూమయమై, నిజాం నిరంకుశ పరిపాలనలో, నిద్రాణ స్థితిలో ఉన్న తెలంగాణను జాగృతం చేయాలన్న సురవరం దీక్ష ఫలితమే... 1926 మే 19న గోలకొండ పత్రిక ప్రారంభ నేపథ్యం. ఆ పత్రిక వారానికి రెండు మార్లు వెలువడు తుండేది. పత్రిక నిర్వహణలో ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నారు. జాతీయ భావాలను ధైర్యంగా ప్రచారం చేశారు. 1947 లో అది దినపత్రికగా మారింది. నిజాంను తన పత్రికలలో ఏకిపారేస్తూ దూకుడుగా వ్యవహరించేవారు సురవరం. ఒక దశలో నిజాం రాజు గోలకొండ సంపాదకీయాలకు భయపడ్డారంటే... ఆయన కలం నిజాం ను ఎంత కలవర పరిచిందో అర్థం చేసుకోవచ్చు.


పత్రిక ఆదర్శాలను గురించి వివరిస్తూ ప్రతాపరెడ్డి ఒక సంపాదకీయంలో... "మేము మా పత్రిక స్థాపన కాలం నుండియు రెండంశములు దృష్టి పథమందుంచు కొని దేశీయులకు సేవ చేయుచున్నాము. మొదటిది ఆంధ్రాభాషా సేవ, రెండవది జాతి, మత, కుల వివక్షత లేక ఆంధ్రులలో సర్వశాఖల వారి యొక్క సత్వరాభి వృద్ధికై పాటుపడుట".

ఈ ఆశయాన్ని నెరవేర్చేందుకే ప్రతాపరెడ్డి క్షణం విశ్రాంతి లేకుండా ఎనలేని కృషి చేశారు. గోలకొండ పత్రికకి సురవరమే సర్వస్వంగా ఉండేవారు. సంపాదకుడి దగ్గర నుంచి ప్రూఫ్ రీడరు వరకూ అన్ని బాధ్యతలూ నెత్తిన వేసుకుని పత్రికను నడిపించే వారు. గోలకొండ ప్రతాపరెడ్డి ప్రతిభకు అద్దం పట్టింది. తెలంగాణ ప్రజానీకాన్ని జాగృత పరచటంలో అద్భుత పాత్రను నిర్వహించింది. గోల్కొండ పత్రిక, దానికి అనుబంధంగా భారతి సాహిత్య పత్రిక, ప్రజావాణి పత్రికలను స్థాపించి పత్రికా సంపాదకుడిగా,రచయితగా సేవలు అందించారు. ఆయన రాసిన వ్యాసాలూ, పద్యాలూ, విమర్శలూ, సంపాదకీయాలూ 1000కి మించి ఉంటాయి. ఇతర పత్రికల్లో 100కు పైగా వ్యాసాలు రాసి ఉంటారు. కథానికలూ, కవితలూ రాశారు. పత్రికలో కొన్ని శీర్షికలని స్వయంగా నిర్వహించారు. చిత్రగుప్త, భావకవి, రామ్మూర్తి, యుగపతి సింహ, సంగ్రామసింహ మొదలైన ఎన్నో మారుపేర్లతో ఆయన అసంఖ్యాక రచనలు చేశారు. 1896 మే 28 తేదీన జన్మించిన సురవరం కర్నూలులో ప్రాథమిక విద్యాభ్యాసం చేశారు. వెల్లాల శంకరశాస్త్రి వద్ద సంస్కృత కావ్యాలు, వ్యాకరణం చదువు కొన్నారు. నిజాం కాలేజీలో ఎఫ్.ఎ. మద్రాసు ప్రెసిడెన్సి కాలేజిలో బి.ఏ. చదివిన తర్వాత బి.ఎల్. చదివి న్యాయవాద వృత్తిని చేపట్టారు. కాని ఎంతో కాలం ఆ వృత్తిలో ఉండలేక పోయారు.

గాంధీజీ నాయకత్వంలో సాగుతున్న స్వాతంత్ర్య పోరాటం ఆయనను ఆకర్షించింది. తెలంగాణ ప్రజల దైన్యం, దారిద్ర్యం, ప్రాథమిక హక్కులను కూడా నోచుకోని దుస్థితి చూచి చలించి పోయారు. భావుకుడైన రచయితగా, సురవరం కథలు నిజాం కాలం నాటి ప్రజల జీవితాన్ని ఉన్నదున్నట్లుగా చిత్రించినవి.

1924లో హైదరాబాద్ లోని రెడ్డి హాస్టల్ కార్యదర్శిగా నియమితులై, ప్రతాపరెడ్డి హాస్టల్ విద్యార్థులలో క్రమశిక్షణ నెలకొల్పి వారిని చైతన్య వంతులను కావించి, నాటి కొత్వాల్ అయిన రాజా బహదుర్ ఆశీస్సులతో 1926 మే 10వ తేదీన 'గోలకొండ' పత్రి కను ప్రారంభించారు. పోలీస్ చర్య వరకు ప్రతాపరెడ్డి 'గోలకొండ' పత్రికా సంపాదకులుగా పనిచేసారు. 1930లో మెదక్ జిల్లా జోగిపేటలో జరిగిన మొట్టమొదటి 'ఆంధ్ర మహాసభ'కు అధ్యక్షత వహించారు. కార్యాకలాపాలన్ని తెలుగులోనే జరగాలంటూ తీర్మానం చేయించారు.

1951 లో ప్రతాపరెడ్డి పులిజాల హనుమంతరావు తో కలిసి 'ప్రజావాణి' దినపత్రికను స్థాపించి రెండేళ్ళు నడిపారు. ఆంధ్రుల చరిత్ర, సంస్కృతి పట్ల ప్రగాఢమైన అభిమానం ఉండేది. ప్రజలలో విజ్ఞాన వికాసానికి గొప్ప రచనలు చేశారు. తెలంగాణా ప్రజల భాషనుకాని, సంస్కృతినిగాని తక్కువ చేసి మాట్లాడితే సహించేవారు కాదు. తెలంగాణలో తెలుగు కవులు లేరన్న ముడుంబ వెంకట రాఘవాచార్య వ్యాఖ్యలకు స్పందించి, 354 మంది తెలంగాణ కవుల పరిచయాలతో కూడిన 'గోల్కొండ కవుల సంచిక'ను విడుదల చేశారు సురవరం. ఆయన నిజాం రాష్ట్ర పాలన, మొగలాయి కథ లు, సంఘోద్ధరణ, ఉచ్ఛల విషాదము, గ్రంథాలయము, హిందువుల పండుగలు, హైందవ ధర్మవీరులు, యువజన విజ్ఞానం మొదలైన రచనలు, దాదాపు 40 గ్రంథాలు రచించారు. సురవరం రచించిన 'ఆంధ్రుల సాంఘిక చరిత్రకు 'కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు' లభించింది. దానిలో



దాదాపు వెయ్యేళ్ల ఆంధ్రుల చరిత్రను నమోదు చేశారు. తెలంగాణలో గ్రంథాలయోద్యమంలో ప్రతాపరెడ్డి ప్రముఖపాత్ర వహించారు. 1942లో ఆంధ్ర గ్రంథాలయ మహాసభకు అధ్యక్షత వహించారు. 1943లో ఖమ్మంలో జరిగిన గ్రంథాలయ మహాసభకు, 1944లో జరిగిన ఆంధ్ర సారస్వత పరిషత్తుకు ఆయనే అధ్యక్షులు. 1952 లో జరిగిన శాసన సభ ఎన్నికల్లో, మిత్రుల ఒత్తిడిపై వనపర్తి నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పక్షాన పోటీచేసి విజయం సాధించారు. కాని రాజకీయాలు ఆయనకంతగా రుచించలేదు. త్యాగము, దేశభక్తి, భాషాభిమానం ప్రజా శ్రేయస్సు పరమార్థంగా జీవించిన సురవరం ప్రతాపరెడ్డి 1953 ఆగష్టు 25న దివంగతులయ్యారు.

అయన సేవలు అందుకొనని సంస్థ తెలంగాణలో లేదంటే అతిశయోక్తి కాదు. ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షులుగా పనిచేశారు. శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం, వేమన ఆంధ్ర భాషా నిలయం, హిందీ ప్రచారసభ తదితర సంస్థల ప్రగతికి ఎంతో కృషి చేశారు. తెలుగు జాతికి అయన చేసిన సేవలకు గుర్తింపుగా హైదరాబాదులోని ట్యాంక్ బండ్ పై ప్రతిష్ఠించిన విగ్రహాలలో సురవరం విగ్రహం ఉంది. తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతం, ఫారసీ, ఆంగ్ల భాషలలో నిష్ణాతులుగా, పత్రికా సంపాదకులుగా, న్యాయవాదిగా, రచయితగా, సంఘ సంస్కర్తగా, ప్రజా ప్రతినిధిగా, చరిత్ర కారునిగా, పరిశోధకుడుగా, పండితుడుగా, క్రియాశీల ఉద్యమ కారుడుగా బహుముఖాలుగా సాగిన సురవరం ప్రతాపరెడ్డి ప్రతిభ, కృషి అనన్యమైనవి. తెలంగాణ సాంస్కృతిక చరిత్రలో సురవరం ఒక అధ్యాయం. ఆయన తెలుగు ప్రజలకు వరం..

**వ్యాసకర్త : సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్.**

## కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఎంఎస్పీ ఆర్డర్ ప్రతుల దహనం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, మే 27 : రైతులకు కనీస మద్దతు ధర (ఎంఎస్పీ)పై ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయకుండా రైతాంగాన్ని మోసం చేస్తోందని ఆరోపిస్తూ భద్రాద్రి జిల్లా పాల్వంచ మండలం చంద్రాలగూడెంలో బుధవారం ఎంఎస్పీ ఆర్డర్ ప్రతులను దహనం చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) పిలుపు మేరకు నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో అఖిల భారత రైతుకూలీ సంఘం (ఏఐకేఎంఎస్) నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రారెడ్డి మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు స్వామినాథన్ కమిటీ సిఫారసుల ప్రకారం వ్యవసాయ ఉత్పత్తి వ్యయంపై సీ2ం50 శాతం కనీస మద్దతు ధర అమలు చేస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే 12 ఏళ్లు గడిచినా ఆ హామీ అమలు కాలేదని విమర్శించారు. కేంద్ర ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ ఉపసంఘం 14 రకాల పంటలకు ఎంఎస్పీ ప్రకటించినప్పటికీ రైతులకు గిట్టుబాటు ధరలు అందడం లేదన్నారు. దేశవ్యాప్తంగా రైతులు ఆందోళనలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం



స్పందించకుండా మౌనం వహిస్తోందని ఆరోపించారు. అమెరికా నుంచి దిగుమతి అవుతున్న పత్తిపై జీరో సుంకం విధించడం వల్ల భారత రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, దళారుల చేతిలో మోసపోతున్నారని తెలిపారు. డబ్ల్యూటీఓ విధానాలకు లోబడిన కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలు రైతాంగానికి హానికరమని విమర్శించారు. ఈ నెల 27 నుంచి 31 వరకు జిల్లా, మండల, గ్రామ కేంద్రాల్లో ఎంఎస్పీ ఆర్డర్ కాపీల దహనం కార్యక్రమాలు చేపట్టాలని ఇచ్చిన పిలుపులో భాగంగానే ఈ నిరసన నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు ఉప్పరపోయిన రామ్మూర్తి, కురుసం బుచ్చయ్య, గుమ్మడి మారయ్య, గుమ్మడి నరసయ్య, తాటి నాగేష్, ఊకే బాబు, ఇడమ, పండు, బీమా, రాధా, రమ, లక్ష్మి, రాములమ్మ, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన గ్రామాల అభివృద్ధికి శాఖల సమన్వయం అవసరం

**- పెండింగ్ అటవీ అనుమతులపై సమీక్షలో భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్**

**- సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు తెల్లం వెంకటరావు, పాయం వెంకటేశ్వర్లు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి కొత్తగూడెం, మే 27 : భద్రాచలం, పినపాక నియోజకవర్గాల్లో అటవీ, రెవెన్యూ భూ సమస్యలు, అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ అటవీ అనుమతులపై భద్రాచలం ఐటిడిఏలో బుధవారం జిల్లా కలెక్టర్ అంకిత్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణగౌడ్, ఐటిడిఏ పీఓ రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో అభివృద్ధి పనులకు అవసరమైన అటవీ అనుమతులు, భూసేకరణ, డీఎల్సీ అనుమతులు, పోడు సమస్యలు, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, అటవీ, రెవెన్యూ భూ సమస్యల పరిష్కారానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అభివృద్ధి పనులకు సంబంధించిన అటవీ అనుమతులు, భూసేకరణ, డీఎల్సీ అంశాలు ఎక్కువకాలం పెండింగ్‌లో ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గిరిజన ప్రాంతాల్లో రహదారులు, విద్యుత్, త్రాగునీటి వంటి మౌలిక సదుపాయాల పనులు వేగవంతం చేయాలని తెలిపారు. ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు, డీఎల్సీ కేసులను ప్రత్యేకంగా పరిశీలించి అర్హులైన గిరిజనులకు న్యాయం చేయాలని సూచించారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు మాట్లాడుతూ, చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో రహదారులు, విద్యుత్, త్రాగునీటి పనులకు సంబంధించిన అనుమతులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. గిరిజనులకు మౌలిక సదుపాయాలు కల్పించడం అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు. అర్హులైన గిరిజన రైతులకు పోడు పట్టాలు, వెదురు




మొక్కలు అందించి వ్యవసాయానికి ప్రోత్సహించాలని కోరారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఐటిడిఏ పరిధిలో రూ.28.39 కోట్ల, పంచాయతీరాజ్ శాఖలో రూ.6.50 కోట్ల, ఆర్ అండ్ బి శాఖలో రూ.67 కోట్ల అభివృద్ధి పనులు అటవీ అనుమతుల కోసం పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. భూసేకరణ, క్రీడా స్థలాలు, అంగన్‌వాడీ భవనాలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పోడు రైతులకు బోర్‌వెల్ అనుమతులు కూడా ఇవ్వాలని కోరారు. జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణగౌడ్ మాట్లాడుతూ జిల్లాలో 58 శాతం అటవీ ప్రాంతం ఉన్నందున ప్రతి అభివృద్ధి పనికి అటవీ అనుమతులు అవసరమని తెలిపారు. సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని చెప్పారు. ఐటిడిఏ పీఓ రాహుల్ మాట్లాడుతూ పోడు పట్టాల్లో పేర్ల పొరపాట్లు, పాస్‌బుక్స్ జారీ కాకపోవడం, డీఎల్సీ అనుమతులు పెండింగ్‌లో ఉండటం, బోర్‌వెల్, విద్యుత్ లైన్ అనుమతుల సమస్యలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ఇప్పటివరకు 1076 దరఖాస్తులు అటవీ శాఖకు పంపగా 254 మందికి అనుమతులు లభించాయని వెల్లడించారు. గిరిజన గ్రామాల అభివృద్ధికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డిఆర్ఓ పద్మావతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## సింగరేణి పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి యాజమాన్యం సానుకూల స్పందన

**- ఉచిత వైద్యం, ప్రత్యేక విభాగం**

**- ఏర్పాటుపై బిఎంఎస్ ప్రతినిధులకు హామీ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 27 : సింగరేణి పెన్షనర్ల వైద్య మరియు ఇతర సమస్యల పరిష్కారానికి సింగరేణి యాజమాన్యం సానుకూలంగా స్పందించింది. బుధవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో డైరెక్టర్ (పా) గౌతమ్ పొత్రుతో భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) అనుబంధ సింగరేణి పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు సమావేశమై పలు సమస్యలను వివరించారు. ఈ సమావేశంలో సీఎంపీఎఫ్ ట్రస్ట్ బోర్డు సభ్యులు కొత్త కాపు లక్ష్మారెడ్డి, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం. రమాకాంత్, అడ్వైజర్ పులి రాజిరెడ్డి పాల్గొని పెన్షనర్ల వైద్య సౌకర్యాలు, మెడికల్ రీయంబర్స్‌మెంట్, సిపిఆర్ఎంఎస్ విధానాలపై సుదీర్ఘంగా చర్చించారు. సిపిఆర్ఎంఎస్ కార్డులు లేని మాజీ కార్మికులకు కూడా సింగరేణి ఆసుపత్రుల్లో ఉచిత వైద్యం అందించేందుకు డైరెక్టర్ గౌతమ్ పొత్రు సానుకూలత వ్యక్తం చేశారు. అలాగే సింగరేణి ఆసుపత్రుల్లో పెన్షనర్ల కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయడానికి అంగీకరించారు. పెన్షనర్లకు ప్రతి మూడు నెలలకు ఒకసారి మందులు అందించాలని, మెడికల్ బిల్లుల రీయంబర్స్ మెంట్‌ను 45 రోజుల్లోగా పూర్తి చేయాలని సంఘం నాయకులు కోరారు. అదేవిధంగా పెన్షనర్లు నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోని మెడికల్ షాపుల ద్వారా మందులు పొందే సౌకర్యం కల్పించాలని, ప్రతి సభ్యునికి వార్షిక వైద్య ఖర్చుల కోసం రూ.25 వేల వరకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. సిపిఆర్ఎంఎస్ పరిమితిని ప్రస్తుతం ఉన్న రూ.8 లక్షల నుండి రూ.15 లక్షలకు పెంచాలని, ఆసుపత్రుల్లో వైద్యం పొందిన ప్రతిసారీ సంబంధిత సభ్యుల ఫోన్‌కు ఎస్ఎంఎస్ సమాచారం పంపించే విధానం అమలు చేయాలని కోరారు. పెన్షనర్ల డిమాండ్లపై సానుకూలంగా స్పందించిన డైరెక్టర్ గౌతమ్ పొత్రు, సమస్యలను త్వరలోనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.




# మహిళా సంఘాలకు రూ.324 కోట్ల రుణాలు

## వనపర్తి శాసనసభ్యులు తుడి మేఘారెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, మే, 27 : వనపర్తి జిల్లాలో మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. మహిళా సంఘాలకు ఇప్పటివరకు రూ.324 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు ఆయన వెల్లడించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లా మహిళా సమైక్య ఆవరణలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందు మహిళా సమాఖ్య భవనంలో నూతనంగా ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ హాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబనే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాలనలో మహిళలకు పావలా వడ్డీ రుణాలు అందించారని, ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం వడ్డీ లేని రుణాలను అందిస్తూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తోందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మహిళా సంఘాలు నిర్వీర్యమయ్యాయని విమర్శించిన ఎమ్మెల్యే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిందన్నారు. వనపర్తి నియోజకవర్గానికి సంబంధించిన మహిళల ఉచిత ప్రయాణానికి ఇప్పటివరకు రూ.30 కోట్ల 32 లక్షలు ప్రభుత్వం చెల్లించినట్లు తెలిపారు. 1996లో మహిళా సంఘాలు ఏర్పడినప్పుడు కేవలం రూ.10 వేల రుణాలు మాత్రమే ఇచ్చేవారని, ప్రస్తుతం మహిళా సంఘాలకు రూ.20 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 12,700 మహిళా సంఘ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, వనపర్తి నియోజకవర్గంలో 104 మహిళా సంఘ భవనాల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. మహిళా సంఘాల సభ్యులకు రూ.10 లక్షల బీమా సౌకర్యం కూడా కల్పిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ చిన్నారులకు యూనిఫాంలను పంపిణీ చేశారు. అనంతరం డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా సంఘాల ఉత్పత్తుల స్టాళ్లను ఎమ్మెల్యే సందర్శించి మహిళలను అభినందించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ కిమ్యా నాయక్, డీఆర్‌డీఓ ఉమాదేవి, మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి రమేష్, జిల్లా సమైక్య అధ్యక్షురాలు ఇందిర, మండల సమాఖ్య అధ్యక్షురాలు సంధ్యారాణి, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రైతు వ్యతిరేక పాలనకు సొంత ఇలాకే నిదర్శనం..



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వికారాబాద్ (బొంరాస్‌పేట), మే 27 : సీఎం రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న రైతు వ్యతిరేక పాలనకు ఆయన సొంత ఇలాకే అద్దం పడుతుందని కొడంగల్ నియోజకవర్గ భాజపా ఇన్చార్జి బంటు రమేష్ సీఎం రేవంత్ రెడ్డి పరిపాలన నుద్దేశించి ఘాటుగా విమర్శించారు. బుధవారం బొంరాస్ పేట మండల కేంద్రం లో ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఉప్పరి జగదీశ్వర్ సాగర్ ఆద్వర్యం లో చేపట్టిన రైతు గోస రైతు భరోసా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు. పార్టీ శ్రేణులతో కల్సి మండల కేంద్రం లోని వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి ధాన్యం విక్రయం లో రైతులు పడుతున్న గోసను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం తన సొంత ఇలాకాలోనే అనుసరిస్తున్న రైతు వ్యతిరేక పాలన పై ఆయన నిప్పులు చెరిగారు. ఆరుగాలం శ్రమించి తాము పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నా సీఎం కు సోయి లేదని ఆయన సిఎం రైతు వ్యతిరేక విధానం పై మండిపడ్డారు. ధాన్యం కొనుగోలు లో సంభందిత అధికారులు మరియు నిర్వాహకులు రైతుల వద్ద నుండి తూకం లో తరుగు పేరిట 12 కిలోలు తరుగు తీస్తూ మోసాలకు పాలపడుతున్నారని మండిపడ్డారు.నరేంద్ర మోదీ నేతృత్వం లోని కేంద్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి కై పెద్ద పీట వేసిందని ఆయన కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలను వివరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా కేంద్ర ప్రభుత్వం సుత్తిలి, డబ్బనం నుండి మొదలు అన్ని వసతులు కల్పించి నట్టు ఆయన తెలిపారు. కానీ కొనుగోలు కేంద్రాల వద్ద నిర్వాహకులు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదని తేల్చి చెప్పారు. ఇక నైన సీఎం ఏసీ గదుల్లో మొద్దు నిద్ర వీడి ధాన్యం కొనుగోలు లో జాప్యం లేకుండా రైతు పండించిన ఆఖరి గింజ వరకు మద్దతు ధర చెల్లించి తక్షణమే ధాన్యం కొనుగోలు చేయాలని లేనిచో రైతుల ఆగ్రహానికి గురి కాక తప్పదని ఆయన హెచ్చరించారు. భాజాపా చేపట్టిన ఈ రైతు గోస బీజేపీ భరోసా కార్యక్రమం లో పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు ఓ బీ సి మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాబయ్య నాయుడు, వీర శైవ మండల అధ్యక్షుడు ఉప్పు జగదీష్, రాజా రామ్ రెడ్డి, మల్లేశం, డప్పు జనార్దన్, గణేష్ నాయక్, ఉప సర్పంచ్ రాజు నాయక్, వార్డు మెంబర్ మహేందర్, పుట్టి యాదగిరి, అనిల్ నాయక్, సుధాకర్ నాయక్, పాలేపల్లి మహేందర్ గౌడ్, నారాయణ, మెదరి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తాం

## జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, మే 27 : వాతావరణ ప్రతికూల ప్రభావంతో అకాల వర్షాలు పడుతున్నాయని,రైతులు అధైర్యపడవద్దనీ,ప్రభుత్వ యంత్రాంగం అండగా ఉందని క్షేత్రస్థాయిలో తడిసిన ధాన్యాన్ని బాయిల్డ్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి అదనపు కలెక్టర్ నగేష్ జిల్లాలోని తాసిల్దార్లు ఆర్డీవోలు, ఎంపీడీవోలు,జిల్లా పౌరసరఫరాల అధికారులతో కలిసి కలెక్టర్ గూగుల్ మీట్ నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ ప్రతికూల ప్రభావంతో జిల్లాలో వర్షం. పడడం జరిగిందని ప్రభుత్వ యంత్రాంగం క్షేత్రస్థాయిలో (04) వేల క్వింటాళ్ల తడిచిన ధాన్యం ఉన్నట్లు నివేదికలు అందించడం జరిగిందన్నారు. కుల్చారం,కౌడిపల్లి,టేక్మాల్, శంకరంపేట,( ఏ) మండలాల్లో అత్యధిక వర్షపాత నమోదయిందని ఈ మండలాల్లో ధాన్యం కేంద్రాలలో తడిచినట్లు వివరించారు. తడిసిన ధాన్యానికి కొనుగోలు చేసే విధంగా బాయిల్డ్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకుంటామని రైతులెవరు అధైర్యపడవద్దని కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు 59 వేల 227 మంది రైతులు నుండి 2,76,776.600 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 39,879 రైతులకు గాను రూ.441.15 కోట్ల రూపాయలు ఎకౌంట్లలో జమ చేశామని,18 సెంటర్లలో ధాన్యం కొనుగోలు పూర్తిచేసుకుని ముగించడం జరిగిందని వివరించారు. వాతావరణ ప్రతికూల ప్రభావం నేపథ్యంలో రైతులకు ఎప్పటికప్పుడు వాతావరణ పరిస్థితులను అవగాహన కల్పిస్తూ ధాన్యం వర్షానికి తడవకుండా రక్షించుకునే విధంగా టార్పోలిన్సు అందుబాటులో ఉంచాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని ఎగుమతి వేగాన్ని పెంచి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అకాల వర్షాలతో ధాన్యం తడవకుండా రైతులకు టార్పాలిన్స్ అందుబాటులో ఉంచామని చెప్పారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో టోకెన్ జారీ నుంచి మిల్లులకు తరలింపు వరకు ప్రతి అంశాన్ని పారదర్శకంగా నమోదు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. టోకెన్ పొందిన రైతుల సంఖ్య,ప్రతి టోకెన్‌కు అనుగుణంగా ఎన్ని లారీలు, ట్రాక్టర్లు పంపించారో స్పష్టమైన రికార్డులు నిర్వహించాలని సూచించారు. ధాన్యం నిల్వలు,గన్ని సంచుల లభ్యత,కాంటా పూర్తయిన తర్వాత మిగిలి ఉన్న ధాన్యం బస్తాల వివరాలు,రిజిస్టర్ నిర్వహణ, తదితర అంశాలపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రతి మిల్లుకు ఏ సమయానికి వాహనాలు బయలుదేరాయో, ఇప్పటివరకు మొత్తం ఎన్ని లారీలు వెళ్లాయో,ట్రక్ షీట్‌లో నమోదు చేసిన వివరాలు సరిపోలేలా చూడాలని తెలిపారు. కేంద్రాల్లో ప్రస్తుతం ఎన్ని కళ్లాల్లో ధాన్యం నిల్వలో ఉందో,ఎన్ని వాహనాల ఎంట్రీలు నమోదయ్యాయో కూడా నిరంతరం నవీకరణ చేయాలని ఆదేశించారు. ధాన్యం తేమ (వీశీఱర్‌బతీవ) శాతాన్ని టోకెన్ వారీగా నమోదు చేసి,నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి వ్యత్యాసాలు లేకుండా అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. ఈగూగుల్ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, మెదక్, తూప్రాన్,నర్సాపూర్ ఆర్డీవోలు రమాదేవి, జయచంద్రారెడ్డి,రామకృష్ణ, జిల్లా పౌరసరఫరాల అధికారులు నిత్యానంద్, జగదీష్, తహసిల్దార్లు, ఎంపీడీవోలు, తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం రవాణాకు అదనపు లారీలు సమకూర్చాలి


## వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, మే, 27 : వనపర్తి జిల్లాలో వరి ధాన్యం రవాణా, అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. రైతులు చెల్లించిన రవాణా ఖర్చులను కాంట్రాక్టర్ ద్వారా తిరిగి రైతులకు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బుధవారం పెద్దమందడి మండల పరిధిలోని సప్తగిరి మరియు శ్రీ భవాని శంకర ఇండస్ట్రీస్ రైస్ మిల్లులను అదనపు కలెక్టర్ వినోద్ కుమార్‌తో కలిసి కలెక్టర్ సందర్శించి వరి ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా రైస్ మిల్లర్లతో మాట్లాడిన కలెక్టర్, వరి అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. అవసరమైతే అదనపు హమాలి కార్మికులను ఏర్పాటు చేసుకుని, లారీలను ఎక్కువసేపు నిలిపివేయకుండా వెంటనే అన్‌లోడ్ చేయాలని సూచించారు. గోదాముల్లో వరిని భద్రంగా నిల్వ చేయాలని తెలిపారు. శ్రీ భవాని శంకర ఇండస్ట్రీస్ వద్ద మిల్లర్‌తో మాట్లాడిన కలెక్టర్, అదనపు నిల్వ స్థలాన్ని వెంటనే సిద్ధం చేయాలని సూచించారు. తద్వారా మరింత వరి నిల్వ చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు వరి తరలించేందుకు ప్రైవేట్ లారీలను కూడా వినియోగించాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లాలో వరి నిల్వల కోసం అదనపు స్థలాలను గుర్తించాలని అధికారులకు సూచించారు. ఐకేపీ కొనుగోలు కేంద్రం సందర్శన పెద్దమందడి మండల కేంద్రంలోని ఐకేపీ వరి కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి ఇప్పటివరకు ఎన్ని వరి సంచులు తరలించారో, ఇంకా ఎన్ని సంచులు కొనుగోలు చేయాల్సి ఉందో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు లారీల కొరత తీవ్రంగా ఉందని, వరిని మిల్లులకు తరలించేందుకు అదనపు లారీలు ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరారు. ప్రస్తుతం రవాణా ఖర్చులను తామే భరిస్తున్నామని రైతులు తెలిపారు. దీనిపై స్పందించిన కలెక్టర్, రవాణా కాంట్రాక్టర్‌తో మాట్లాడి వెంటనే మరిన్ని లారీలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రైతులు చెల్లించిన రవాణా ఖర్చులను కాంట్రాక్టర్ నుంచి వసూలు చేసి రైతులకు తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి కాశీ విశ్వనాథ్, తహసీల్దార్ పాండు నాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతే రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాది : ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, మే 27 : మహిళల సాధికారత కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి మహిళా వారోత్సవాలు జిల్లా మహిళా సమాఖ్య భవనంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన "ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా "మహిళా ప్రగతి -- తెలంగాణ ఉన్నతి" అనే నినాదంతో ఈ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధే రాష్ట్ర ప్రగతికి బలమైన పునాది అని అన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదిగి కుటుంబాలతో పాటు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. ప్రభుత్వం మహిళల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ప్రతి మహిళ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. మహిళల సంక్షేమం, ఉపాధి, విద్య, ఆరోగ్య రంగాలకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా ప్రభుత్వం పూర్తి సహ కారం అందిస్తోందని, మహిళా శక్తి అభివృద్ధి చెందితే తెలంగాణ మరింత ప్రగతి సాధిస్తుందని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ మాట్లాడుతూ మహిళా సంఘాలు గ్రామీణాభివృద్ధికి వెన్నెముకలుగా నిలుస్తున్నాయని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉపాధి, సంక్షేమ పథకాలను వినియోగించుకొని మహిళలు ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని సూచించారు. మహిళల అభివృద్ధికి జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీఎంలు నాగమల్లిక, కె. ప్రభాకర్, ఆనంద్ తదితరులు పాల్గొని మహిళా సంఘాల అభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. మహిళా సంఘాల సభ్యులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి మహిళా శక్తిని ప్రతిబింబించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ ఉమాదేవి, వనపర్తి మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్ఎల్ఎన్ మాధవి, అదనపు డీఆర్‌డీఓ సరోజ, జెడ్ఎంఎస్ అధ్యక్షురాలు ఇందిరా, జిల్లాలోని ఏడు మండలాల ఎంఎంఎస్ అధ్యక్షులు పాల్గొన్నారు



# రాష్ట్ర ఆవిర్భావ వేడుకల నిర్వహణపై సమీక్ష

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, మే 27 : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జూన్ 2న జీఎం కాలనీలోని గోదావరికళా ప్రాంగణంలో ఘనంగా నిర్వహించనున్నట్లు ఆర్జీ-1 జీఎం లలిత్ కుమార్ తెలిపారు. బుధవారం జీఎం కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో వివిధ విభాగాల అధికారులతో వేడుకల ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావ వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రకాల వసతులు, ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సాయంత్రం గోదావరికళా ప్రాంగణంలో తెలంగాణ సంస్కృతి, వైభవాన్ని ప్రతిబింబించే ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రదర్శనలు నిర్వహించడంతో పాటు ఉత్తమ ఉద్యోగులను సన్మానించనున్నట్లు తెలిపారు. ఈ కార్య క్రమంలో సింగరేణి ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, యూనియన్ ప్రతినిధులు, అధికారులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జూన్ 2 ఉదయం జీఎం కార్యాలయంలో తెలంగాణ తల్లి, ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహాలకు, అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించనున్నట్లు తెలిపారు. అనంతరం జాతీయ జెండా ఆవిష్కరణ, తెలంగాణ అధికారిక గీతాలాపన నిర్వహించి, జీఎం కార్యాలయం నుంచి తెలంగాణ తల్లి విగ్రహం వరకు భారీ ర్యాలీ చేపట్టనున్నట్లు వెల్లడించారు. సమీక్షా సమావేశంలో ఎస్వో టు జీఎం చంద్రశేఖర్, ఎసియంఓ డాక్టర్ అంబిక, ఏజెంట్లు చిలుక శ్రీనివాస్, ఎల్.రమేష్, ప్రాజెక్టు ఆఫీసర్ రమేష్, ఏజీఎంలు అంజనేయులు, రాంమోహన్ రావు, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ సాయి ప్రసాద్, డీజీఎంలు వరప్రసాద్, జితేందర్ సింగ్, ధనలక్ష్మీ భాయ్, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, అధికారులు సురేష్, రాజేష్, బ్రహ్మాజీ రావు, హనుమంతరావు, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వేలాది విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శి దరిపల్లి అనంతరాములు

## - ఘనంగా దరిపల్లి అనంతరాములు 5వ వర్ధంతి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



యాదాద్రి భువనగిరి, మే 27 : విద్యావేత్త, సమాజ సేవకుడు, బీసీల హక్కుల సాధన కోసం కృషి చేసిన స్వర్గీయ దరిపల్లి అనంతరాములు గారి 5వ వర్ధంతిని బుధవారం భువనగిరిలోని వాత్సల్య ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. వాత్సల్య గ్రూప్ చైర్మన్ దరిపల్లి నవీన్ కుమార్, డాక్టర్ దరిపల్లి కిరణ్ కుమార్, దరిపల్లి ప్రవీణ్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ దరిపల్లి అనంతరాములు విద్యను సామాజిక మార్పుకు ఆయుధంగా భావించి వేలాది మంది గ్రామీణ విద్యార్థులకు ఉన్నత విద్య అందుబాటులోకి తీసుకువచ్చారని తెలిపారు. భువనగిరి, ఖమ్మం, ఇల్లందు ప్రాంతాల్లో పలు విద్యాసంస్థలను స్థాపించి పేద విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసారని పేర్కొన్నారు. ఆయన స్థాపించిన విద్యాసంస్థల ద్వారా చదువుకున్న అనేక మంది దేశ విదేశాల్లో ఉన్నత స్థాయిలో సేవలందిస్తున్నారని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమంలోనూ ఆయన చురుకుగా పాల్గొని విద్యార్థుల్లో చైతన్యం నింపారని తెలిపారు. బీసీల అభ్యున్నతి కోసం జీవితాంతం పోరాడిన నాయకుడిగా ఆయన నిలిచిపోయారని కొనియాడారు. ఈ సందర్భంగా రాయగిరిలోని సహృదయ అనాధ ఆశ్రమంలో వస్త్రాల పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు కార్యక్రమంలో దరిపల్లి కుటుంబ సభ్యులు, అధ్యాపకులు, పూర్వ అధ్యాపకులు, బీసీ సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కుమ్మర కుల బాంధవులు పాల్గొన్నారు.



# పండించిన పంటలు అమ్ముకోవడానికి రైతులు కన్నీళ్లు పెట్టాలా..?

## - బీజేపీ పట్టణ అధ్యక్షులు ధోనికెలనవీన్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, మే 27 : రైతులు పండించిన పంటలు అమ్ముకోవడానికి కొనుగోళ్ల కేంద్రాల వద్ద రైతులు కన్నీళ్లు పెట్టాల్సిన పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏర్పడిందని మెట్పల్లి బిజెపి పట్టణ అధ్యక్షుడు దొనికెల నవీన్ విమర్శించారు. అకాల వర్షంతో పండించిన పంట రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో వర్షపు నీటి పాలవుతుంటే రైతులకు కన్నీళ్లు తప్ప సంతోషం లేదని, రైతులు ఆవేదన చెందుతున్నారని, రైతుల గోస కాంగ్రెస్ ప్రభుత్వానికి కనబడటం లేదా అని ప్రశ్నించారు. రైతులు పండించే పంట కోసం రాత్రనకా..పగలనకా కష్టపడితే చేతి కాడికి వచ్చిన పంట రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో కొనుగోలు కేంద్రాల వద్ద కొనుగోలు కోసం నెలల తరబడి ఎదురుచూసి అకాల వర్షంతో నీటి పాలవుతుంటే రైతుల కన్నీళ్లు రాష్ట్ర ప్రభుత్వానికి కనబడటం లేదా అని విమర్శించారు. బిజెపి నాయకులు రైతులతో కలిసి మెట్పల్లి బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు ధోనికెలనవీన్ అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. రెండు రోజుల్లో పట్టణంలోని కొనుగోళ్ల కేంద్రాల వద్ద వున్నా వరి ధాన్యాలను తక్షణమే కొనుగోలు చేయాలని, లేనిపక్షంలో కొనుగోలు చేసే వరకు నిరాహార దీక్ష పడతానని ప్రభుత్వాని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మెట్పల్లి మున్సిపల్ బిజెపి ఫ్లోర్ లీడర్ ధర్మపురి స్వరూప వేణుగోపాల్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ బొడ్డు ఆనంద్, బిజెపి కౌన్సిలర్ ధోనికెల శిరీష నవీన్, బొడ్ల వసుధ నాగేష్, కోయల్కర్ స్రవంతి లింగేశ్వర్, బిజెపి నాయకులు కలికోట శ్రీకాంత్, పాసికంటి శ్రీనివాస్, కొయ్యల లక్ష్మణ్, లోలపు అనిల్, రమేష్ యాదవ్, తల్లోజి భాస్కర్, కోట నరేష్, తోకల సత్యనారాయణ, సుంకె అశోక్, కలల రాజారెడ్డి, దండికే నరసయ్య, అంబాల జగన్మోహన్, రాంపల్లి రఘుపతి, గుండు మోహన్, గుండు ప్రభాకర్, తోకల రమేష్, ఊరేటి లక్ష్మణ్, మొగిలిపాక రాజయ్య, సుతారి భూమారెడ్డి, హనుమాన్లు గౌడ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.




# బిజెపి జిల్లా కార్యాలయంలో మాతా రమాబాయి అంబేద్కర్ వర్ధంతి వేడుకలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, మే 27 : మాతా రమాబాయి అంబేద్కర్ 91,వ వర్ధంతి సందర్భంగా జగిత్యాల జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాత రమాబాయి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సమాజ సేవకు, కుటుంబ విలువలకు, త్యాగానికి ప్రతీకగా నిలిచిన మాత రమాబాయి సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ ఎస్సీ మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అడ్వకేట్ ఓరగంటి చంద్రశేఖర్ మాట్లాడుతూ..భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జీవిత ప్రయాణంలో మాత రమాబాయి పాత్ర ఎంతో గొప్పదని తెలిపారు. కష్టకాలంలో అంబేద్కర్ కు అండగా నిలిచి, ఆయన ఆశయ సాధనకు తోడ్పడిన మహనీయురాలు రమాబాయిని యువత ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యాలయ కార్యదర్శి జుంబర్తి దివాకర్, పట్టణ అధ్యక్షులు కొక్కు గంగాధర్, ఎస్ఐఆర్ జిల్లా కన్వీనర్ డాక్టర్ పుష్పాల శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఆముద రాజు, పట్టణ ఉపాధ్యక్షులు ఇట్యాల రాము, కౌన్సిలర్లు నిమ్మల నాగరాజు, గట్టపెల్లి జ్ఞానేశ్వర్, కాసెట్టి తిరుపతి, నారపాక అశోక్, గర్వందుల రమేష్, తిరుపల్లి లచ్చయ్య నాయకులు పాల్గొన్నారు.

## బక్రీద్ పర్వదినం సామాజిక ఐక్యతకు ప్రతీక

**- ముస్లిం సోదర సోదరీమణులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీ సునిత రెడ్డి**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, మే, 27 : బక్రీద్ పర్వదినం సామాజిక ఐక్యతకు ప్రతీక అని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి పేర్కొన్నారు. వనపర్తి జిల్లా ప్రజలకు, ముఖ్యంగా ముస్లిం సోదర సోదరీమణులకు బక్రీద్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. త్యాగం, సహనం, ప్రేమ, సోదరభావానికి ప్రతీకగా నిలిచే ఈ పవిత్ర పండుగను ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఎస్పీ మాట్లాడుతూ.. బక్రీద్ పండుగ మానవీయ విలువలను చాటిచెప్పే గొప్ప పర్వదినమని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి సుఖసంతోషాలతో పండుగను జరుపుకోవాలని సూచించారు. జిల్లాలో బక్రీద్ వేడుకలు శాంతియుత వాతావరణంలో, పరస్పర గౌరవభావంతో నిర్వహించుకోవాలని కోరారు. సామాజిక ఐక్యతను కాపాడుతూ, పరస్పర సహకారంతో పండుగను విజయవంతంగా నిర్వహించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పండుగ సందర్భంగా ప్రజల భద్రత కోసం జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ఎటువంటి అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే సమీప పోలీసు అధికారులకు సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు.భాస్కర్, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఏఐటీయూసీ నాయకులు యర్రగాని కృష్ణయ్య తదితరులు కూడా శ్యామ్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

## కాంగ్రెస్ సంస్థాగత బలోపేతానికి అడుగులు

**ఏదుల మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా పి.సుకేందర్ రెడ్డి నియామకం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



వనపర్తి, మే, 27 : వనపర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కీలక నిర్ణయాలు తీసుకుంది.మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) కొత్త మండల, పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుల నియామకాలకు అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో ఏదుల మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా పి.సుకేందర్ రెడ్డిని నియమించారు. పార్టీ పట్ల ఆయన చూపిన నిబద్ధత, క్షేత్రస్థాయిలో కార్యకర్తలతో సమన్వయం, ప్రజా సమస్యలపై చురుకైన పాత్రను గుర్తించి పార్టీ అధిష్టానం ఈ బాధ్యతలు అప్పగించినట్లు కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. పి. సుకేందర్ రెడ్డి నియామకంపై మండలంలోని కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు రానున్న రోజుల్లో పార్టీని గ్రామ స్థాయిలో మరింత బలోపేతం చేస్తూ, కార్యకర్తలను సమన్వయం చేసుకుని కాంగ్రెస్ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని సుకేందర్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా సంస్థాగత పునర్వ్యవస్థీకరణ చేపడుతూ గ్రామ, మండల స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు నాయకులు పేర్కొన్నారు. ఈ నియామక కాలతో వనపర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి కొత్త ఉత్సాహం వస్తుందని కార్యకర్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## అయ్యప్ప స్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన

**- పూజలు చేసిన ఎమ్మెల్యే మక్కాన్ సింగ్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కోల్‌సిటీ (గోదావరిఖని), మే 27: రామగుండం కార్పొరేషన్ పరిధిలోని గౌతమి నగర్‌లో అయ్యప్ప స్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమం బుధవారం నిర్వహిం చారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భం గా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలి పారు. భక్తి, ఆధ్యాత్మికత సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## పట్టణ పరిశుభ్రతకు అందరూ సహకరించాలి

**- పారిశుధ్య కార్మికులతో సమావేశాన్ని నిర్వహించిన మున్సిపల్ చైర్ పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, మే 27 : మహబూబాబాద్ పురపాలక సంఘం కార్యాలయంలో పారిశుధ్య కార్మికులతో మున్సి పల్ వార్డుల్లో ఉన్న సమస్యలపై బుధవారం సమావేశాన్ని నిర్వ హించారు. మున్సిపల్ చైర్ పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమం లో అన్ని వార్డుల కౌన్సిలర్లు పాల్గొని పారిశుధ్య సమస్యలపై చర్చించి సిబ్బందితో మాట్లాడి వారికి సూచ నలు సలహాలు ఇచ్చారు. పట్టణ పరిశు భ్రతకు అందరూ సహకరిం చాలని, పరిశుధ్యం విషయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బం దులు లేకుండా ప్రతి ఒక్కరు సహకరించి వార్డుల్లో పని చేయాలని మున్సి పల్ చైర్ పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్ సిబ్బందిని కోరారు.ఈ కార్యక్రమం లో కమీషనర్ టీ రాజేశ్వర్, వార్డు కౌన్సిలర్లు, శానిటేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## శ్రీనివాస్ కు నివాళులు అర్పించిన అయోధ్య సింగ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రామగుండం, మే 27 : అంతర్గాం మండలం కుందనపల్లి గ్రామానికి చెందిన ఇరుగునూరి శ్రీనివాస్ ప్రథమ వర్ధంతికి బుధవారం రాష్ట్ర సీనియర్ కాంగ్రెస్ నాయకులు టీ.అయోధ్య సింగ్ ఠాకూర్ హాజరై చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొమురయ్య యాదవ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

# బాలసదనం ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తి చేయాలి

**- తహసీల్దార్ కార్యాలయంలో మధ్యవర్తులకు చోటు లేదు -పెండింగ్ భూ భారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి - జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష - సుల్తానాబాద్ మండలంలోని బాలసదనం, వృద్ధాశ్రమం, - తహసీల్దార్ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పెద్దపల్లి, మే 27 : సుల్తానాబాద్ మండలంలోని బాలసదనం ప్రారంభోత్సవానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. బుధవారం బాలసదనం, వృద్ధాశ్రమం, తహసీల్దార్ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన, మే 29న ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు చేతుల మీదుగా బాలసదనం ప్రారంభోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. బాలసదనం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, చిన్నారులకు భద్రతతో కూడిన సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని సూచించారు. అనంతరం వృద్ధాశ్రమంలో వసతులు, ఆహారం, పరిశుభ్రతపై ఆరా తీసి వృద్ధులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. సుల్తానాబాద్ తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్, పెండింగ్‌లో ఉన్న భూ భారతి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. మీ సేవ ద్వారా వచ్చే ధృవపత్రాల దరఖాస్తులను సకాలంలో క్రమ్మాటినీ పూర్తి చేసి ప్రజలకు వేగవంతమైన సేవలం అందించాలని



తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో మధ్యవర్తులకు ఎలాంటి అవకాశం ఉండదని స్పష్టం చేసిన కలెక్టర్, ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత, జవాబుదారీతనం, సత్వర సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట బీడబ్ల్యూఓ వేణుగోపాల్, తహసీల్దార్ బషీరోద్దీన్ తదితర అధికారులున్నారు.

## జిల్లాలో విస్తృతంగా రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు చేపట్టాలి : అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, మే 27 : జిల్లాలో అధిక సంఖ్యలో సభ్యత్వ నమోదు చేపట్టి రెడ్ క్రాస్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ సూచించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వనపర్తి జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ దాన కిషోర్ ఆదేశాల మేరకు జిల్లాలో సభ్యత్వ నమోదును విస్తృతంగా పెంచే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్ క్రాస్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలంటే జిల్లాలో విస్తృత స్థాయిలో సభ్యత్వ నమోదు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో యువత, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు చురుకుగా పాల్గొనాలని కోరారు. సమాజ సేవలో రెడ్ క్రాస్ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ డాక్టర్ ప్రియాంక నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ రాజేంద్ర కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# చివరి ధాన్యం గింజ వరకు కొనుగోలు చేస్తాం

**- అకాల వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సంగారెడ్డి, మే 27 : రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని, చివరి ధాన్యం గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ భరోసా ఇచ్చారు. అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా రైతులు, కొనుగోలు కేంద్రాల సిబ్బంది పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బుధవారం సంగారెడ్డి మండలం కులబ్‌గూర్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో ఉన్న ధాన్యం తడిచిందా లేదా అన్న విషయాన్ని స్వయంగా పరిశీలించారు. అక్కడ ఉన్న రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకొని,జిల్లా యంత్రాంగం అన్ని వేళలా రైతులకు అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అకాల వర్షాల దృష్ట్యా ధాన్యం తడవకుండా టార్పాలిన్లు, రక్షణ చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని సూచించారు. ధాన్యం తూకం వేసిన వెంటనే



లారీలతో పాటు అవసరమైతే ట్రాక్టర్ల ద్వారా కూడా రైస్ మిల్లులకు వెంట వెంటనే తరలించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి జాప్యం లేకుండా రైతులకు ఇబ్బంది కలగకుండా ఏవేని సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరిస్తూ కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జిలకు సూచించారు. అకాల వర్షాల నేపథ్యంలో అన్ని జాగ్రత్తలు తీసుకొని ధాన్యంకు నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట సంగారెడ్డి తహసీల్దార్ జయరాం తదితరులు ఉన్నారు.

## రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రామగుండం, మే 27 : రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని గత ప్రభుత్వం రైతుబంధు నెపంతో రైతులకు ఇచ్చే అన్ని సబ్సిడీలకు ఎగనామం పెట్టిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు మేలు చేసే పథకాలను అందిస్తుందని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. బుధవారం పాలకుర్తిలో రైతులకు రాయితీపై పచ్చి రొట్టె విత్తనాలు పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ రేవంత్ రెడ్డి సర్కారు అధికారంలోకి రాగానే ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దుకుంటూ రైతులకు రుణమాఫీ చేయడంతో పాటు వ్యవసాయ పనిముట్లు సబ్సిడీపై విత్తనాలు పెద్ద ఎత్తున అందించడం జరుగుతుందని, ఈ వాస్తవాన్ని మన రైతన్నలు గుర్తించాలని ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. వరి పొలంలోని కొయ్యకాలు కాలబెట్టడం వల్ల అనేక అనర్థాలు జరుగుతాయని నిప్పు పెట్టవద్దని అందుకే పొగలేని పొలం... రోగం లేని గ్రామం...గా చూసేందుకు పొలంలో గడ్డి తగలబెట్టేవద్దని కలుషితం చేయవద్దని అన్నారు. మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ వరి సాగుకు ముందు ఇనుము జలుగా విత్తనాలు సాగు చేసి భూమిలో కలిగే దున్నితే భూసారం పెరగడంతో పాటు పంట దిగుబడి అధికంగా వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రామగుండం ఏఎంసీ చైర్మన్ గడ్డం తిరుపతి, ఎంపీడీవో ఎస్‌హెచ్‌ఓ వివిధ గ్రామాల సర్పంచులు అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

## సవాయిగూడెంలో రూ.4 కోట్ల సోలార్ ప్లాంట్ పనుల పరిశీలన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, మే, 27 : వనపర్తి మండలం సవాయిగూడెం గ్రామంలో రూ.4 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న సోలార్ ప్లాంట్ పనులను వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి బుధవారం పరిశీలించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న 99 రోజుల మహిళా వారోత్సవాల సందర్భంగా ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా అభ్యున్నతి కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. వనపర్తి జిల్లాలో తొలి దశలో వనపర్తి మండలంలోని సవాయిగూడెం మరియు ఆత్మకూరు మండలాలకు సోలార్ ప్లాంట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. మహిళా సాధికారతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న ఆయన, మహిళలకు వడ్డీ లేని రుణాలు, ఆర్టీసీ బస్సుల యాజమాన్యం, అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్మన్ పదవులు, డీజిల్ బంకుల నిర్వహణ, పాఠశాలల్లో యూనిఫాం కుట్టింపు పనులు, మధ్యాహ్న భోజన పథకాల్లో ఉపాధి అవకాశాలు, క్యాంటీన్ల నిర్వహణ, మహిళల



పేరుపై రైస్ మిల్లులు మరియు గోదాముల ఏర్పాటు వంటి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రెండేళ్లలో ఎన్నికల హామీలతో పాటు కొత్త హామీలను కూడా అమలు చేశామని, మిగిలిన హామీలను త్వరలోనే నెరవేర్చుతామని తెలిపారు. అలాగే పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ పార్టీపై విమర్శలు చేస్తూ, ప్రజలకు మేలు చేసే పాలన కాంగ్రెస్ ద్వారానే సాధ్యమని ఆయన అన్నారు. మహిళల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిమ్యా నాయక్, డిఆర్డిఓ ఉమాదేవి, మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, మండల అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, మైనార్టీ నాయకులు రహీం, గ్రామ సర్పంచులు, మహిళా సంఘాల సభ్యులు, మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోడ్డు విస్తరణ బాధితులకు న్యాయం చేయాలి

**మున్సిపల్ కార్యాలయం ముందు అఖిలపక్ష ధర్నా**




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, మే 27 : భువనగిరి పట్టణంలోని నల్గొండ చౌరస్తా నుంచి హైదరాబాద్ చౌరస్తా వరకు చేపడుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో బాధిత కుటుంబాలకు న్యాయం చేయకుండా అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ బాధితులు, అఖిలపక్ష నాయకులు భువనగిరి మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. బాధితుల కథనం ప్రకారం, భువనగిరి ఎమ్మెల్యే నిన్న మధ్యాహ్నం నల్గొండ చౌరస్తా వద్ద రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం చుట్టి, జేసీబీలతో ఇండ్ల కూల్చివేత పనులు ప్రారంభించారు. అయితే ముందస్తు సమాచారం, నోటీసులు ఇవ్వకుండానే పనులు చేపట్టారని వారు ఆరోపించారు. బాధిత కుటుంబాలతో ఎలాంటి సంప్రదింపులు జరపకుండా చర్యలు తీసుకోవడాన్ని నిరసిస్తూ అఖిలపక్ష నాయకులు ధర్నాకు మద్దతుగా నిలిచారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిసి బాధిత కుటుంబాలు అఖిలపక్ష నాయకులతో కలిసి కార్యాలయం ఎదుట నిరసన చేపట్టాయి. ముందుగా నష్టపరిహారం, పునరావాసంపై స్పష్టత ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. గతంలో భువనగిరిలో జరిగిన రోడ్డు విస్తరణ పనుల సమయంలో బాధితులను ఒప్పించి, అఖిలపక్ష సమావేశాలు నిర్వహించి, నోటీసులు ఇచ్చిన తర్వాతే పనులు చేపట్టారని గుర్తు చేశారు. అదే విధానాన్ని ఇప్పుడు కూడా అమలు చేయాలని కోరారు. ధర్నా కొనసాగుతున్న సమయంలో కాంగ్రెస్ కౌన్సిలర్ల భర్తలు వీధి రౌడీలలా ప్రవర్తించారని, పోలీసుల సహాయంతో బాధిత మహిళలను తోసుకుంటూ మున్సిపల్ కార్యాలయంలోకి వెళ్లారని నిరసనకారులు ఆరోపించారు.

## తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం

**- రైతులు అధైర్యపడొద్దు - విప్ బీర్ల అయిలయ్య**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



యాదాద్రి భువనగిరి, మే 27 : తడిసిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య భరోసా ఇచ్చారు.భువనగిరి ఆర్డీఓ కృష్ణారెడ్డితో ఫోన్‌లో మాట్లాడిన ఆయన, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బం దులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెండు రోజుల వివాహ వార్షికోత్సవ పర్యటన ముగించుకుని వచ్చిన వెంటనే రైతు సమస్యలపై స్పందించిన బీర్ల అయిలయ్య, తడిసిన ధాన్యం కొనుగోలుపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతి గింజను కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. అన్ని కొను గోలు కేంద్రాల్లో రైతులకు భరోసా కల్పించాలని, ఎవరూ అధైర్యపడ వద్దని ఆయన పేర్కొన్నారు. రైతన్న కష్టాన్ని అర్థం చేసుకుని తడిసిన ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపట్టడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## పినరయ్ విజయన్ ఇంటిపై ఈడి దాడులు దుర్మార్గం

**- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి జహంగీర్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, మే 27 : కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఇంటిపై ఈడీ దాడులు రాజకీయ కక్షసాధింపులో భాగమేనని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి జహంగీర్ ఆరోపించారు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఆదర్శవంతమైన పాలన అందించిన నాయకుడిగా పేరున్న పినరయ్ విజయన్‌పై ఈడీ దాడులు చేయడం దుర్మార్గమని అన్నారు. ఎన్నికల అఫిడవిట్‌లో తన ఆస్తుల వివరాలను పూర్తిగా వెల్లడించినప్పటికీ, కాంగ్రెస్–బీజేపీ కుమ్మక్కై ఈ చర్యలకు పాల్పడుతున్నాయని విమర్శించారు. రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకుని కేంద్ర సంస్థలను ఉపయోగించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని, బీజేపీ ఈడీ పేరుతో చేసే వికృత చేష్టలను మానుకోవాలని డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరు బాలరాజు, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, జిల్లా కమిటీ సభ్యులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, దయ్యాల నరసింహ తదితరులు పాల్గొన్నారు.



## వర్తక సంఘం రద్దు చేయాలి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, మే 27 : యాదాద్రి పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట కొండపై ఉన్న వర్తక సంఘాన్ని రద్దు చేసి టెండర్లు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ లో దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద బుధవారం భారీ ధర్నా నిర్వహించారు. అనంతరం పోలీసులు నిరసనకారులను చెదరగొట్టారు. దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూర నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ నెల రోజులుగా వివిధ పార్టీల నాయకులు, నిరుద్యోగులు పోరాటం చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. వర్తక సంఘాన్ని రద్దు చేసి టెండర్లు నిర్వహిస్తే దేవస్థానానికి రూ.20–30 కోట్ల ఆదాయం వస్తుందని, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. వెంటనే టెండర్ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



## అకాల వర్షంతో నష్టపోయిన వారిని పరామర్శించిన నాయకులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, మే 27 :భీమారం మండలం లింగం పేట గ్రామంలో మంగళవారం కురిసిన భారీ వర్షం, ఈదురుగాలుల ప్రభావంతో స్థానిక మాజీ సర్పంచ్ శంకర్ కోళ్ల ఫారం రేకులు గాలికి లేచిపోయి, అందులోని కొన్ని కోళ్లు మృతి చెందాయి. రజక సంఘం సంఘం కోసం వేసుకున్న రేకులు మొత్తం గాలి వానకు లేచిపోవడంతో నష్టం జరిగిన శంకర్ ను, రజక సంఘ సభ్యులను రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపు రెడ్డి, జిల్లా జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఒద్దినేని హరిచరణ్ రావులు బుధవారం పరామర్శించి, నష్టం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నష్టపోయిన వారిని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మేడిపెల్లి మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు సత్తి రెడ్డి, కథలాపూర్ మండల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వర్ధినేని నాగేశ్వర్ రావు, గ్రామ సర్పంచ్ వెల్మల సుప్రియ హరీష్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ అర్జున్, మన్నేగూడం మాజీ ఎంపీటీసీ రవీందర్ రావు, గ్రామ సర్పంచ్ హరీష్, బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు రాయబోస్, జలపతి రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి పలువురు నాయకులు తదితరులు ఉన్నారు

## మక్కల కొనుగోలును వేగవంతం చేయాలి

**- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జగిత్యాల, మే 27 : రాయికల్ యువజన మార్కెట్ మక్కల కొనుగోలు కేంద్రాన్ని జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ బుధవారం పరిశీలించి, తొందరగా మక్కలను కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే రైతులతో మాట్లాడుతూ.. మన రాష్ట్ర ప్రభుత్వం మాత్రమే మక్కలను కొనుగోలు చేస్తుందని, మొత్తం మక్కలను కొనుగోలు చేసే విషయం లో ప్రభుత్వం మీకు అండగా ఉంటుందని, మొత్తం మక్కాలను కొనుగోలు చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ, మండల నాయకులు, అధికారులు రైతులు, తదితరులు పాల్గొన్నారు.



# నాగరాజు కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది

## - ఇటువంటి విషాద ఘటనలు బాధాకరం
## - భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రేగొండ, మే 27:పిడుగు పడి మృతిచెందిన వ్యవసాయ కూలీ తిప్పారపు నాగరాజు కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హామీ ఇచ్చారు. ఇటువంటి విషాద ఘటనలు జరగడం ఎంతో బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని రేగొండ మండలం లింగాల గ్రామానికి చెందిన తిప్పారపు నాగరాజు మంగళవారం వ్యవసాయ పనుల కోసం పొలానికి వెళ్లిన సమయంలో పిడుగు పడటంతో ప్రమాదవశాత్తు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జీఎస్సార్ నాగరాజు నివాసానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మృతుడి కుటుంబానికి ప్రభుత్వం నుంచి అందాల్సిన అన్ని సహాయ సహకారాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ తరఫున కూడా అండగా ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# భూమికి బలం పచ్చిరొట్ట పంటలే - మార్కెట్ చైర్మన్ భాగం నీరజ దేవి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సత్తుపల్లి, మే 27:భూమి సారవంతత పెంపొందించడంలో పచ్చిరొట్ట పంటలు కీలక పాత్ర పోషిస్తాయని కల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భాగం నీరజ దేవి అన్నారు. రైతులు పచ్చిరొట్ట పంటలను సాగు చేసి భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గంలోని కల్లూరు మండల కల్లూరు సొసైటీలో పీఏసీఎస్ చైర్మన్ బోబోలు లక్ష్మణరావు ఆధ్వర్యంలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు (జీలుగులు) పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భాగం నీరజ దేవి రైతులకు విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గిస్తూ సహజ సిద్ధంగా నేలలో పోషకాలను పెంచేందుకు పచ్చిరొట్ట పంటలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. రైతులు ప్రభుత్వం అందిస్తున్న రాయితీ విత్తనాలను సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు, రైతులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# వీవోఏల ధర్నాకు మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య మద్దతు




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సత్తుపల్లి, మే 27:ఐకేపీ, వీవోఏ రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు ఖమ్మం జిల్లా పెనుబల్లి మండల కేంద్రంలో చేపట్టిన ధర్నా కార్యక్రమానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య మద్దతు తెలిపారు. బుధవారం నిర్వహించిన ఈ ధర్నాలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఉద్యోగులు ప్రశాంతంగా లేరని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా వీవోఏ సిబ్బందికి కనీస వేతనంగా రూ.20 వేల గౌరవ వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. వీవోఏలకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, 58 జీఓను సవరించాలని ప్రభుత్వాన్ని కోరారు. అర్హులైన వీవోఏలను సీసీలుగా పదోన్నతి కల్పించాలని, ప్రతి ఒక్కరికి ట్యాబ్ సౌకర్యం అందించాలని డిమాండ్ చేశారు.మాజీ జెడ్పీటీసీ చెక్కిలాల మోహన్‌రావు, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు మందాడపు అశోక్ కుమార్, కోట ప్రభాకర్, టీవీ రామారావు, ఎస్కే గౌస్, పసుమర్తి వెంకటేశ్వరరావు, బెల్లంకొండ చలపతిరావు, చక్కిలాల లక్ష్మణరావు, కోమటి ప్రసాద్, తవుర్యా నాయక్, కొప్పుల గోవిందరావు, ఎటుకూరి సత్యంబాబు, వంగ చిన్నపండు, వేముల బాబురావు, వేముల సురేష్, వాంక్ డోత్ మురళి, రాజబాబు, మరకాల చంటి, మరకాల వెంకీ, వర్ధబోయిన నాగేశ్వరరావు, మల్లాది రవి, గుణగంటి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆవిర్భావ వేడుకల ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలి

## భూపాలపల్లి ఏరియా ఎస్‌వోటూ జీఎం కవీంద్ర



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్‌భూపాలపల్లి, మే 27:జూన్ 2న నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఏరియా ఎస్‌వోటూ జీఎం కవీంద్ర అధికారులను ఆదేశించారు. బుధవారం జీఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కవీంద్ర మాట్లాడుతూ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తెలంగాణ అంబేద్కర్ చౌరస్తా నుంచి జయశంకర్ విగ్రహం వరకు "తెలంగాణ రన్" నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే జీఎం కార్యాలయంలో ఉదయం 9 గంటలకు, సాయంత్రం 6 గంటల నుంచి అంబేద్కర్ స్టేడియంలో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమాల్లో భాగంగా సాంస్కృతిక ప్రదర్శనలు, ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఏజీఎం ఐఈడీ జ్యోతి, ఏజీఎం సివిల్ రవికుమార్, ఓసీ-2 ప్రాజెక్టు అధికారి శ్యాంసుందర్, డీజీఎం వర్క్‌షాప్ రాజారావు, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, జీఎం కార్యాలయ అధికారులు, వివిధ గనుల మేనేజర్లు, సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

# సింగరేణి ఆస్తుల విధ్వంసానికి ప్రేరేపించిన బాల్క సుమన్‌పై సుమోటో కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలి

## - ఐఎన్టీయూసీ నాయకుల డిమాండ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, మే 27:సింగరేణి సంస్థ ఆస్తులు, రైల్వే పట్టాలను ధ్వంసం చేయాలని ప్రేరేపించేలా వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై ప్రభుత్వం సుమోటోగా కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని ఐఎన్టీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. భూపాలపల్లిలోని ఐఎన్టీయూసీ యూనియన్ కార్యాలయంలో బుధవారం బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ బేతెల్లి మధుకర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఐఎన్టీయూసీ రాష్ట్ర కార్యదర్శి పసునూటి రాజేందర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ చేపడుతున్న నిరసన కార్యక్రమాలకు ప్రజల మద్దతు లేకపోవడంతో పార్టీ కార్యకర్తలను హింసాత్మక చర్యలకు ప్రేరేపిస్తూ, సింగరేణి మందమర్రి జీఎం కార్యాలయం, హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌పై దాడులు చేసి తగులబెట్టాలని, రైలు రోకో పేరుతో రైల్వే పట్టాలను ధ్వంసం చేయాలని బాల్క సుమన్ పిలుపునివ్వడం తీవ్ర బాధ్యతారాహిత్యమని అన్నారు. ప్రజాప్రతినిధిగా ఉన్న వ్యక్తి ఇటువంటి విధ్వంసకర వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సింగరేణి సంస్థ మిగులు బడ్జెట్‌లోని సుమారు రూ.11,500 కోట్లను దుర్వినియోగం చేసి, సంస్థపై రూ.39 వేల కోట్ల అప్పుల భారం మోపారని ఆరోపించారు. ఓపెన్ కాస్ట్ గనులను రద్దు చేస్తామని, అండర్‌గ్రౌండ్ గనులు ఏర్పాటు చేస్తామని, కాంట్రాక్టీకరణ రద్దు చేసి స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని హామీలు ఇచ్చి చివరకు కార్మికులను, ప్రజలను మోసం చేశారని విమర్శించారు. గతంలో బాల్క సుమన్ పిలుపుమేరకు శ్రీరాంపూర్ ఏరియాలో యాజమాన్యానికి వ్యతిరేకంగా ఉద్యమించిన కార్మిక నాయకులను ఇతర ప్రాంతాలకు బదిలీ చేసినప్పుడు ఆయన ఎలాంటి సహాయం చేయలేకపోయారని గుర్తుచేశారు. బదిలీకి గురైన కార్మికులు ఇప్పటికీ దూర ప్రాంతాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సాధారణ జీవితం గడిపిన బాల్క సుమన్ ఈరోజు



వందల కోట్ల ఆస్తులకు అధిపతిగా మారి అహంకారంతో సింగరేణి, రైల్వే ఆస్తులను తగులబెట్టాలని పిలుపునివ్వడం దురదృష్టకరమని అన్నారు. బాల్క సుమన్ వ్యాఖ్యలకు సంబంధించిన మీడియా కథనాలు, వీడియో రికార్డులను ప్రభుత్వం సుమోటోగా స్వీకరించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఐఎన్టీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఐఎన్టీయూసీ కేంద్ర నాయకులు జోగా బుచ్చయ్య, మద్దినేని శేషరత్నం, మహిళా విభాగం అధ్యక్షురాలు సంపత్ రత్నం, రాజేష్ టకూర్, సమ్మిరెడ్డి సదానందం, చెరలు బ్రాంచ్ నాయకులు బొడ్డు అశోక్, హుస్సేన్, కే.శంకర్, రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# కేటీకే--5 గనిలో కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

## ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ ఎండి ఆసిఫ్ పాషా



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, మే 27:సింగరేణి భూపాలపల్లి ఏరియాలోని కేటీకే--5 గనిలో నెలకొన్న కార్మికుల సమస్యలను యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ ఎండి.ఆసిఫ్ పాషా డిమాండ్ చేశారు. గనిలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోరుతూ ఏఐటీయూసీ నాయకులు బుధవారం గని మేనేజర్‌కు మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా ఆసిఫ్ పాషా మాట్లాడుతూ, గత వారం రోజులుగా ఆర్వో ప్లాంట్ పనిచేయకపోవడంతో కార్మికులు త్రాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్న ఈ సమయంలో శుద్ధమైన త్రాగునీరు అందుబాటులో లేకపోవడం ఆందోళనకరమన్నారు. యాజమాన్యం వెంటనే స్పందించి ఆర్వో ప్లాంట్‌ను మరమ్మతు చేసి త్రాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. గని వన్ సీమ్ మ్యాన్ రైడింగ్ ఎక్స్ టెన్షన్ పనులు నిలిచిపోవడంతో కార్మికులు దూరప్రాంతాలకు నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దీనివల్ల కార్మికులపై అదనపు శారీరక భారం పడటంతో పాటు పనితీరుపై కూడా ప్రతికూల ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. మ్యాన్ రైడింగ్ ఎక్స్ టెన్షన్ పనులను తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. గనిలో యాష్ బ్రిక్స్, బ్రాటిస్ క్లాత్ కొరత కారణంగా వెంటిలేషన్ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. సరైన గాలి ప్రసరణ లేకపోతే కార్మికుల ఆరోగ్య భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని హెచ్చరించారు. అవసరమైన సామగ్రిని వెంటనే అందుబాటులో ఉంచి గనిలో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని యాజమాన్యాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గోవిందుల తిరుపతి, టెక్నీషియన్ స్టాఫ్ ఇన్‌చార్జి రవికుమార్, పిట్ సెక్రటరీ రాజేందర్, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ నారాయణమూర్తి, అసిస్టెంట్ పిట్ సెక్రటరీలు నల్ల సత్తి, కుమార్, నాగేంద్రబాబు, షిఫ్ట్ ఇన్‌చార్జి ప్రవీణ్, అసిస్టెంట్ షిఫ్ట్ ఇన్‌చార్జి నరేష్, టెంపుల్ కమిటీ చైర్మన్ రాయమల్లు, చుక్కన్న, సమ్మిరెడ్డి, రాంచందర్, సుధాకర్, రాజు, గౌతమ్, శ్రీధర్, మహిళా కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సత్తుపల్లి, మే 27:సమాజ సేవకు చిరునామాగా నిలుస్తున్న ఖమ్మం జిల్లా సత్తుపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేద, నిరుపేద విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. నిత్యం నిర్వహిస్తున్న అల్పాహార పంపిణీ కార్యక్రమంతో పాటు విద్యార్థుల విద్యాభ్యాసానికి తోడ్పాటుగా సైకిళ్లను అందజేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పాఠశాలలకు దూర ప్రాంతాల నుంచి వెళ్లే విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యను కొనసాగించేందుకు ఈ సైకిళ్లు ఉపయోగపడతాయని నిర్వాహకులు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో చదువును కొనసాగిస్తున్న విద్యార్థులకు ఇది ఎంతో సహాయపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాంగ్రెస్ నాయకుడు ఎండీ కమల్ పాషా విద్యార్థులకు స్వయంగా సైకిళ్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి విద్య ఎంతో కీలకమని, పేద విద్యార్థులను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. లయన్స్ క్లబ్ సభ్యులు చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. అల్పాహార పంపిణీ ద్వారా ప్రతిరోజూ అనేక మంది పేదలకు అండగా నిలుస్తూ, విద్యార్థుల భవిష్యత్తు కోసం సైకిళ్ల పంపిణీ చేయడం వంటి



కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. సేవా దృక్పథంతో ముందుకు వచ్చే స్వచ్ఛంద సంస్థలు మరింతగా పెరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ప్రభాకర్ రెడ్డి, వలి, రహమత్ పాషా పాల్గొని విద్యార్థులను అభినందించారు. లయన్స్ క్లబ్ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పేదల సంక్షేమం, విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని పలువురు ఆకాంక్షించారు.

# కాళేశ్వరం దేవస్థాన చైర్మన్ మోహన్ శర్మను తొలగించాలని డిమాండ్ చేయడం బాధాకరం

## ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు లేతకారి రాజబాబు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కాటారం, మే 27:కాళేశ్వరం దేవస్థాన చైర్మన్ మోహన్ శర్మను తొలగించాలని డిమాండ్ చేయడం బాధాకరమని మహాదేవపూర్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు లేతకారి రాజబాబు పేర్కొన్నారు. బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అనుమతులు లేకుండా సేవ పేరుతో గర్భాలయంలోకి పెద్ద సంఖ్యలో ప్రవేశించడం వల్ల సాధారణ భక్తులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని అన్నారు. ఈ విషయాన్ని గమనించిన చైర్మన్ మోహన్ శర్మ భక్తుల రద్దీ దృష్ట్యా గర్భాలయంలో ఉన్న సేవకులను బయటకు వెళ్లాలని సూచించారని తెలిపారు. దేవస్థానం నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా లోపలికి వెళ్లిన వారిని బయటకు తీసుకువచ్చి, విధి విధానాల ప్రకారం అనుమతులు ఇప్పించేందుకు చర్యలు తీసుకోవడమే తప్పు కాదన్నారు. ఈ ఘటనను వక్రీకరించి చైర్మన్‌పై అనవసర ఆరోపణలు చేయడం సరికాదని పేర్కొన్నారు. తండ్రి వయస్సులో ఉన్న వ్యక్తిపై గౌరవం లేకుండా ఆరోపణలు చేయడం సేవా కార్యక్రమాల్లో పాల్గొనే వారికి తగదన్నారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్న సమయంలో మహిళా సేవకులను "బయటకు వెళ్లండి అమ్మ" అని సూచిస్తూ, వారిని చెల్లెలు లేదా తల్లిగా భావించి చేయి పట్టుకుని బయటకు పంపిన విషయాన్ని రాద్ధాంతం చేయడం తగదని వ్యాఖ్యానించారు. దేవస్థానం మరియు చైర్మన్‌పై వ్యక్తిగత విమర్శలు చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కాళేశ్వర ముక్తీశ్వర స్వామి సేవలో చైర్మన్ మోహన్ శర్మ ఆడంబరాలకు పోకుండా సాధారణ వ్యక్తిలా సేవ చేస్తున్నారని, దాన్ని ఓర్వలేక కొందరు చిల్లర విమర్శలు చేస్తున్నారని రాజబాబు తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి కొండగొర్ల సంతోష్ పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో కటింగ్‌కు తావులేకుండా చూడాలి

## జిల్లా కలెక్టర్‌తో కలిసి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, మే 27:వరి ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి కటింగ్‌కు తావులేకుండా పారదర్శకంగా ప్రక్రియ నిర్వహించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు (జీఎస్సార్) అధికారులను ఆదేశించారు. మిల్లు యజమానులు అక్రమంగా ధాన్యం కటింగ్ చేస్తే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. బుధవారం భూపాలపల్లి రూరల్ మండలంలోని ఎస్.ఎం కొత్తపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఎమ్మెల్యే జీఎస్సార్ పరిశీలించారు. మంగళవారం కురిసిన అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో లారీల కొరత లేకుండా చూసి ధాన్యాన్ని వేగంగా మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోలు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డీసీఓ మాలోతు వాల్యా నాయక్, రైతులు తదితరులు పాల్గొన్నారు.





# మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూకు ఘన నివాళులు

## కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాగమయి దయానంద్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సత్తుపల్లి, మే 27:భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 62వ వర్ధంతి సందర్భంగా ఖమ్మం జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో బుధవారం ఘనంగా నివాళు లర్పించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన దేశానికి అందించిన సేవలను నాయకులు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఖమ్మం జిల్లా డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ నిర్మాణంలో జవహర్‌లాల్ నెహ్రూ చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆధునిక భారత నిర్మాణానికి ఆయన వేసిన పునాదులు దేశ అభివృద్ధికి దోహదపడ్డాయని కొనియాడారు. యువత నెహ్రూ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా శాసనసభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు మంత్రి పొంగులేటి ఆత్మీయ భరోసా

## పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 118 కుటుంబాలకు ఆర్థిక సాయం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, మే 27:పాలేరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో వివిధ కారణాలతో కుటుంబ సభ్యులను కోల్పోయిన బాధిత కుటుంబాలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆత్మీయ భరోసాగా నిలిచారు. పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 118 కుటుంబాలకు రూ. 10 వేల చొప్పున బుధవారం ఆర్థిక సహాయం అందజేశారు. కూసుమంచి మండలంలోని ధర్మతండా కేశవాపురం, జీళ్లచెరువు, గోపాలరావుపేట, చేగొమ్మ, ముత్యాలగూడెం, పోచారం, కిష్టాపురం, తుర్కగూడెం నరసింహులగూడెం, కొత్తూరు, ఎర్రగడ్డ, గైగోలపల్లి, చౌటపల్లి, బోడియ తండా, లాల్‌సింగ్ తండా, సంధ్య తండా గ్రామాలకు చెందిన బాధిత కుటుంబాలకు కూసుమంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఇంచార్జ్ భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ కష్టకాలంలో మంత్రి పొంగులేటి అందించిన ఈ సహాయం తమకు ఎంతో ఊరటనిచ్చిందన్నారు. మానవతా విలువలకు ప్రతీకగా నిలుస్తూ ప్రజలకు అండగా ఉంటున్న శీనన్న సేవలు అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బజ్జూరి వెంకటరెడ్డి, సీడీసీ చైర్మన్ ఎర్రబోలు సూర్యనారాయణరెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, మాజీ ఎంపీపీలు జూకూరి గోపాలరావు, బాణోతు శ్రీను నాయక్, మాజీ ఎంపీటీసీ మాదాసు ఉపేందర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జొన్నలగడ్డ రవికుమార్, కంచర్ల జీవన్‌రెడ్డి, మాజీ సర్పంచులు చాట్ల పరుశురాం, జర్పుల శ్రీను నాయక్, బానోత్ రవి, శేఖర్ రెడ్డి, పీబీ శ్రీనివాస్, గోకినపల్లి గోపి, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వారం రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయకపోతే రైతులతో కలిసి రణభేరి

## బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కాటారం, మే 27:వారం రోజుల్లో వరి ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయకపోతే రైతులతో కలిసి మరోసారి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ హెచ్చరించారు. రైతులకు అండగా నిలిచి ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తే ప్రభుత్వం అక్రమ కేసులు నమోదు చేస్తోందని మండిపడ్డారు. తెలంగాణ బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "రైతు గోస–బీజేపీ భరోసా" కార్యక్రమంలో భాగంగా బుధవారం కాటారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు పర్యటించారు. కొత్తపల్లి గ్రామంలోని ఐకేపీ కేంద్రంలో ధాన్యం కుప్పలను పరిశీలించి రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం కాటారం వ్యవసాయ మార్కెట్‌లో ఉన్న ధాన్యం నిల్వలను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన్ రావు మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి నిల్వ ఉంచాల్సిన పరిస్థితి దురదృష్టకరమన్నారు. బీజేపీ ఎల్లప్పుడూ రైతుల పక్షాన నిలబడుతుందని, ప్రతి గింజ ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అనంతరం కాటారం మండల కేంద్రానికి చెందిన అనారోగ్యంతో బాధపడుతున్న తిరుపతిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఫ్లోర్ లీడర్ మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు కాటిపల్లి వెంకటరమణారెడ్డి, పైడి రాకేష్ రెడ్డి, పవర్ రామారావు పటేల్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయశ్రీ, రాష్ట్ర కార్యదర్శి బద్దం మహిపాల్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చంద్రపట్ల సునీల్ రెడ్డి, చల్లా నారాయణ రెడ్డి, కీర్తి రెడ్డి, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కర్రే సంజీవ్ రెడ్డి, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు నిశిధర్ రెడ్డి, మండల అధ్యక్షుడు పాగె రంజిత్ కుమార్, మేడిపల్లి పూర్ణచందర్, మనోజ్, శ్రీకాంత్ తదితర రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ అవకాశాలను వినియోగించుకుని మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

## భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్–భూపాలపల్లి, మే 27:రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించి వ్యాపారవేత్తలుగా ఎదగాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పిలుపునిచ్చారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల ఆర్థిక సాధికారత కోసం ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, స్వయం సహాయక సంఘాలకు రుణాలు, బ్యాంక్ లింకేజీలు కల్పిస్తోందన్నారు. మహిళా సంఘాలకు సోలార్ విద్యుత్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మహిళలు గోదాములు, బియ్యం మిల్లుల నిర్మాణానికి ముందుకొస్తే రుణ సదుపాయం కల్పిస్తామని పేర్కొన్నారు. గాంధీపురంలో రూ. 55 కోట్లతో మోడ్రన్ మార్కెట్ నిర్మాణం చేపడుతున్నామని, మండలాల్లో మహిళా సంఘాల భవనాల నిర్మాణానికి రూ. 10లక్షలు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. పాడి పరిశ్రమ అభివృద్ధికి కూడా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎన్నో ఏళ్లుగా సాగు చేస్తున్న రైతులకు భూ హక్కు పట్టాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు ఉంటాయని, అనంతరం అభివృద్ధే తన అజెండా అని స్పష్టం చేశారు. ఉపాధి హామీ పథకం కింద పెండింగ్‌లో ఉన్న రూ. 2 కోట్ల బిల్లులను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పొలాల్లో వరి, మక్కల వ్యర్థాలను కాల్చడం వల్ల భూసారం తగ్గిపోతుందని, ఇటీవల వ్యర్థాలు కాల్చే క్రమంలో భార్యాభర్తలు మృతి చెందిన ఘటన బాధాకరమని అన్నారు. రైతులు పంట మార్పిడికి మొగ్గు చూపాలని సూచించారు. ఇండ్లపై నుంచి వెళ్తున్న విద్యుత్ లైన్లను తొలగించేలా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో మక్కల కొనుగోలు 95 శాతం పూర్తి కావడంపై జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్‌తో పాటు సంబంధిత అధికారులను ఎమ్మెల్యే అభినందించారు. వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన అన్ని అంశాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. జూన్ 12 వరకు నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేయాలని, జూన్ 2 రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, డీఆర్వో వసంతకుమారి, సీపీఓ జవహర్, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమరయ్య, జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, కౌన్సిలర్లు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

## – డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, మే 27:తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వల్లనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతోందని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్, పాల్వంచ సొసైటీ అధ్యక్షుడు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మున్సిపల్ పరిధిలోని పలు డివిజన్లలో డివిజన్ స్థాయి సమావేశాలు నిర్వహించారు. పట్టణంలోని నెహ్రూనగర్, 47వ డివిజన్ పరిధిలోని రామానందతీర్థ కాలనీలో జరిగిన సమావేశాల్లో కొత్వాల శ్రీనివాసరావుతో పాటు డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజలకు మౌలిక వసతుల కల్పన కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే వేగంగా జరుగుతోందన్నారు. డివిజన్ కమిటీల ఏర్పాటు ద్వారా కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు చీకటి కార్తీక్, కార్పొరేటర్లు కాల్వ భాస్కరరావు, సీరపు సుగుణ, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శులు నూకల రంగారావు, పి.నరహరి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోండం వెంకన్న గౌడ్, కాంగ్రెస్ నాయకులు వాసుమల్ల సుందర్‌రావు, వై.వెంకటేశ్వర్లు, పెంకె శ్రీను, ఎస్‌కే చాంద్ పాషా, తురకా లక్ష్మయ్య, వాసుమల్ల సోమయ్య, వల్లమల్ల వెంకటరత్నం, మిరియాల రవి, శశి, జోషి, గడదేసి ప్రభాకర్, పల్లపోతుల ఉదయశ్రీ, ఘనీని, నజీర్ అహ్మద్, సంకటి శ్రీను, సంకటి వెంకన్న, ఎస్‌కే జకీర్, బండి శ్రీను, బండి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలి

## – దేశవ్యాప్తంగా "గాయ్ రక్షక్ దళ్" ఏర్పాటు చేయాలని సయ్యద్ సాదిక్ ఆలీ డిమాండ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, మే 27:భారతీయ సంస్కృతి, సహజీవన స్ఫూర్తి, మానవతా విలువలకు ప్రతీకగా గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఫౌండర్ జాతీయ అధ్యక్షుడు సయ్యద్ సాదిక్ ఆలీ డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా "గాయ్ రక్షక్ దళ్" ఏర్పాటు చేసి గోవుల సంరక్షణకు సమగ్ర విధానాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గోమాత రక్షణ ఒక మతానికి లేదా వర్గానికి పరిమితం కాదని, అది భారతీయ సంస్కృతి, జాతీయత, మానవత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రతి గోశాలకు బీమా సదుపాయం కల్పించడం, ప్రతి 15 రోజులకు పశువైద్యుల ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించడం, ప్రత్యేక బీడు భూములు కేటాయించడం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. "హమ్ గాయ్ భక్షక్ నహీ... గాయ్ రక్షక్ హై" అనే సందేశాన్ని దేశవ్యాప్తంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. గోవధ ఫ్యాక్టరీలకు ముస్లింల పేర్లు పెట్టి సామాజిక విద్వేషాలను రెచ్చగొట్టడం సరికాదని పేర్కొన్నారు. అలాంటి వ్యాపారాలను నిర్వహించే వారు తమ పిల్లల పేర్లతోనే కొనసాగించాలని సూచిస్తూ, సమాజంలో పరస్పర గౌరవం, బాధ్యతా భావం పెరగాలని అన్నారు. మతాల పేర్లతో విభేదాలు సృష్టించడం కన్నా భారతీయులుగా ఐక్యంగా నిలబడటమే దేశానికి శ్రేయస్కరమని సయ్యద్ సాదిక్ ఆలీ పేర్కొన్నారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో ముస్లిం మహనీయుల పాత్రను ప్రస్తావిస్తూ జాతీయ జెండా రూపకల్పనలో కృషి చేసిన సూరయ్య త్యాబ్జీ, "జైహింద్" నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన అదిబ్ హసన్ సఫ్రాని, "క్విట్ ఇండియా" నినాదాన్ని ఇచ్చిన యూసుఫ్



మెహర్ ఆలీ, నేతాజీకి విరాళాలు అందించిన అబ్దుల్ హబీబ్ యూసుఫ్ మార్ఫాని సేవలను కొనియాడారు. దేశం అనేది కేవలం భూభాగం కాదని, పరస్పర గౌరవం, త్యాగాలతో నిర్మితమైన మహోన్నత భావన అని పేర్కొన్నారు. గోమాత పరిరక్షణతో పాటు భారతీయుల ఐక్యత కోసం అన్ని వర్గాలు కలిసి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాజ్యాంగ పరిరక్షణ వేదిక పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ నజీరుద్దీన్, మహమ్మద్ ఖలీమ్, సైదా, సుభాని, మున్నాభాయ్, హబీబ్, అల్లా బకాష్, ఎండీ షఫీ, ఎండీ గులాం నబీ, ఎండీ గౌస్, ఎండీ ఖుద్రతుల్లా, ఎండీ హాది, ఎండీ కలీము భాయ్, ఎండీ అమ్జద్ పాషా, అల్లాభక్ష్, ఎస్‌కే ఆరిఫ్, తౌసీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం సమాజానికి ఎంపీ వద్దిరాజు బక్రీద్ శుభాకాంక్షలు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, మే 27:బక్రీద్ పర్వదినం (ఈద్–ఉల్–అధా) సందర్భంగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ముస్లిం సోదరులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ త్యాగానికి, భక్తి విశ్వాసాలకు ప్రతీకగా నిలిచే మహత్తర పండుగ అని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక సందేశం విడుదల చేశారు. మహ్మద్ ప్రవక్త బోధించిన మానవత్వం, ప్రేమ, శాంతి, సమానత్వం, దయ, కరుణ, క్షమాగుణాలు ప్రపంచ మానవాళికి ఎల్లప్పుడూ ఆదర్శప్రాయమని అన్నారు. అన్ని మతాలను సమాన దృష్టితో గౌరవించే నాయకుడు బీఆర్ఎస్ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు అని కొనియాడారు. మహమూద్ అలీకి ఉప ముఖ్యమంత్రి పదవితో పాటు కీలకమైన హోంశాఖ బాధ్యతలు అప్పగించి మైనారిటీలకు సముచిత గౌరవం కల్పించారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పాలనలో మైనారిటీల సంక్షేమం కోసం పలు సంక్షేమ పథకాలు అమలు చేశారని తెలిపారు. తెలంగాణలో గంగా–జమున తహజీబ్ సంస్కృతి మరింత బలోపేతం కావడానికి కేసీఆర్ పాలన దోహదపడిందన్నారు. నాంపల్లిలో నిజాం కాలంలో నిర్మించిన "అనీస్–ఉల్–గుర్బా" భవనాన్ని అనాథ బాలబాలికల కోసం ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేసేందుకు కేసీఆర్ ప్రభుత్వం నిధులు విడుదల చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అల్లాహ్ అనుగ్రహంతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, శాంతియుతంగా జీవించాలని ఆకాంక్షిస్తూ ఈద్–ఉల్–అధా సందర్భంగా ముస్లిం సమాజానికి ఎంపీ వద్దిరాజు మరోసారి శుభాకాంక్షలు తెలిపారు.

# వేసవి వేళ పక్షుల దాహార్తి తీర్చేందుకు మట్టి పాత్రల్లో నీళ్లు ఏర్పాటు




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, మే 27:వేసవి తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో పక్షుల దాహార్తిని తీర్చేందుకు యూనిటీ ఇన్ డైవర్సిటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్‌లో పక్షులకు నీటి సదుపాయం కల్పించారు. చెట్లకు మట్టి పాత్రలు కట్టి వాటిలో నీళ్లు నింపి పక్షులకు అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు కత్తి నెహ్రూ గౌడ్, కార్యదర్శి షేక్ జాఫర్ మాట్లాడుతూ ఎండాకాలంలో పక్షులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల ముందు చిన్న పాత్రల్లో అయినా నీళ్లు ఉంచి మూగజీవాల దాహార్తిని తీర్చాలని కోరారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా జీవరాశులను కాపాడటం ప్రతి మనిషి బాధ్యత అని పేర్కొన్నారు. పెవిలియన్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. పక్షులకు నీటి సదుపాయం కల్పించిన యూనిటీ ఇన్ డైవర్సిటీ సభ్యులను స్థానిక వాకర్స్ అభినందించారు. మరింత మంది ఇలాంటి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూనిటీ ఇన్ డైవర్సిటీ వైస్ ప్రెసిడెంట్ వి.డి.ఐ జయరాజు, ట్రెజరర్ బోగా గిరి, సహాయ కార్యదర్శి రాకం శ్యాంబాబు, స్థాపక సభ్యులు ఎండీ బషీర్ అహ్మద్, మంద వెంకటేశ్వర్లు, మాజీ కార్పొరేటర్ బుడిగెం శ్రీనివాస్, పెవిలియన్ గ్రౌండ్ వాకర్స్ కమిటీ సభ్యులు రామనాథం, విజయ్, దామోదర్ రెడ్డి, చంద్రశేఖర్, వెంకట్, శ్రీనివాస్, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ నర్సింహారావు, గోవిందరావు, హరి, రమ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యం

## ఎండాకాలం ఫ్రిడ్జ్‌లో ప్లాస్టిక్ వాటర్ బాటిల్ పెట్టేవారికి షాకింగ్ న్యూస్ - వారికైతే మరణం గ్యారెంటీ!



ఈ రోజుల్లో ప్లాస్టిక్ వాటర్ బాటిళ్ల వాడకం విపరీతంగా పెరిగింది. సీసా బాటిళ్లతో కూడిన వాటర్ బాటిళ్లు మార్కెట్లో చాలా రకాలుగా అందుబాటులో ఉన్నప్పటికీ, ఎక్కువమందీ ఇంట్లో ఫ్రిజ్‌లో ప్లాస్టిక్ బాటిళ్లనే ఎక్కువగా వాడతారు. దీనికి కారణం, సీసా బాటిళ్లను తీసుకోవడం చాలా ఖరీదైనది. అలాగే వాటిని తీసుకున్న తరువాత కూడా చాలా జాగ్రత్తగా చూసుకోవాల్సి ఉంటుంది. ఎందుకంటే అవి పగిలిపోతాయి. కానీ ప్లాస్టిక్ బాటిళ్ల ధర చౌకగా ఉంటుంది. కింద పడ్డ కూడా అంత సులభంగా పగలవు. అందుకే ఎక్కువ మంది వీటిని వినియోగించడానికి ట్రై చేస్తుంటారు. కానీ ఈ ప్లాస్టిక్ బాటిళ్ల వాడకం కొన్ని ఆరోగ్య ప్రమాదాలకు దారితీస్తుంది. అవి మన ఆరోగ్యంపై ప్రతికూలమైన ప్రభావాన్ని చూపిస్తాయి. అవేంటో ఈ స్టోరీలో తెలుసుకుందాం రండి. ప్లాస్టిక్ బాటిళ్ల వాడకం వల్ల వచ్చే ప్రమాదాలు ప్లాస్టిక్ బాటిళ్లను ప్రస్తుత కాలంలో ఎన్నో రసాయనాలు వాడి తయారు చేస్తున్నారు. వాటి మనం ప్రతిరోజూ వాడే విధానం, వాటిలోని రసాయనాలు కరిగి మన శరీరంలోకి చేరే అవకాశం ఉంటుంది. అలాగే అందులోని బ్యాక్టీరియా, ప్రమాదకరమైన ప్లాస్టిక్ కణాలు అంతా మన శరీరంలోకి చేరి.. ప్రమాదకరమైన క్యాన్సర్, ఇతర రోగాల బారిన పడే అవకాశాన్ని సృష్టిస్తాయి. అందుకే ప్లాస్టిక్ బాటిళ్లను వాడడం అనేది అత్యంత జాగ్రత్తగా చేయాల్సిన ప్రక్రియ. ప్లాస్టిక్ బాటిళ్లను వాడినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు: బాటిళ్లను తరచూ మార్చడం: ఫ్రిజ్‌లోని ప్లాస్టిక్ బాటిళ్లను ఎప్పటికప్పుడు మారుస్తూ ఉండాలి. ఒకే బాటిల్‌ను చాలా కాలం వాడడం వల్ల, అది మురికితో నిండిపోతుంది. అలాగే అందులో బక్టీరియా పెరుగుతుంది. అలాగే, ప్లాస్టిక్ బాటిళ్లలోని రసాయనాలు నీటిలోకి లీక్ అవటం వల్ల.. అందులోని ఆరోగ్యానికి హానికరమైన పదార్థాలు శరీరంలోకి ప్రవేశించవచ్చు. ఎన్ని రోజుల్లో ప్లాస్టిక్ బాటిళ్లు మార్చాలంటే సాధారణంగా, ప్లాస్టిక్ బాటిళ్లను 6 నెలలలోపు మార్చడం మంచిది. కొన్ని అధిక నాణ్యత కలిగిన ప్లాస్టిక్ బాటిళ్లు 12 నెలల వరకు వాడొచ్చు. అయితే, బాటిల్ పగిలిపోయినట్లయితే, దుర్వాసన వచ్చిందని గమనిస్తే వెంటనే మార్చాలి.

గ్లాస్ మరియు స్టెయిన్‌లెస్ స్టీల్ బాటిళ్లు

గ్లాస్ వాటర్ బాటిళ్లు, సాధారణంగా, 2-3 సంవత్సరాల పాటు ఉపయోగించవచ్చు. స్టెయిన్‌లెస్ స్టీల్ బాటిళ్లు కూడా 2 సంవత్సరాల తర్వాత కచ్చితంగా మార్చాల్సిన అవసరమైతే ఉంటుంది. ఇవి స్థిరమైన పదార్థాలతో తయారు కావడంతో పాటు తొందరగా పాడవకపోవడంతో వాటిని ఎక్కువగా కాలం వినియోగించుకునేందుకు ఆస్కారం ఉంటుంది. ప్రతిరోజూ శుభ్రం చేయడం బాటిళ్లను సరైన పద్ధతిలో శుభ్రం చేయడం చాలా ముఖ్యం. ప్రతి రోజు వాటిని వేడి నీటి మరియు సబ్బుతో శుభ్రం చేయడం వల్ల అందులో బక్టీరియా పెరుగుదలను నివారించవచ్చు. శుభ్రతను పాటించడం వలన బాటిల్ శుభ్రంగా ఉండడంతో పాటు అందులో పోసే నీరు కూడా పరిశుభ్రంగా ఉంటుంది. ప్లాస్టిక్ బాటిళ్లకు ప్రత్యామ్నాయాలు: గ్లాస్ బాటిళ్లు: గ్లాస్ బాటిళ్లను ఉపయోగించడం చాలా మంచి ప్రత్యామ్నాయం. ఇవి లీకేజి సమస్య లేకుండా, ఆరోగ్యానికి ప్రమాదకరం కాని పదార్థాలను విడుదల చేయవు. స్టెయిన్‌లెస్ స్టీల్ బాటిళ్లు: ఇవి కూడా మంచి ఆప్షన్. ఇవి దృఢంగా ఉండి, ఎక్కువ కాలం వాడటానికి సరైనవి. ఇవి పగిలిపోవడం లేదా లీక్ అవడం చాలా అరుదు. తగిన జాగ్రత్తలు ప్లాస్టిక్ బాటిళ్లలో నీటి నిల్వ చేయడానికి, మంచి నాణ్యత కలిగిన బాటిళ్లను మాత్రమే తీసుకోవడం మంచిది. బాటిళ్లను మూసివేసి ఉంచుకోవడం వల్ల బయట జంతువులు, ధూళి, కురుపులు వాటిలో చేరకుండా ఉంటాయి. సీసా లేదా స్టెయిన్‌లెస్ స్టీల్ బాటిళ్లలోనే నీటి నిల్వ చేయడం ఆరోగ్యానికి ఎంతో మంచిది.

## మండే ఎండలో ఈ షర్బత్ తాగితే చిటికెలో బాడీ కూల్ అయిపోతుంది

### రంజాన్ స్పెషల్ కూడా.. ఎలా చేసుకోవాలంటే

రంజాన్ మాసం చివరి దశకు వచ్చేసింది. మరికొన్ని రోజుల్లో ఈ రంజాన్ మాసం ముగిసిపోతుంది. మార్చి 31వ తేదీన రంజాన్ పండగ తరువాత ఈ మాసం గుడ్ బాయ్ చెప్పనుంది. అయితే ఇప్పటికే ఎండలు మండిపోతున్నాయి. బయటికి వెళ్లాలంటేనే ప్రజలు జంకుతున్నారు. ఎండ వేడిమి తాళలేక రకరకాల పానీయాలు తయారు చేసుకోవడం, బయట తాగడం వంటివి చేస్తున్నారు. అయితే ఇప్పటికీ రంజాన్ పండగ కొనసాగుతున్న నేపథ్యంలో సమ్మర్? ప్రత్యేకమైన చల్లని, రిఫ్రెషింగ్ షర్బత్ తాగితే ఆ రుచి, ఆ చల్లదనం అద్భుతంగా ఉంటుంది. అలాగే సమ్మర్‌లో తాగడానికి ఇదే బెస్ట్ ఆప్షన్ అంట కూడా. ఇంట్లో ఉండే సాధారణ పదార్థాలతోనే మీ ఇంటి సభ్యులు సమ్మర్ మజా అనుభవించవచ్చు. అయితే, దీనిని తయారుచేయడానికి అవసరమైన పదార్థాలు మరియు తయారీ విధానం ఈ స్టోరీలో తెలుసుకుందాం.

షర్బత్ తయారీకి కావలసిన పదార్థాలు: పంచదార - 1 కప్పు నీళ్లు - పావు కప్పు పాలు - 4 కప్పులు కస్టర్డ్ పొడి - 1 టేబుల్ స్పూన్ పాలు (కస్టర్డ్ కోసం) - 2 టేబుల్ స్పూన్లు కుంకుమ పువ్వు - అర టీస్పూన్ యాలకుల పొడి - 1 టీస్పూన్ చియా సీడ్స్ - 1 టేబుల్ స్పూన్ బాదం, పిస్తా పలుకులు - 2 టేబుల్ స్పూన్లు.

రంజాన్ షర్బత్ తయారీ విధానం: రంజాన్ షర్బత్ తయారు చేసుకోవడానికి మొదటగా స్టవ్‌పై పాన్ పెట్టి అందులో పంచదారను వేసి, సిమ్ మంట మీద కరిగేలా బాగా కలపాలి. పంచదార కరిగి అందులో పొంగుల ద్వారా రంగు మారినప్పుడు, దానిలో పావు కప్పు నీళ్లు జోడించాలి. నీళ్లు వేసిన తర్వాత మిశ్రమాన్ని బాగా కలుపుతూ ఉంచాలి. అలానే కలుపుతూ బాగా ఉడికించుకోవాలి.

ఇప్పుడు మంటను సిమ్‌లో ఉంచి, పంచదార కరిగిపోయే వరకు..



ఒక గిన్నెలో కుంకుమ పువ్వును నానబెట్టుకోవాలి. ఆ తరువాత, పాలు కూడా ఈ మిశ్రమంలో జోడించి బాగా కలపాలి. పాలు మరియు పంచదార చక్కగా కలిసిపోయేలా 4-5 నిమిషాలు ఉడికించాలి. ఈ సమయంలో, ఒక చిన్న గిన్నెలో కస్టర్డ్ పౌడర్ తీసుకుని, 2 టేబుల్ స్పూన్ల పాలు వేసి కరిగించాలి. ఈ కస్టర్డ్ మిశ్రమాన్ని స్టవ్‌పై ఉడికే మిశ్రమంలో జోడించి, గట్టిగా కలుపుతుండాలి. ఈ మిశ్రమం తయారు చేస్తున్న సమయంలో ఎటువంటి గడ్డలు రాకుండా ఎప్పటికప్పుడు కలుపుతూ ఉండాలి. ఇప్పుడు కుంకుమ పువ్వును మరియు యాలకుల పొడిని కూడా ఈ మిశ్రమంలో జోడించి, ఇంకో 5 నిమిషాల పాటు ఉడికించుకోవాలి. ఆ తరువాత ఈ మిశ్రమాన్ని మరొక గిన్నెలో తీసుకొని, రూమ్ టెంపరేచర్‌కి రానివ్వాలి. ఆ తరువాత 2 గంటలు ఫ్రిడ్జ్‌లో వుంచాలి. ఫ్రిడ్జ్ నుండి తీసిన తర్వాత, చియా సీడ్స్ లేదా బేసిల్ సీడ్స్‌ని నీటిలో నానబెట్టుకుని, షర్బత్‌లో జోడించి బాగా కలపాలి. చివరగా, బాదం మరియు పిస్తా పలుకులతో గార్నిష్ చేసి, ఐస్ క్యూబ్స్ వేసి చల్లగా సర్వ్ చేసుకోవచ్చు. ఈ చల్లని, టేస్టీ దూద్ షర్బత్‌ను రంజాన్ పండుగ సమయంలో కానీ, సమ్మర్ లోనూ చాలా సులభంగా, తక్కువ సమయంలోనే రెడీ చేసుకొని ఆస్వాదించొచ్చు.




## మన పూర్వీకులు తిన్నది ఇదే..



మనం ఇప్పటికీ మన పూర్వీకుల ఆరోగ్యం గురించి గొప్పగా చెప్పుకుంటుంటాం. బీపీలు, షుగర్ లు వంటి ఏ రోగాలు లేకుండా హాయిగా మన పూర్వీకులు జీవించడానికి ప్రధాన కారణం వారు తీసుకున్న ఆహారం. గట్టి ఆహారం తీసుకున్నారు కాబట్టే ముసలివయస్సులో ఎంతో యాక్టివ్ గా ఉంటేవాళ్లు. మన పూర్వీకులు తిన్న ఆరోగ్యకరమైన వంటకాల్లో మెంతికూర గట్టి పప్పు ఒకటి. ఇది పోషకాల గని అని చెప్పడంలో ఎలాంటి సందేహం అక్కర్లేదు. సాధారణ పప్పు కంటే ఇది కొంచెం గట్టిగా ఉండటం వల్ల దీనికి గట్టి పప్పు అని పేరు వచ్చింది. ఇది అన్నం, చపాతీ లేదా రోటీతో కలిపి తింటే చాలా రుచిగా ఉంటుంది. రుచికరమైన,ఆరోగ్యకరమైన మెంతికూర పప్పు తయారుచేయడానికి కావలసిన పదార్థాలు,తయారీ విధానం ఇక్కడ చూడండి.

మెంతికూర గట్టి పప్పు తయారీకి కావలసిన పదార్థాలు -కంది పప్పు - 1 కప్పు -మెంతికూర - 1 పెద్ద కట్ట -ఉల్లిపాయ - 1 మీడియం సైజు -టమాటో - 1 మీడియం సైజు -పచ్చిమిర్చి - 2-3 -అల్లం వెల్లుల్లి పేస్ట్ - 1 టీస్పూన్ -పసుపు - 1/2 టీస్పూన్ -కారం - 1/2 టీస్పూన్ -ధనియాల పొడి - 1/2 టీస్పూన్ -జీలకర్ర పొడి - 1/4 టీస్పూన్ -ఆవాలు - 1/2 టీస్పూన్ -జీలకర్ర - 1/2 టీస్పూన్ -ఎండుమిర్చి - 2 -కరివేపాకు - 1 రెమ్మ -నూనె - 2 టేబుల్ స్పూన్లు -ఉప్పు - తగినంత -నిమ్మరసం - కొద్దిగా.

మెంతికూర గట్టిపప్పు తయారీ విధానం -ముందుగా కంది పప్పును శుభ్రంగా కడిగి కనీసం 30 నిమిషాల పాటు నీటిలో నానబెట్టండి. ఇలా చేయడం వల్ల పప్పు త్వరగా ఉడుకుతుంది, రుచిగా ఉంటుంది. -తర్వాత నానబెట్టిన పప్పును కుక్కర్ లో వేసి తగినంత నీరు, కొద్దిగా పసుపు వేసి 3-4 విజిల్స్ వచ్చే వరకు ఉడికించండి. పప్పు మెత్తగా ఉడకాలి. -ఇప్పుడు స్టవ్ మీద బాండీ పెట్టి కొద్దిగా నూనె వేడి చేసి తరిగిన ఉల్లిపాయలు వేసి బంగారు రంగు వచ్చే వరకు వేయించండి. తర్వాత పచ్చిమిర్చి ముక్కలు, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి ఒక నిమిషం పాటు వేయించండి. -ఇప్పుడు తరిగిన టమాటో ముక్కలు వేసి మెత్తబడే వరకు ఉడికించండి. తర్వాత తరిగిన మెంతికూర వేసి అది మగ్గే వరకు ఉడికించాలి. మెంతికూర బాగా మగ్గితే దాని చేదు రుచి తగ్గుతుంది. -ఉడికించిన పప్పును పప్పు గుత్తితో మెత్తగా మాష్ చేసి..మగ్గిన మెంతికూర మిశ్రమంలో వేయండి. కారం పొడి, ధనియాల పొడి, జీలకర్ర పొడి,రుచికి తగినంత ఉప్పు వేసి బాగా కలపండి. అవసరమైతే కొద్దిగా నీరు పోసి పప్పు గట్టిదనాన్ని సర్దుబాటు చేసుకోండి. -పప్పును మూత పెట్టి 5-7 నిమిషాలు తక్కువ మంట మీద మరిగించండి. ఇలా చేయడం వల్ల అన్ని రుచులు బాగా కలిసిపోతాయి.

## ఎగ్ బటర్ మసాలా..తిన్నారంటే మస్త్ మజా,ఎలా చేయాలంటే..



ఎగ్ బటర్ మసాలా తయారు చేయడానికి కావలసిన పదార్థాలు -గుడ్లు: 4 -కొత్తిమీర: కొద్దిగా -కసూరి మెంతి: 1 టీ స్పూన్ -కారం: 1 టీ స్పూన్ -ధనియాల పొడి: 1 టీ స్పూన్ -జీలకర్ర పొడి: 1/2 టీ స్పూన్ -గరం మసాలా: 1/2 టీ స్పూన్ -పసుపు: 1/4 టీ స్పూన్ -ఉల్లిపాయలు: 2 -టమాటాలు: 3 -అల్లం వెల్లుల్లి పేస్ట్: 1 టేబుల్ స్పూన్ -ఫ్రెష్ క్రీమ్ (మీగడ): 2 టేబుల్ స్పూన్లు -జీడిపప్పు: 10-12 -పచ్చిమిర్చి: 2 -నూనె లేదా నెయ్యి: 2 టేబుల్ స్పూన్లు -బటర్: 2 టేబుల్ స్పూన్లు -చక్కెర: 1/2 టీ స్పూన్ -ఉప్పు: తగినంత

**ఎగ్ బటర్ మసాలా తయారీ విధానం**

-ముందుగా గుడ్లను బాగా ఉడికించి పొట్టు తీసి ఒక్కో గుడ్డును రెండు సమాన భాగాలుగా కోయాలి. మీరు కావాలంటే గుడ్డు సొనను తీసి పక్కన పెట్టుకోవచ్చు (దీనిని గ్రేవీలో వేసుకోవచ్చు). -తర్వాత వేడినీళ్లలో నానబెట్టిన జీడిపప్పును మిక్సీలో వేసి కొద్దిగా నీరు కలిపి మెత్తని పేస్ట్ లా గ్రైండ్ చేసుకోవాలి. -ఇప్పుడు స్టవ్ మీద బాండీ పెట్టి అందులో నూనె లేదా నెయ్యి వేడి చేసి అందులో సన్నగా తరిగిన ఉల్లిపాయలు వేసి బంగారు రంగు వచ్చే వరకు వేయించాలి. -ఉల్లిపాయలు వేగిన తర్వాత..తరిగిన టమాటాలు, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి టమాటాలు మెత్తగా అయ్యే వరకు ఉడికించాలి. మధ్య మధ్యలో కలుపుతూ ఉండాలి,లేదంటే అడుగంటుతుంది. -టమాటాలు మెత్తగా ఉడికిన తర్వాత కారం, ధనియాల పొడి, జీలకర్ర పొడి, పసుపు,పచ్చిమిర్చి వేసి బాగా కలపాలి. మసాలాలు నూనెలో కాసేపు వేగితే మంచి సువాసన వస్తుంది. -ఇప్పుడు తయారు చేసుకున్న జీడిపప్పు పేస్ట్ ను అందులో వేసి బాగా కలపాలి. ఇది గ్రేవీకి మంచి చిక్కదనాన్ని ఇస్తుంది. ఒక నిమిషం పాటు ఉడికించాలి. -ఇప్పుడు అవసరమైన మేరకు నీరు పోసి, గ్రేవీని మీకు కావలసిన చిక్కదనానికి తీసుకురావాలి. తర్వాత రుచికి తగినంత ఉప్పు వేసి కలపాలి. -గ్రేవీ మరిగిన తర్వాత బటర్ లేదా వెన్న, గరం మసాలా వేసి బాగా కలపాలి. వెన్న కరిగే వరకు ఉడికించాలి. -తర్వాత నలిపిన కసూరి మెంతి, కావాలనుకుంటే కొద్దిగా చక్కెర వేసి కలపాలి. చక్కెర వేయడం అనేది ఆప్షనల్.. కానీ ఇది రుచిని బ్యాలెన్స్ చేస్తుంది.

# సినిమా న్యూస్




## ఏపీలో సినిమా టీవీ రంగ అభివృద్ధికి సహకరిస్తామన్న ఫిలింఛాంబర్ పెద్దలు!



ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్ తరహాలోనే మరో సమాంతర చిత్రసీమను ఏర్పాటు చేయాలనే అంశంపై స్థానిక ప్రజల్లో, సినీ వర్గాల్లో చాలా కాలంగా ఆసక్తికరమైన చర్చ సాగుతోంది. ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, అగ్ర కథానాయకుడు నందమూరి బాలకృష్ణ, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ వంటి ప్రముఖులు ఏపీలో మరో టాలీవుడ్‌ను అభివృద్ధి చేయడంపై పలు సందర్భాల్లో తమ స్పష్టమైన సంకల్పాన్ని ప్రస్తావించారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ సినిమా, టీవీ రంగంతో పాటు రంగస్థలం కూడా సమగ్రంగా అభివృద్ధి చెందాలనే బలమైన ఆకాంక్షను వీరంతా బయటపెట్టారు. అంతేకాదు ఏపీ పరిధిలో షూటింగులు జరుపుకునే వారికి సింగిల్ విండో విధానం ద్వారా వేగంగా అనుమతులు మంజూరు చేయడంతో పాటు, అవసరమైన అన్ని వసతులు కల్పిస్తామని ప్రభుత్వం తరపున వీరంతా ఇప్పటికే భరోసా ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సినిమా- టెలివిజన్- రంగస్థల అభివృద్ధి సంస్థ (ాూాఖీజుణజ) కు కొత్త పాలకమండలిని నియమించడం ఇండస్ట్రీలో పెద్ద ఎత్తున ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ కార్పొరేషన్‌లో సీనియర్ నిర్మాత, ప్రముఖ దర్శకుడు చదలవాడ శ్రీనివాసరావును డైరెక్టర్‌గా, అలాగే భరత్ భూషణ్‌ను ఛైర్మన్‌గా నియమించడం విశేషం. ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని అంతర్జాతీయ స్థాయిలో నిర్మిస్తున్న చంద్రబాబు ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ లోను సరికొత్త సినీ పరిశ్రమను, బలమైన టీవీ రంగాన్ని సహకారం, మద్దతు ఎల్లప్పుడూ ఉంటాయని ఫిల్మ్ ఛాంబర్ పెద్దలు గట్టి హామీ ఇవ్వడం టాలీవుడ్‌లో సరికొత్త సానుకూల వాతావరణానికి తెరతీసింది. ప్రస్తుత తరుణంలో రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ రెండు వైవిధ్యమైన సినీ పరిశ్రమలు సమాంతరంగా అభివృద్ధి చెందాలని ఇరు ప్రాంతాల ప్రజలు, సినీ విశ్లేషకులు ఆకాంక్షిస్తున్నారు. హైదరాబాద్‌లోని చిత్ర పరిశ్రమ ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుంటూ హాలీవుడ్ రేంజులో దూసుకుపోతోంది. ఈ క్రమంలోనే తెలంగాణలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా ఇక్కడి సినీ పరిశ్రమకు అన్ని విధాలా సహకరిస్తామని అధికారికంగా ప్రకటించింది. మరోవైపు ఏపీ ప్రభుత్వం కూడా చదలవాడ వంటి అనుభవజ్ఞులైన సినీ పెద్దల మార్గదర్శకత్వంలో కొత్త ఎఫ్‌డీసీ ద్వారా ఏపీలో సరికొత్త మౌలిక వసతుల కల్పనకు ముందడుగు వేస్తోంది. మునుముందు రోజుల్లో ఇరు రాష్ట్ర ప్రభుత్వాల నుంచి లభించే ఈ సంస్థాగత మద్దతు రెండు పరిశ్రమల ఎదుగుదలకు ఎంతగానో తోడ్పడనుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

## పెద్దినే కాదు.. ఆ సినిమాలు కూడా..



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ పెద్ది ఇప్పుడు కొత్త చర్చకు దారితీస్తోంది. బుచ్చిబాబు సనా తెరకెక్కిస్తున్న ఆ పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామాపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. అయితే సినిమాను కేవలం మాస్ ఎలివేషన్స్, ఫైట్లకే పరిమితం కాకుండా స్ట్రాంగ్ ఎమోషనల్ డ్రామాతో రూపొందించారని క్లియర్ గా తెలుస్తోంది. స్పోర్ట్స్ ద్వారా గ్రామ ప్రజలను ఒక్కటి చేయడం, ఫ్యామిలీ ఎమోషన్స్ వంటి అంశాలతో తెరకెక్కించారని సమాచారం.అదే ఇప్పుడు టాలీవుడ్ దర్శకుల కొత్త స్ట్రాటజీగా మారినట్లు కనిపిస్తోంది. ఎందుకంటే ప్రస్తుతం కేవలం స్టార్ హీరో ఇమేజ్ తోనే సినిమాలు వర్కౌట్ అవ్వడం లేదు. కంటెంట్ స్ట్రాంగ్ గా ఉంటేనే ఆడియన్స్ థియేటర్లకు వస్తున్నారు. మంచి ఎమోషన్స్, హార్ట్ టచ్ చేసే కథలు ఉంటేనే సినిమాను ఆదరిస్తున్నారు. దీంతో దర్శకులు కూడా కొత్తగా ఆలోచిస్తూ మాస్ కమర్షియల్ ఫార్మాట్ లోనే ఎమోషన్స్ ను యాడ్ చేసే ప్రయత్నం చేస్తున్నారు. ముఖ్యంగా పాన్ ఇండియా మార్కెట్ పెరిగిన తర్వాత అన్ని భాషల ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యే యూనివర్సల్ ఎమోషన్స్ పై ఎక్కువ ఫోకస్ పెడుతున్నారు. అదే ఇప్పుడు దర్శకుల మెయిన్ స్ట్రాటజీగా మారింది. అయితే పెద్దినే కాదు.. ప్రస్తుతం పలువురు స్టార్ హీరోల రాబోయే సినిమాలను గమనిస్తే ఇదే ట్రెండ్ క్లియర్ గా కనిపిస్తోంది. ప్రస్తుతం ఆ విషయం హాట్ టాపిక్ గా మారింది. మెగాస్టార్ చిరంజీవి- బాబీ కాంబినేషన్ లో తెరకెక్కుతున్న మెగా 158 కూడా ఎమోషనల్ యాక్షన్ డ్రామాగా రూపుదిద్దుకుంటోందని టాక్. శ్రీలంక బ్యాక్ డ్రాప్ లో సాగే చిత్రంలో చిరంజీవి పోలీస్ ఆఫీసర్ గా కనిపించనున్నారని సమాచారం. అయితే మెయిన్ స్టోరీ లైన్ ఫాదర్ డాటర్ సెంటిమెంట్ అని తెలుస్తోంది. తండ్రీకూతుళ్ల మధ్య రిలేషన్ ను స్ట్రాంగ్ గా చూపించబోతున్నారట. ఇక నందమూరి బాలకృష్ణ- కొరటాల శివ కాంబినేషన్ లో తెరకెక్కనున్న చీదీఖ 112 కూడా ఇదే దారిలో వెళ్తోంది. కొరటాల శివ సినిమాల్లో సోషల్ మెసేజ్, ఫ్యామిలీ ఎమోషన్స్ ఎంత స్ట్రాంగ్ గా ఉంటాయో తెలిసిందే. ఆ సినిమాలో కూడా పవర్ ఫుల్ మాస్ యాక్షన్ తో పాటు గుండెల్ని తాకే ఫ్యామిలీ ఎమోషన్స్ కు పెద్దపీట వేసినట్లు సమాచారం. రవితేజ నటిస్తున్న ఇరుముడి సినిమా అయితే తండ్రీకూతుళ్ల ఎమోషన్స్ చుట్టూనే తిరుగుతుందని వినికిడి. దర్శకుడు శివ నిర్వాణ ఇంటెన్స్ ఎమోషనల్ యాక్షన్ డ్రామాగా డిజైన్ చేసినట్లు టాక్. ఒక తండ్రి తన కుమార్తె కోసం చేసే పోరాటం ప్రేక్షకులను భావోద్వేగానికి గురి చేస్తుందని ప్రచారం జరుగుతోంది. అదే సమయంలో సూర్య- వెంకీ అట్లూరి కాంబోలో రూపొందుతున్న విశ్వనాథ్ అండ్ సన్స్ కూడా ఫ్యామిలీ ఎమోషన్స్ తోనే తెరకెక్కుతోంది. అలా ఇప్పుడు అనేక మంది దర్శకుల ఆలోచన పూర్తిగా మారిపోయినట్లు కనిపిస్తోంది. ఒకప్పుడు మాస్ ఎలిమెంట్స్ చాలు అనుకునే పరిస్థితి ఉండేది. కానీ ఇప్పుడు ప్రేక్షకులు కంటెంట్ ను చాలా జాగ్రత్తగా చూస్తున్నారు. కథలో స్ట్రాంగ్ ఎమోషన్స్ లేకపోతే ఎంత పెద్ద స్టార్ హీరో సినిమా అయినా కనెక్ట్ కావడం లేదు. అందుకే దర్శకులు కూడా కమర్షియల్ ఫార్మాట్ లోనే హార్ట్ టచింగ్ ఎమోషన్స్ ను యాడ్ చేస్తూ, ప్రేక్షకులతో ఎమోషనల్ కనెక్షన్ క్రియేట్ చేసే స్ట్రాటజీతో కథలను సిద్ధం చేస్తున్నట్లు కనిపిస్తున్నారు. మరి ఎలాంటి హిట్స్ అందుకుంటారో వేచి చూడాలి.

## బికినీ షాట్ లో సెగలు పుట్టిస్తున్న దంగల్ బ్యూటీ!



అమాయకపు చూపులతో.. గ్లామర్ అందాలతో కుర్రకారు హృదయాలను దోచుకునే సాన్య మల్హోత్రా గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. అమీర్ ఖాన్ ప్రధానోపాత్రలో స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్ లో వచ్చిన దంగల్ సినిమాలో కీలక పాత్ర పోషించి, ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈమె.. ఈ ఒక్క సినిమాతో ఊహించని విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ సినిమా తర్వాత పలు బాలీవుడ్ చిత్రాలలో నటిస్తూ భారీ పాపులారిటీ అందుకున్న సాన్యా.. ఈ మధ్యకాలంలో నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ సెగలు పుట్టించే రేంజ్ లో గ్లామర్ ఫోటోలు షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటోంది. అందులో భాగంగానే తాజాగా ఇన్స్టాగ్రామ్ వేదికగా తాజాగా పంచుకున్న ఫోటోలు విపరీతంగా వైరల్ అవుతున్నాయి. బికినీ ధరించిన ఈమె ఈ అందాలను మరింత ఎలివేట్ చేస్తూ ఫోటోలకు ఫోజులిచ్చింది. చిన్న కోట్ ధరించి కొన్ని ఫోటోలలో అందాలు దాచేసిన ఈమె.. మరికొన్ని ఫోటోలలో గ్లామర్ ప్రదర్శన చేసి సోషల్ మీడియాలో మంట రాజేసింది. అటు భిన్నమైన ఫోజులకు నెటిజన్స్ కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. సాన్యా మల్హోత్ర లేటెస్ట్ ఫోటోషూట్ అభిమానులను విపరీతంగా అలరిస్తోంది. సాన్యా మల్హోత్రా 1992 ఫిబ్రవరి 25న ఢిల్లీలోని ఒక పంజాబీ కుటుంబంలో జన్మించింది. గార్గి ఇంటర్నేషనల్ స్కూల్లో చదువుకున్న ఈమె బ్యాలేలో డ్యాన్స్ లో శిక్షణ తీసుకుంది. గార్గి కాలేజీ నుండి పట్టభద్రురాలైన ఈమె.. డాన్స్ ఇండియా డాన్స్ అనే డాన్స్ రియాల్టీ షోలో పాల్గొని టాప్ 100 జాబితాలోకి ప్రవేశించింది. ఇక ముంబైకి మకాం మార్చిన తర్వాత టెలివిజన్ వాణిజ్య ప్రకటనల కోసం కెమెరామెన్ లకు సహాయకురాలిగా పనిచేసిన సాన్యా.. ఆ తర్వాత తొలిసారి నితీష్ తివారి బయోపిక్ స్పోర్ట్స్ డ్రామా దంగల్ కోసం ఫాతిమా షేక్ తో పాటు ఈమెను కూడా ఎంపిక చేశారు. ఈ సినిమాలో రెజ్లింగ్ పాత్ర కోసం ఎంతో కఠినమైన శిక్షణ కూడా తీసుకుంది సాన్యా. ఇక ఈమె నటిగానే కాకుండా 2017 లో వచ్చిన సీక్రెట్ సూపర్ స్టార్ సినిమా కోసం సెక్సీ బలియే అనే పాటకు కొరియోగ్రఫీ కూడా అందించింది. రెండు సంవత్సరాల తర్వాత మళ్లీ నటనా రంగంలోకి అడుగు పెట్టింది.. 2018లో వచ్చిన పటాకా అనే సినిమాలో నటించిన ఈమె ఇక తర్వాత వరుస పెట్టి బాలీవుడ్ లో సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరించింది. సినిమాలే కాదు వెబ్ సిరీస్లలో కూడా నటిస్తూ బిజీగా మారింది. ఇక మొత్తానికైతే సాన్యా తన నటనతోనే కాదు ఇటు పలు విభాగాలలో అవార్డులు కూడా దక్కించుకుంది.

## చైతూ 'వృషకర్మ'.. రిలీజ్ పై క్లారిటీ వచ్చేదెప్పుడు?



యంగ్ హీరో నాగచైతన్య నటిస్తున్న లేటెస్ట్ మిస్టికల్ థ్రిల్లర్ వృషకర్మపై సినీ ప్రియుల్లో భారీ ఆసక్తి నెలకొంది. తండేల్ తో మళ్లీ సక్సెస్ ట్రాక్ లోకి వచ్చిన చైతూ.. ఇప్పుడు పూర్తిగా భిన్నమైన జోనర్ లో ప్రేక్షకుల ముందుకు రాబోతుండటం ఫ్యాన్స్ లో ఎక్స్పెక్టేషన్స్ పెంచుతోంది. ముఖ్యంగా విరూపాక్ష లాంటి బ్లాక్ బస్టర్ ఇచ్చిన దర్శకుడు కార్తీక్ దండు ఆ చిత్రాన్ని తెరకెక్కిస్తుండటంతో మూవీపై హైప్ మరింత పెరిగింది. సినిమాలో చైతూకు జోడీగా యంగ్ బ్యూటీ మీనాక్షీ చౌదరీ నటిస్తుండగా, బాలీవుడ్ నటుడు స్పర్శ్ శ్రీవాస్తవ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఎస్వీసీసీ, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లపై భారీ బడ్జెట్ తో ఆ చిత్రం రూపొందుతోంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ కు సూపర్ రెస్పాన్స్ రావడం, 20 మిలియన్లకు పైగా వ్యూస్ దక్కడం సినిమాపై ఉన్న ఇంట్రెస్ట్ ను చూపిస్తోంది. రీసెంట్ గా మూవీ టీమ్ రాజస్థాన్ లో జరిగిన కీలక షెడ్యూల్ ను పూర్తి చేసింది. అక్కడి కోటలు, రాజభవనాల మధ్య తెరకెక్కించిన సీన్స్ కు సంబంధించిన బిహైండ్ ది సీన్స్ స్టిల్స్ ను విడుదల చేయగా, అవి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మిస్టిక్ క్లైమేట్, గ్రాండ్ లొకేషన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని వినికిడి. ముఖ్యంగా ఆ షెడ్యూల్ కథలో కీలక మలుపులకు సంబంధించినదని టాక్. అయితే వృషకర్మకు సంబంధించిన మరో ప్రధాన ఆకర్షణ దాని విజువల్ స్కేల్. దర్శకుడు కార్తీక్ దండు ఆ సినిమాను నార్మల్ థ్రిల్లర్ గా కాకుండా, మిస్టికల్ ఎలిమెంట్స్ తో కూడిన ఇమర్సివ్ వరల్డ్ గా తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే భారీ స్థాయిలో సీజీ, వీఎఫ్ఎక్స్ వర్క్ జరుగుతోందని సమాచారం. హాలీవుడ్ స్టాండర్డ్స్ కు తగ్గట్టుగా విజువల్ ఎఫెక్ట్స్ రూపొందిస్తున్నారని మూవీ టీమ్ చెబుతోంది. అయితే ఇదే ఇప్పుడు రిలీజ్ పై డౌట్లకు కారణమవుతోంది. ప్రస్తుతం షూటింగ్ చివరి దశకు చేరుకున్నప్పటికీ, పోస్ట్ ప్రొడక్షన్ పనులు మాత్రం ఎక్కువ సమయం తీసుకునే అవకాశం ఉందట.

# గ్రామ దీపికల పోరాటానికి సీఐటీయూ సంఘీభావం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, మే 27:వీవోఏ జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న గ్రామ దీపికల నిరవధిక నిరసన దీక్షలకు సీఐటీయూ జిల్లా కమిటీ సంఘీభావం ప్రకటించింది. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం మండల కేంద్రంలో ఆందోళన కొనసాగిస్తున్న గ్రామ దీపికల దీక్షలు బుధవారం ఆరవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ నాయకుడు వషాపొంగు వీరన్న మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ప్రభుత్వ పథకాల అమలులో గ్రామ దీపికలు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ వారికి తగిన గౌరవం, ఉద్యోగ భద్రత, సరైన వేతనాలు కల్పించకపోవడం బాధాకరమన్నారు. చాలీచాలని జీతాలతో కుటుంబాలను పోషించడం గ్రామ దీపికలకు కష్టసాధ్యంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారుతున్నా గ్రామ దీపికల పరిస్థితుల్లో మార్పు రావడం లేదని విమర్శించారు. గ్రామాల్లో ప్రజలకు సేవలు అందిస్తూ అధికార యంత్రాంగానికి అండగా నిలుస్తున్న మహిళలను చిన్నచూపు చూడడం సరికాదన్నారు. "వెట్టి చాకిరి మాకు– వేతనాలు వారికా" అన్న పరిస్థితి కొనసాగుతోందని మండిపడ్డారు. గ్రామ దీపికల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, శాశ్వత ఉద్యోగ భద్రతతో పాటు గౌరవ వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. మండుటెండలో ఆరు రోజులుగా దీక్షలు చేస్తున్న మహిళల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ దీపికల జేఏసీ నాయకులు, సీఐటీయూ కార్యకర్తలు, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామ దీపికలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పలు జిల్లాలకు వాతావరణ శాఖ హెచ్చరికలు

## ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వెల్లడి

హైదరాబాద్,మే27 : తెలంగాణలో పలు జిల్లాలకు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. మోస్తరు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. ఆ సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు హైదరాబాద్ సహా పలు జిల్లాలకు అలర్ట్ జారీ చేశారు. జనగామ, మహబూబ్‌నగర్, మేడ్చల్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో రానున్న మూడు గంటల్లో వర్షాలు కురవనున్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అలాగే రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలకు ఈదురుగాలుల హెచ్చరికలు జారీ చేశారు. ఈ మేరకు ఆయా జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెలుగు రాష్ట్రాల్లో రెండు, మూడు రోజులుగా ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. కొన్ని నెలలుగా ఎండలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఇది ఉపశమనం కలిగించినట్లు అయ్యింది. మరోవైపు అకాల వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వర్షాల దృష్ట్యా రైతులు అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులు సూచిస్తున్నారు.

# మహారాష్ట్రలో ఇంట్లోకి దూరిన చిరుత

## చాకచక్యంగా పట్టుకున్న అటవీ సిబ్బంది

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ముంబై,మే27 :మహారాష్ట్రలోని అమరావతి నగరంలో జనాలతో రద్దీగా ఉండే రాంపూరి క్యాంప్ ప్రాంతంలోని ఒక ఇంట్లోకి హఠాత్తుగా ఒక చిరుత ప్రవేశించింది. ఆ నివాస ప్రాంతంలో చిరుత సంచరిస్తూ కనిపించడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. సమాచారం అందిన వెంటనే అటవీ శాఖ, పోలీసు సిబ్బంది, అమరావతి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తక్షణమే స్పందించారు.

# రైతుల ఆగ్రహంలో కాంగ్రెస్ కొట్టుకుపోతుంది

మొదటి పేజీ తరువాయి

రైతులకు ఉద్దేశపూర్వకంగానే సకాలంలో యూరియా ఇవ్వకుండా, కరెంట్ సరఫరాలో కోతలు పెడుతూ, కొనుగోలులో తీవ్ర జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. రైతులు విసిగిపోయి తమ ధాన్యాన్ని దళారులకు తక్కువ ధరకు అమ్ముకుంటే, ప్రభుత్వంపై భారం పడకుండా ఉంటుందని రేవంత్ కుట్ర చేస్తున్నారని తీవ్రంగా ఆరోపించారు. నాడు కేసీఆర్ పంట చేతికి రాగానే వెంటనే ధాన్యం కొనుగోలు చేసి, వారం రోజుల్లోనే నేరుగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశారని గుర్తు చేశారు. నేడు రేవంత్ తుగ్లక్ పాలనలో రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకోవడానికి నెలల తరబడి కొనుగోలు కేంద్రాల్లోనే పడిగాపులు కాయాల్సి వస్తోందని దుయ్యబట్టారు.

## తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి: వేముల

మొదటి పేజీ తరువాయి

కచ్చితంగా బీఆర్ఎస్సే గెలుస్తుందని, మళ్లీ కేసీఆ ర్ సీఎం కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతులకు రైతుబంధు పేరుతో కేసీఆర్ ఎకరానికి రూ.10వేలు పెట్టుబడి సాయం అందిస్తే, రూ.12 వేలు ఇస్తామన్న కాంగ్రెస్ సర్కార్ పది వేలు కూడా ఇచ్చే పరిస్థితి లేదని విమర్శించారు.

# పెరుగుతున్న ఎండల తీవ్రత

మొదటి పేజీ తరువాయి

సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా ప్రధాని పోస్టు పెట్టారు. ముఖ్యంగా శరీరం డీహైడ్రేట్‌కు గురికాకుండా చూసుకోవాలని, బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా తాగునీటిని వెంట తీసుకెళ్లాలని సూచించారు. ఎండ తీవ్రత ఉన్న సమయాల్లో అవసరం లేకుండా బయట తిరగకూడదని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దాహంతో ఉన్న వారికి ఒక గ్లాస్ నీరు అందించాలని, ఇళ్ల ముందు, దుకాణాల బయట మట్టికుండల్లో తాగునీరు ఏర్పాటు చేయాలని కోరారు. ఇతరులకు తాగునీరు అందించే వారిని అభినందిస్తున్నానని ప్రధాని పేర్కొన్నారు. వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో చిన్నారులు, వృద్ధులు, అనారోగ్య సమస్యలు ఉన్నవారు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రధాని మోదీ సూచించారు.

# వక్ఫ్ భూముల గొడవలే కారణం

**- న్యాయవాది హత్య కేసులో పోలీసుల నిర్ధారణ - తండ్రీకొడుకులను అరెస్ట్ చేసిన పోలీసులు**

హైదరాబాద్,మే27 : న్యాయవాది మొయినుద్దీన్ హత్యకేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ హత్య కేసులో ప్రమేయం ఉన్న హైదరాబాద్‌కు చెందిన రాజకీయ నేతతోపాటు ఆయన కుమారుడిని పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. అనంతరం వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించి.. విచారిస్తున్నారు. వక్ఫ్ బోర్డు నుంచి సదరు రాజకీయ నేతను తప్పించాలని న్యాయవాది మొయినుద్దీన్ తీవ్రంగా ప్రయత్నించారు. దీంతో రూ.15 లక్షల సుపారీ ఇచ్చి.. న్యాయవాదిని ఈ తండ్రికొడుకులు హత్య చేయించినట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌లోని మలక్‌పేట, లక్డీకాపూల్, మల్లేపల్లి భూముల వివాదంలో ఈ న్యాయవాది హత్య జరిగిందని పోలీసుల విచారణలో వెల్లడయింది. వక్ఫ్ బోర్డు భూముల రక్షణ కోసం ప్రముఖ న్యాయవాది ఖాజా మొయినుద్దీన్ పోరాడుతున్నారు. మే 23వ తేదీన మాసబ్ ట్యాంక్ సమీపంలో మొయినుద్దీన్.. తన కారు ఎక్కుతున్నారు. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన ఓ కారు ఆయన్ని బలంగా ఢీకొట్టి.. అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఈ విషయాన్ని గమనించిన మొయినుద్దీన్ కుటుంబ సభ్యులు.. వెంటనే ఆయన్ని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మొయినుద్దీన్ మరణించారు. ఘటనపై తొలుత పోలీసులు హిట్ అండ్ రన్ కేసుగా నమోదు చేశారు. ఈ ఘటనపై పలు సందేహాలు వ్యక్తం కావడంతో.. ఈ కేసును పోలీసులు లోతుగా దర్యాప్తు చేశారు. ఈ ఘటన జరిగిన ప్రదేశంలో సీసీ టీవీ కెమెరా ఫుటేజ్‌లను పోలీసులు జల్లెడ పట్టారు. న్యాయవాదిని ఢీకొట్టిన కారుకు నెంబర్ ప్లేట్ లేకపోవడంతో.. ఈ పక్కా ఎ÷–లాన్ ప్రకారం జరిగిన హత్యగా పోలీసులు నిర్ధారించుకున్నారు. దీంతో నిందితుల గాలింపు కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. వక్ఫ్ భూముల విషయంలోనే ఈ హత్య జరిగినట్లు పోలీసులు నిర్ధారించారు.

# ప్రొఫెసర్ నాగేశ్వర్ చేసిన తప్పేంటి

**- అరెస్ట్ చేస్తామన్న ప్రచారంపై పాశం యాదగిరి ఆగ్రహం**

**- చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లపై ఘాటు విమర్శలు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,మే27 :ప్రొఫెసర్ కే.నాగేశ్వర్ రావు ఏపీ ప్రభుత్వంపై చేసిన విమర్శల నేపథ్యంలో ఆయనను అరెస్ట్ చేయడానికి జరుగుతున్న ప్రయత్నాలను తెలంగాణ ఉద్యమనేత, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి తీవ్రంగా ఖండించారు. నాగేశ్వర్ రావు చేసిన విమర్శల్లో అంత తప్పు ఏముందని, ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు లేదా అని ఆయన పాలకులను ప్రశ్నించారు. కేవలం విమర్శలు చేసినందుకే ఒక మేధావిని అరెస్ట్ చేయడానికి ప్రయత్నించడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లపై ఘాటైన విమర్శలు గుప్పించారు.

ఒకప్పుడు విప్లవ వీరుడు చేగువేరా బొమ్మలను, ఆయన సిద్ధాంతాలను గుండెలకు హత్తుకుని తిరిగిన పవన్ కళ్యాణ్, ఈరోజు స్వార్థ రాజకీయాల కోసం చంద్రబాబు నాయుడు బొమ్మలను పట్టుకుని తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. మేధావి, విద్యావేత్త అయిన ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ రావు తో పోలిస్తే పవన్ కళ్యాణ్ ఒక 'లిల్లీపుట్' లాంటివాడని వ్యాఖ్యానించారు. ఎన్నో పెళ్లిళ్లు చేసుకున్న పవన్ కళ్యాణ్ ఇతరులకు సంస్కారం గురించి హితబోధలు చేయడం ఏమిటని ఆయన నిలదీశారు. అసలు అటువంటి వ్యక్తిని తీసుకువెళ్లి ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రిని చేయడమే ఒక పెద్ద తప్పిదమని ఆయన అభిప్రాయపడ్డారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజకీయ వ్యూహాలపై, గత చరిత్రపై పాశం యాదగిరి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎక్కడ పచ్చగా, లాభసాటిగా ఉంటే అక్కడికి వెళ్లి మేసే పశువు తరహాలో, కేవలం అధికారం కోసం రోజుకొక రాజకీయ పార్టీని, రంగులను మార్చే నాయకులు కూడా ఈరోజు నీతులు చెప్తుండటం విడ్డూరంగా ఉందన్నారు. నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, మహానటుడు ఎన్టీ రామారావు మరణానికి కారకుడైన వ్యక్తి, ఈరోజు మళ్లీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా కూర్చోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో మీడియా అక్రిడిటేషన్ల మరియు ఛానళ్ల యాజమాన్యాలపై ఆయన సంచలన నిజాలను వెల్లడించారు. స్వరాష్ట్రమైన తెలంగాణలో స్థానిక జర్నలిస్టులకు కాకుండా, ప్రస్తుతం మొత్తం ఆంధ్రా ప్రాంతానికి చెందిన జర్నలిస్టులకే అక్రిడిటేషన్ల కార్డులు ఎక్కువగా ఉన్నాయని ఆరోపించారు. తెలంగాణలో వి6 , టి న్యూస్ మినహాయిస్తే, మిగిలిన ప్రధాన వార్తా ఛానళ్లన్నీ ఆంధ్రా యాజమాన్యాల చేతుల్లోనే ఉన్నాయని, మీడియా రంగంలో ఇప్పటికీ వారి ఆధిపత్యమే నడుస్తోందని సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి స్పష్టం చేశారు.

# అకాల వర్షంతో చల్లబడ్డ వాతావరణం

మొదటి పేజీ తరువాయి

కొట్టుకుపోతుంటే రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. అష్టకష్టాలు పడి రైతులు కష్టాలను దిగమింగుకొని ధాన్యపు సిరులు పండించారు. పుట్లకొద్ది పండిస్తే ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా, ధాన్యం కొనుగోలు చేయకపోవడం, అరకొరా కొన్నా కాంటాలు పెట్టకపోవడం, నెలల తరబడి గన్నీ సంచులు అందక, మద్దతు ధర లభించక, తరుగు పేరుతో మిల్లర్ల దోపిడీ, తీరా కాంటాలు పెట్టాక లారీల కొరతతో లోడింగ్ చేయకపోవడంతో కల్లాల్లోనే ధాన్యం పంటలు తడిసి ముద్దయ్యింది. సకాలంలో కొనుగోలు చేసి ఉంటే తమకు నష్టం జరిగేది కాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరతో కొనాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు. మెదక్ జిల్లాలో ఈదురు గాలులు బీభత్సం సృష్టించింది. మంగళవారం రాత్రి నుంచి ఈదురు గాలులతో భారీ వర్షం పడడంతో కొనుగోలు కేంద్రాల్లో ఉన్న వరి ధాన్యం వర్షానికి తడిసిపోయింది. ఈదురు గాలులు భారీగా వీచడంతో చెట్లు కరెంటు స్తంభాలు కూలిపోయాయి. మెదక్ జిల్లాలోని మెదక్, హవేలీ ఘనాపూర్, పాపన్నపేట, కుల్చారం, కౌడిపల్లి, చిలిపిచెడ్, చిన్న శంకరంపేట్, రామాయంపేట, చేగుంట తో పాటు పలు మండలాల్లో కల్లాల్లోని ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో దాన్యం బస్తాలు తడిచిపోవడంతో రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. ప్రభుత్వం సకాలంలో ధాన్యం కొని ఉంటే తమకు నష్టం జరిగేది కాదని రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. కొన్నిచోట్ల వడ్ల కుప్పలు ఉండగా మరికొన్ని చోట్ల వరి ధాన్యం బస్తాలో నింపించారు. కాంటజేసిన లారీలు సకాలంలో రాకపోవడంతో ధాన్యం బస్తాలు కొనుగోలు కేంద్రాలలో నిలువ చేశారు. అకాల వర్షానికి వరి ధాన్యం తడిచిపోవడంతో తమకు తీవ్ర నష్టం జరిగిందని రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు.

# ప్రధాని మోడీతో తమిళనాడు సిఎం విజయ్ భేటీ

మొదటి పేజీ తరువాయి

సమావేశమయ్యారు. దాదాపు 25 నిమిషాలపాటు సాగిన ఈ భేటీలో.. తమిళనాడుకు సంబంధించిన పలు అంశాలపై వారు చర్చించినట్లు తెలుస్తోంది. తమిళనాడుకు కేంద్రం నుంచి రావాల్సిన ఆర్థిక సాయంతో పాటు పలు అంశాలు చర్చించినట్లు తెలుస్తోంది. అనంతరం ఇరువురు నేతలు కలిసిన సందర్భంగా తీసిన ఫొటోలను పీఎంవో 'ఎక్స్' వేదికగా పోస్టు చేసింది. ఇటీవల నెదర్లాండ్స్ పర్యటన సందర్భంగా 'అనైమంగళం' రాగి శాసనాలను తిరిగి భారత్‌కు రప్పించడంలో ప్రధాని మోదీ చేసిన కృషికి సీఎం విజయ్ కృతజ్ఞతలు తెలిపారని పేర్కొంటూ తమిళనాడు ప్రభుత్వం ఓ ప్రకటన విడుదల చేసింది. మేకెదాటు డ్యామ్ వివాదం అంశంపైనా ప్రధానితో చర్చించినట్లు పేర్కొంది. తమిళనాడు మత్స్యకారులను శ్రీలంక నౌకాదళం అరెస్టు చేయడం, వేధించడం వంటి ఘటనలు పెరుగుతుండటంపై సీఎం ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలిపింది. ఈ ఏడాదిలోనే 12 అరెస్టులు నమోదయ్యాయని, ప్రస్తుతం 58 మంది మత్స్యకారులు శ్రీలంక నిర్బంధంలో ఉన్నారని ప్రధాని దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించింది. మత్స్యకారులను, వారి పడవలను తక్షణమే విడుదల చేయాలని శ్రీలంక ప్రభుత్వాన్ని కోరాల్సిందిగా అభ్యర్థించినట్లు పేర్కొంది. అనంతరం ఆయన నేరుగా తమిళనాడు హౌస్‌కు చేరుకోవడంతో గౌరవ వందనంతో ఆయనకు సాదర స్వాగతం లభించింది. తమిళనాడు సీఎంగా విజయ్ అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత ఢిల్లీకి రావడం ఇదే ప్రథమం. విజయ్ తన పర్యటనలో భాగంగా ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, కేంద్ర మంత్రి అమిత్‌షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కూడా కలుసుకోనున్నారు. కాంగ్రెస్ సీనియర్ నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గేలను 10 జన్‌పథ్‌లో కలుసుకోనున్నారు. విజయ్ సమావేశం నేపథ్యంలో జన్‌పథ్ వెలుపల రాహుల్–విజయ్ ఫోస్టర్లు వెలిసాయి. కాగా, వామపక్షాలు, ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ పార్టీల నేతలు కూడా తమిళనాడు హౌస్‌లో విజయ్‌ను కలుసుకోనున్నారు.

# త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమం

మొదటి పేజీ తరువాయి

రూపాయి ఫీజు కూడా తీసుకోకుండా మహిళల పేరుమీద రిజిస్ట్రేషన్ న్ చేస్తాం. సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఇళ్ల పంపిణీ జరుగుతుంది. బీఆర్ఎస్ ప్రభుత్వం నియోజకవర్గానికి 10 ఇళ్లు కూడా నిర్మించలేదు. మా ప్రభుత్వం వచ్చాక ఒక్కో నియోజకవర్గానికి 3,500కు పైగా ఇళ్లు ఇచ్చాం. రెండో విడతలో 2వేల ఇళ్లు కేటాయిస్తాం అని పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇదిలావుంటే ఇందిరమ్మ ఇళ్లపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు, తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం హైదరాబాద్‌లో సవాల్ విసిరారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిర్మించిన ఇళ్ల కంటే ఎక్కువ కడితేనే తాను వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. లేదంటే ఎమ్మెల్యేగా కూడా పోటీ చేయనని పేర్కొన్నారు. మీకంటే ఎక్కువ ఇళ్లు నిర్మిస్తే.. మీరు పోటీకి దూరంగా ఉంటారా? అంటూ కేటీఆర్‌ను పొంగులేటి శ్రీనివాసరెడ్డి సవాల్ విసిరారు. వీరిద్దరి మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. తెలంగాణ రాజధాని హైదరాబాద్ మహానగరంలో ఒక్క ఇందిరమ్మ ఇల్లు కట్టినట్లు నిరూపించినా.. తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ సవాల్ విసిరారు. ఈ సవాల్‌పై మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ట్విట్టర్ వేదికగా స్పందించారు. మే 23వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో హైదరాబాద్‌లోని మూడు కార్పొరేషన్ల పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళు నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చిన తొలి రెండున్నర ఏళ్లలోనే రాష్ట్రంలో 4.5 లక్షల ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. ఇందిరమ్మ పాలన అంటే ఏమిటో గ్రామాల్లోకి వెళ్లి ఆ ఇళ్లు కట్టుకున్న కుటుంబాలను అడిగితే తెలుస్తుందని కేటీఆర్‌కు ఆయన స్పష్టం చేశారు. ఫామ్‌హౌస్‌లలో ఉంటే ఏం తెలుస్తుందంటూ కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి చురకలంటించారు. అలాగే జూన్ 1వ తేదీన మరో 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టనున్నారని వివరించారు. అసెంబ్లీ ఎన్నికల నుంచి నిన్న మొన్నటి వరకు జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటిందని కేటీఆర్‌కు పొంగులేటి గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు వీఆర్ఎస్ ఇచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని కేటీఆర్‌కు పొంగులేటి స్పష్టం చేశారు. దాంతో మీరు ప్రత్యేకంగా రాజకీయ సన్యాసం తీసుకోనక్కర్లేదరటూ కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి వ్యంగ్యంగా అన్నారు.

# సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అదనపు పని వేళలు

మొదటి పేజీ తరువాయి

కూడా పెంచాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అవసరమైతే మరికొన్ని రోజులు కూడా అదనపు సేవలు కొనసాగించే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో వేగం, పారదర్శకత పెంచడంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. అలాగే తహసీల్దార్ కార్యాలయాలతో సమన్వయం పెంచి, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సౌకర్యమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

# డిజిటల్ చెల్లింపుల్లో జాగ్రత్త

మొదటి పేజీ తరువాయి

వ్యక్తులు రూ.48వేల విలువైన మేకలను కొనుగోలు చేసి, నకిలీ పేమెంట్ యాప్‌తో బురిడీ కొట్టించారన్నారు. ఖాతాలో డబ్బు జమ కాలేదని గుర్తించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో, మేకలు, గొర్రెల అమ్మకందారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పశువులను అప్పగించే ముందు, మీ బ్యాంకింగ్ ఖాతాలో బ్యాలెన్స్ నిర్ధారించుకోవాలన్నారు. ఎవరైనా మోసం చేయడానికి ప్రయత్నిస్తే డయల్ 100కు కాల్ చేసి పోలీసు అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

# గోనె సంచుల్లో డబ్బుల మూటల తరలింపు

మొదటి పేజీ తరువాయి

ఎందుకు లేవంటే ఆ గోనె బస్తాల్లో మన రక్తమాంసాలను పిండి పీల్చి పిప్పి చేసి సంపాదించిన డబ్బును మూటలల్ల పెట్టి.. ఆ మూటలను మొత్తం ప్యాక్ చేసి వాటిని ఢిల్లీకి తరలిస్తున్నడు రేవంత్ రెడ్డి. అందుకే తెలంగాణలో గోనెసంచులు దొరుకతలేవు ఇది వాస్తవం. తెలంగాణలో డబ్బు లేదు. ఎందుకంటే తెలంగాణలో డబ్బంతా అక్కడికి తరలిపోతున్నదని ఆరోపించారు.

# సింగరేణిలో 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు మాయం

మొదటి పేజీ తరువాయి

చీప్ ట్రిక్ కింద వాడారని విమర్శించారు. సీఎం కార్యాలయం డైరెక్షన్ మేరకు తనను ట్రోల్ చేస్తున్నారని వివరించారు. మరోసారి తనపై కేసు పెట్టి జైలుకు పంపుతారేమోనన్న అనుమానం వ్యక్తం చేశారు . క్యాతనపల్లి మున్సిపాలిటీ చైర్మన్,వైస్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా ఇబ్బందులు పెట్టి జైలుకు పంపారని గుర్తు చేశారు. . ఫార్మా కంపెనీని కాలుస్తా అన్న జడ్చర్ల ఎమ్మెల్యేపై, నరుకుతా అన్న రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ ఠాగూర్‌పై కేసులు ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. నాడు ప్రగతి భవన్‌ను బాంబులు పెట్టి పేల్చాలని పీసీసీ అధ్యక్షుడి హోదాలో మాట్లాడిన రేవంత్ రెడ్డిపై కేసు పెట్టాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పట్ల ఏ వర్గం సంతృప్తిగా లేదని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో కాంగ్రెస్ ప్రభుత్వం తనను టా÷–గ్గ÷ట్ చేసింది. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి టా÷–గ్గ÷ట్ చేస్తోందని ఆరోపించారు. శ్రీలంకలో,బంగ్లాదేశ్ లో ప్రజలు తిరగబడునట్లు తెలంగాణలోను ప్రజల తిరుగుబాటు వస్తుందని వెల్లడించారు. సీఎం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించే లోగా రైతుల సమస్యలు తీర్చాలని డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నేతలు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ,ఫ్లలె రవికుమార్ , కురువ విజయ్ కుమార్ , తుంగ బాలు , పడాల సతీష్ రాజేష్ ,రవీందర్ రెడ్డి ,హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ

మొదటి పేజీ తరువాయి

ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చూడాలని అధికారులకు మార్గనిర్దేశం చేశారు. కల్లాల్లో నిల్వ ఉంచిన ధాన్యం వర్షానికి తడవకుండా అవసరమైన టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సీఎం సూచించారు. ఇప్పటికే కొనుగోళ్లు పూర్తయిన కేంద్రాల నుంచి టార్పాలిన్లను ఇతర అవసరమైన ప్రాంతాలకు తరలించాలని పేర్కొన్నారు. రైతుల ధాన్యం భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు. అలాగే వాతావరణ కేంద్రం బలమైన ఈదురుగాలుల హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో అధికారులు వెంటనే స్పందించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు అవసరం లేకుండా బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

# కల్లాల వద్ద దైన్యంగా రైతులు

మొదటి పేజీ తరువాయి

పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. కరీంనగర్, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలతో సహా రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజులుగా కురిసిన అకాల వర్షాలకు పలు మార్కెట్ యార్డుల్లో వడ్లు వర్షానికి కొట్టుకుపోతుంటే రైతన్నలు కన్నీరుమున్నీరు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరెంటు లేక సెల్‌ఫోన్‌ల వెలుతురులో రైతులు తమ ధాన్యాన్ని కాపాడుకోవడానికి పడుతున్న అవస్థలు ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వ అసమర్థత, ముందుచూపు లేకపోవడం వల్లే నేడు రైతన్నలు ఈ దుస్థితిని ఎదుర్కొంటున్నారని, ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న తీవ్ర జాప్యం వల్లే రైతుల ఆరుగాలం కష్టం కళ్లముందే నీళ్లపాలవుతోందని ధ్వజమెత్తారు. ఈ కష్టకాలంలో రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఎంతైనా ఉందని స్పష్టం చేశారు. ఈ విపత్కర పరిస్థితుల్లో రైతాంగానికి అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ శ్రేణులన్నీ క్షేత్రస్థాయిలోకి వెళ్లాలని కేటీఆర్ సూచించారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తక్షణమే తమ తమ పరిధిలో అకాల వర్షాల వల్ల ప్రభావితమైన అన్ని మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాలను సందర్శించాలని ఆదేశించారు. రైతుల పక్షాన నిలబడి ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసేలా, రైతులకు న్యాయం జరిగేలా రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి పెంచాలని దిశానిర్దేశం చేశారు. మార్కెట్ యార్డుల్లో తడిసిన వరి, మొక్కజొన్న తదితర ధాన్యాన్ని తేమ శాతం, తరుగు లాంటి ఎలాంటి సాకులు చెప్పకుండా బేషరతుగా కనీస మద్దతు ధరకు (ఓ÷ూఖ) ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. వర్షాలకు పంట నష్టపోయిన రైతులందరికీ వెంటనే నష్టపరిహారం అందించి ఆదుకో వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మొద్దునిద్ర వీడి, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

# సాధారణ కాన్పులు పెంచాలి

## జిల్లా వైద్యాధికారి తుకారాం రాథోడ్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మే 27 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి తుకారాం రాథోడ్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో వైద్య సేవలు, ఔషధాల నిల్వలు, గర్భిణీల రిజిస్టర్లు, టీకాల కార్యక్రమ అమలు తీరును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. గర్భిణీలకు ఈడీడీ క్యాలెండర్ ప్రకారం ప్రసవ తేదీలను గుర్తించి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ప్రతి గర్భిణికి కనీసం నాలుగు సార్లు వైద్య పరీక్షలు నిర్వహించి రక్తపోటు, షుగర్, హీమోగ్లోబిన్ పరీక్షలు తప్పనిసరిగా చేయాలని తెలిపారు. ఐరన్, కాల్షియం మాత్రలు క్రమం తప్పకుండా తీసుకోవడంతో పాటు పోషకాహారం ద్వారా రక్తహీనత నివారించవచ్చని వివరించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే సురక్షిత ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని, సాధారణ కాన్పుల శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. తల్లి, శిశు మరణాల నివారణకు హైరిస్క్ గర్భిణీలను ముందుగానే గుర్తించి చికిత్స అందించాలని సూచించారు. తీవ్రమైన ఎండల నేపథ్యంలో వడదెబ్బ నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు బయటకు వెళ్లకుండా ఉండాలని, నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు, ఓఆర్ఎస్ ద్రావణాలు తీసుకోవాలని సూచించారు. చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని అన్నారు. డెంగ్యూ, మలేరియా నివారణకు ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, వారానికి ఒకరోజు డ్రైడే పాటించాలని సూచించారు. జ్వరం వచ్చిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని తెలిపారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి ప్రతి చిన్నారికి సమయానికి టీకాలు అందించాలని ఆదేశించారు. పోషకాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులను గుర్తించి ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. రాబోయే పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతానికి మైక్రో ప్రణాళిక సిద్ధం చేసి, ఐదేళ్ల లోపు పిల్లల లైన్ లిస్ట్ తయారు చేయాలని తెలిపారు. ఒక్క చిన్నారిని కూడా మిస్ కాకుండా ఇంటింటి సర్వే నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ వెంకటేష్, హెచ్‌వీ రాధిక, నర్సింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

## - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా - మిల్లుల వద్ద అన్‌లోడింగ్‌లో ఆలస్యం వద్దు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, మే 27 : నిర్మల్ జిల్లాలో మిగిలి ఉన్న వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన సోన్ మండల కేంద్రంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలోని రికార్డులను పరిశీలించి, ఐకేపీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కేంద్రానికి వచ్చిన ధాన్యం పరిమాణం, ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం, తేమ శాతానికి వచ్చి ఇంకా తూకం వేయాల్సిన ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. "నిర్ణీత తేమ శాతానికి రాగానే ధాన్యాన్ని వెంటనే తూకం వేయాలని, లారీల ద్వారా మిల్లులకు తరలించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తూకం వేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉండకూడదని కలెక్టర్స్పష్టం చేశారు. అంతకుముందు కలెక్టర్ జాఫ్రాపూర్ గ్రామంలోని పలు రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు వస్తున్న ధాన్యం లారీల అన్‌లోడింగ్ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. మిల్లుల వద్ద వేచి ఉన్న లారీల వివరాలు, అన్‌లోడింగ్ వేగంపై అధికారులను ఆరా తీశారు. రానున్న రోజుల్లో వాతావరణ మార్పులు, వర్ష సూచనలను దృష్టిలో ఉంచుకుని ధాన్యం అన్‌లోడింగ్‌లో ఎలాంటి ఆలస్యం జరగకుండా చూడాలని సూచించారు. అవసరమైతే హమాలీల సంఖ్యను పెంచి ప్రక్రియను వేగవంతం చేయాలని మిల్లర్లకు స్పష్టం చేశారు. పౌరసరఫరాలు, మార్కెటింగ్, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తూ రైస్ మిల్లర్లతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. అనంతరం మామడ మండలం కొరిటికల్ గ్రామంలోని రైస్ మిల్లులు, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. ధాన్యం కొనుగోలు, అన్‌లోడింగ్ ప్రక్రియలను వెంటవెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీల్లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌరసరఫరాల శాఖ అధికారులు రాజేందర్, సుధాకర్, తహసిల్దార్లు సంతోష్, శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పంట అవశేషాలకు నిప్పు--పర్యావరణానికి ముప్పు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

లక్షెట్టిపేట, మే 27 : లక్షేటిపేట మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఆఫీసర్ మామిడి క్రిష్ణ ఆధ్వర్యంలో బుధవారం రైతులకు పంట అవశేషాలకు నిప్పు-పర్యావరణానికి ముప్పు గురించి అవగాహనా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు గతంలో కంటే పంటల ఉత్పత్తులను అధికంగా సాధించడానికి పంట కోత కోసం రైతు సమాజమంతా యాంత్రీకరణ వైపు పయనిస్తోందని,ప్రస్తుతం వరి కోత కంబైన్ హార్వెస్టర్ల ద్వారా జరుగుతుందని అన్నారు. కంబైన్ హార్వెస్టర్ల వినియోగం వల్ల ధాన్యాన్ని త్వరగా కోయడంతో పాటు సమయం, ఖర్చు ఆదా అవుతున్నప్పటికీ పంట అవశేషాలు పెద్ద మొత్తంలో మిగులుతున్నాయని అన్నారు. రైతులు ఈ అవశేషాలను కాల్చివేయడం వల్ల నేల భూసారం తగ్గిపోవడం, వాయు కాలుష్యం పెరగడం, అగ్ని ప్రమాదాలు సంభవించడం వంటి సమస్యలు ఏర్పడుతున్నాయని, ఒక టన్ను పంట అవశేషాలు కాల్చితే జరిగే నష్టం నత్రజని-5.5%, భాస్వరం-2.3%, పొటాషియం-25.0%, గంధకం--1.0% భూమి కోల్పోతుందని సూచించారు. ఈ పోషకాలు నేలలో కలిస్తే భూసారం పెరుగుతుంది కాబట్టి పంట అవశేషాలను కాల్చడం వల్ల ఇవి నశించి భూమి ఉత్పాదకత తగ్గుతుందని అన్నారు.

### పంట కాల్చడం వలన కలిగే అనర్థాలు

నేల మీద ఉండే సూక్ష్మ జీవులు నశించి నేల భూసారం దెబ్బతింటుందని, పంటల కాల్చివేత వలన రైతులకు ఆర్థిక నష్టం కలుగుతుందని తెలిపారు. కార్బన్ డైఆక్సైడ్, మీథేన్ వంటి హానికర వాయువులు విడుదలై వాయు కాలుష్యం పెరుగుతుందని, భూమి యొక్క ఉష్ణోగ్రత పెరిగి భూసారం తగ్గుతుందని దీనిద్వారా పంటల ఉత్పాదకత తగ్గిపోతుందని పశువులకు కావలసిన పశుగ్రాసం కొరత ఏర్పడుతుందని తెలిపారు. పొలాల్లో ఉండే పాములు, పక్షులు, చీమలు, కీటకాలు వంటి జీవులు, రైతు మిత్ర పురుగులు నశిస్తాయని తెలిపారు. నేలలోని సేంద్రియ పదార్థాలు దెబ్బతింటాయని గడ్డి, మేత గడ్డిని తిన్న పశువులు అనారోగ్యానికి గురవుతాయని అన్నారు.

### కలియ దున్నితే ఎన్నో లాభాలు

పంట అవశేషాలను మట్టిలో కలిపి సేంద్రియ ఎరువులుగా ఉపయోగించుకోవాలని కంబైన్ కోత తర్వాత రోటావేటర్ ద్వారా భూమిలో కలపాలని తెలిపారు. గడ్డి, పశుగ్రాసం, బయోమాస్ తయారీలో వినియోగించాలని అన్నారు. వరి మడులు కాల్చకుండా పశువులకు మేతగా ఉపయోగించాలని సూచించారు. పంట అవశేషాలను కాగితం, బయోగ్యాస్, కంపోస్ట్ తయారీలో ఉపయోగించాలని తెలిపారు. 2అంగుళాల దున్నడం (దుక్కి), 4 సార్లు నీటిపారుదల ద్వారా త్వరగా కుళ్లేలా చేయాలని అన్నారు. పంటల కోత అనంతరం నాటే పంటలకు మల్చింగ్‌గా వినియోగించాలని తెలిపారు.

### పాటించాల్సిన చర్యలు

రోటోవేటర్ తో దున్నడం వలన వరి కొయ్యకాళ్ళు చిన్న ముక్కలుగా, పౌడర్ గా మారును, బస్తా సింగిల్ సూపర్ పాస్ఫేట్ లేదా వేస్ట్ డి కంపోజర్ వలన తొందరగా భూమిలో కుళ్ళిపోయిన భూసారం పెరుగుతుంది. దీనితో ఎకరాకు 8-10 ట్రాక్టర్ల చెరువు మట్టి వేసినట్టు అవుతుందని, భూమి నీరు గ్రహించే శక్తి పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్షేటిపేట మండల వ్యవసాయ అధికారి రామగిరి శ్రీకాంత్, ఎఈఓలు, రైతులు పాల్గొన్నారు.


# సాదాబైనామా దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

లక్షెట్టిపేట, మే 27 : జిల్లాలోని ప్రజల నుంచి స్వీకరించిన సాదాబైనామా దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. బుధవారం జిల్లాలోని లక్షెట్టిపేట మండల తహసిల్దార్ కార్యాలయంలో అధికారులకు సాదా బైనామా దరఖాస్తులు, భూభారతి పెండింగ్ లో ఉన్న దరఖాస్తుల పరిష్కారంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాట్లాడుతూ ప్రభుత్వం భూ సమస్యలు తీర్చేందుకు భూభారతి పోర్టల్ ను అందుబాటులోకి తీసుకొని వచ్చి భూ సంబంధిత సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం జరుగుతుందని, ఇందులో భాగంగా సాదాబైనమా దరఖాస్తులను స్వీకరించి విచారణ చేపట్టడం జరుగుతుందని, ఇట్టి దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పకడ్బందీగా విచారణ చేపట్టి పరిష్కరణ వేగవంతం చేయాలని తెలిపారు. అనంతరం లక్షెట్టిపేట మండలంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదామును మండల తహసిల్దార్ దిలీప్ కుమార్, మండల వ్యవసాయ అధికారి తో కలిసి సందర్శించి కొనుగోలు చేసిన వరి ధాన్యం దిగుమతి ప్రక్రియను వేగవంతం చేయాలని, నాణ్యమైన వరి ధాన్యాన్ని మాత్రమే గోదాములకు తరలించాలని, ధాన్యం దిగుమతికి సరిపడా హమాలీలను అందుబాటులో ఉంచాలని అధికారులకు ఆదేశించారు. అంతకుముందు మందమర్రి మండలంలోని సప్తగిరి రైస్ మిల్లును సందర్శించి ప్రభుత్వ ఆదేశాల మేరకు నిబంధనల ప్రకారం కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని నిలువ చేయడానికి గోదాముగా మార్చడానికి వీలును పరిశీలించారు. సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మున్నూరు కాపు సంఘం ఆత్మీయ చైతన్య సదస్సు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, మే 27 : జిల్లా కేంద్రంలోని స్థానిక రోజ్ గార్డెన్‌లో మున్నూరు కాపు సంగం పట్టణ ఆత్మీయ చైతన్య సదస్సు ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మున్నూరు కాపు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు గాజుల జక్కయ్య, ప్రధాన కార్యదర్శి మిట్ట దేవేందర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పట్టణ మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడుగా దేగల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా వొరగంటి సంతోష్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ గాపుట్ట వెంకటేష్ ఉపాధ్యక్షులుగా తుపాకుల సాయి, కోశాధికారులు గా గోనె వినేష్, కవల మహేందర్‌లు, ముఖ్య సలహాదారుడిగా అనిశెట్టి సదాశివ్, కార్యదర్శులుగా డి నరేందర్, నరాల శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులుగా, బండారి విశ్వనాథం, గడ్డల వెంకటేశం, సైదం రవీందర్, సలహాదారులు గా తాటిపెల్లి సుభాష్, జాపతి రమేష్, బోరిగాం సీతారాం, రేగుల బాలేష్, గౌరవ మహిళా అధ్యక్షులుగా గుర్రాల హరిప్రియ, కొండు భారతి, వీరితో పాటు వివిధ వార్డులకు సంబంధించి కార్యవర్గ సభ్యులను కూడా ఎన్నుకున్నట్లు వారు పేర్కొన్నారు. సమాజ ఐక్యత, యువత అభివృద్ధి, మున్నూరు కాపు సంఘ బలోపేతం కోసం కలిసి పనిచేస్తామని నూతనంగా ఎన్నికైన నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘానికి చెందిన పెద్దలు, యువ నాయకులు, మహిళలు,సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఏకకాలంలో ఆసరా పెన్షన్లు మంజూరు చేయాలి

## కెఎంసీ కార్పొరేటర్ మునిగడప పద్మ



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మే 27 : నూతన ఆసరా పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారుల ఆశలపై ప్రభుత్వం నీళ్లు చల్లవద్దని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ ప్రభుత్వాన్ని కోరారు. అర్హులైన వారందరికీ ఒకేసారి ఆసరా పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం డివిజన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా లక్షల సంఖ్యలో ఆసరా పెన్షన్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నప్పటికీ కేవలం రెండు లక్షల మందికే పెన్షన్లు మంజూరు చేస్తారనే వార్తలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. ఏబీసీ వర్గీకరణ పేరుతో కొంతమందికే పెన్షన్లు పరిమితం చేసే పరిస్థితి కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. జూన్ 2న సామాజిక పెన్షన్ల పంపిణీ చేపడతామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ ఇప్పటివరకు ఆన్‌లైన్ సైట్ ప్రారంభించకపోవడం, సంబంధిత జీవో విడుదల కాకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఆన్‌లైన్ కేంద్రాలు, మున్సిపల్, గ్రామ కార్యాలయాలకు వెళ్లే ప్రజలకు "సైట్ అందుబాటులో లేదు" అని చెబుతున్నారని పేర్కొన్నారు. ఇంటింటి సర్వే పేరుతో అర్హులను తొలగించే ప్రయత్నాలు చేస్తే ప్రజలు సహించరని హెచ్చరించారు. ఆసరా పెన్షన్ లబ్ధిదారుల లైవ్ ధ్రువీకరణకు మే 15 నుంచి జూన్ 15 వరకు గడువు ఇవ్వడం కూడా అనుమానాలకు కారణమవుతోందన్నారు. ప్రభుత్వం వెంటనే ఆన్‌లైన్ సైట్ ప్రారంభించి, అధికారులు పరిశీలించిన అన్ని దరఖాస్తులను అప్‌లోడ్ చేసి అర్హులైన వారందరికీ కొత్త ఆసరా పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీ మేరకు వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు రూ.1000, వికలాంగులకు రూ.2000 పెంపును అమలు చేసి లబ్ధిదారులను ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో కరుణశ్రీ, లక్ష్మి, మారమ్మ, దేవి తదితరులు పాల్గొన్నారు.

# కోల్ ఇండియా అపెక్స్ జేసీసీలో నాలుగు లేబర్ కోడ్లపై కీలక చర్చ

## కోల్‌కతాలోని సిఐఎల్ ప్రధాన కార్యాలయంలో సమావేశం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, మే 27 : హైదరాబాద్, మే 27:కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) యాజమాన్యం జూన్ 5న నిర్వహించనున్న అపెక్స్ జాయింట్ కన్సల్టేటివ్ కమిటీ (ఏపెక్స్ జేసీసీ) సమావేశంలో నాలుగు లేబర్ కోడ్ల అమలుపై కీలక చర్చ జరగనుంది. ఈ సమావేశం కోల్‌కతాలోని సీఐఎల్ ప్రధాన కార్యాలయంలో ఉదయం 11.30 గంటలకు నిర్వహించనున్నారు. సీఐఎల్ కార్యనిర్వాహక సంచాలకుడు (హెచ్‌ఆర్) గౌతమ్ బెనర్జీ విడుదల చేసిన సమాచారం ప్రకారం, కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న నాలుగు లేబర్ కోడ్ల ప్రభావం కోల్ ఇండియాపై ఎలా ఉండబోతుందనే అంశంపై సమగ్రంగా చర్చించనున్నారు. అలాగే లేబర్ కోడ్ల అమలుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను కూడా ఖరారు చేసే అవకాశముంది. కొత్త లేబర్ కోడ్లు అమల్లోకి వచ్చిన తర్వాత పారిశ్రామిక సంబంధాల వ్యవస్థ, ట్రేడ్ యూనియన్ల గుర్తింపు, వేతన ఒప్పందాలు, కార్మికుల ప్రతినిధిత్వం, ఉద్యోగుల హక్కులు వంటి అంశాల్లో కీలక మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉం దని కార్మిక వర్గాలు భావిస్తున్నాయి. ఇటీవల కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్లపై నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో, సీఐఎల్ డైరెక్టర్ (హెచ్‌ఆర్) వినయ్ రంజన్ ఈ నెల 18న అన్ని అనుబంధ సంస్థలకు లేఖ రాసి అమలుకు సిద్ధం కావాలని సూచించినట్లు సమాచారం. అపెక్స్ జేసీసీ కోల్ ఇండియాలో అత్యున్నత స్థాయి సంయుక్త సలహా కమిటీగా కొనసాగుతోంది. సాధారణంగా ఈ సమావేశానికి సీఐఎల్ చైర్మన్ అధ్యక్షత వహిస్తారు. సమావేశంలో సీఐఎల్ డైరెక్టర్లు, అనుబంధ సంస్థల సీఎండీలు, బీఎంఎస్, హెచ్‌ఎంఎస్, ఏఐటీయూసీ, సీఐటీయూ వంటి కేంద్ర కార్మిక సంఘాల ప్రతినిధులు, సీఎంఓఏఐ ప్రతినిధులు పాల్గొంటారు. ఈ సమావేశంలో తీసుకునే నిర్ణయాలు భవిష్యత్తులో బొగ్గు పరిశ్రమలో కార్మిక సంబంధాల దిశను ప్రభావితం చేసే అవకాశం ఉండటంతో కార్మిక సంఘాలు, ఉద్యోగుల్లో ఆసక్తి నెలకొంది.



# అకాల వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండి ధాన్యం రక్షణ చర్యలు చేపట్టాలి

## భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మే 27 : అకాల వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండి కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన ధాన్యం తడవకుండా పటిష్ట రక్షణ చర్యలు చేపట్టాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. బుధవారం చుంచుపల్లి మండలం పెనగడప ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం నిల్వలు, కొనుగోలు ప్రక్రియ, లోడింగ్, రవాణా ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం కేంద్రంలో సుమారు 1200 క్వింటాళ్ల ధాన్యం నిల్వలు ఉన్నాయని, వాటిని సుజాతనగర్‌లోని రైస్ మిల్లుకు రెండు రోజులలోపు తరలించేలా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు, కవర్లు ఏర్పాటు చేసి ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షపు నీరు నిల్వల వద్ద చేరకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలిస్తూ లోడింగ్, రవాణా పనులను సమన్వయంతో నిర్వహించాలని అధికారులకు సూచించారు. రైతులకు తాగునీరు, నీడ తదితర మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పాటిస్తూ రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అధికారులు బాధ్యతాయుతంగా పనిచేసి రైతులకు ఎలాంటి

# బక్రీద్ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలి

## ఎస్పీ రోహిత్ రాజు




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మే 27 : త్యాగానికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ పండుగను ముస్లిం సోదర, సోదరీమణులు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక సందేశం విడుదల చేశారు. జిల్లాలో బక్రీద్ వేడుకలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్ శాఖ తరపున అన్ని భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ఈద్గా, మసీదులకు వెళ్లే మార్గాల్లో ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వహిస్తారని తెలిపారు. ప్రజలు కూడా పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపించినా లేదా అనుమానాస్పద ఘటనలు గమనించినా వెంటనే పోలీస్ శాఖకు సమాచారం ఇవ్వాలని, అవసరమైతే డయల్-100ను సంప్రదించాలని ఎస్పీ రోహిత్ రాజు విజ్ఞప్తి చేశారు.

# సింగరేణి సంస్థను తగలబెట్టాలనుకోవడం బాధాకరం

## - ఐఎన్‌టీయూసీ ఏరియా వైస్ ప్రెసిడెంట్ బి.మధుకర్ రెడ్డి

## - బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలకు తీవ్ర ఖండన



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, మే 27 : తెలంగాణకు కొంగుబంగారంగా నిలిచిన సింగరేణి సంస్థను తగలబెట్టాలని వ్యాఖ్యానించడం తీవ్ర దిగ్భ్రాంతికరమని సింగరేణి భూపాలపల్లి ఏరియా ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ భేతెల్లి మధుకర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం సోషల్ మీడియాలో విడుదల చేసిన ప్రకటనలో ఆయన బీఆర్ఎస్ నాయకుల వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఆరు జిల్లాల్లో విస్తరించి వేలాది మంది కార్మికులకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి కల్పిస్తున్న సింగరేణి సంస్థను రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం లక్ష్యంగా చేసుకోవడం దుర్మార్గమన్నారు. రైతు ఉద్యమాలకు ప్రజల మద్దతు రాకపోవడంతో సింగరేణిని తగలబెట్టాలని, రైల్వే పట్టాలు కోయాలని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని మండిపడ్డారు. గతంలో రాజ్యాంగ పదవులు నిర్వహించిన నాయకులు ఇటువంటి వ్యాఖ్యలు చేయడం మరింత బాధాకరమని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యల సమయంలో అక్కడే ఉన్న టీబీజీకేఎస్ నాయకులు స్పందించక పోవడం కూడా ఆందోళన కలిగించే అంశమన్నారు. సింగరేణి సంస్థను కార్మికులు తమ గుండెల్లో పెట్టుకుని కాపాడుకుంటారని, దానిపై ఎలాంటి దుష్ప్రచారాన్నైనా తిప్పికొడతారని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి సంఘవిద్రోహ చర్యలకు ప్రేరేపించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరోవైపు ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ డాక్టర్ బి. జనక్ ప్రసాద్ ఆధ్వర్యంలో సింగరేణి అభివృద్ధి, కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం, యాజమాన్యంతో చర్చలు జరుపుతున్న సమయంలో సంస్థను దెబ్బతీయాలనే ప్రయత్నాలు జరుగడం దురదృష్టకర మన్నారు.

Printed, Published and Owned by **KORUKANTI MANIDEEP PATEL,** Printed at SRI BALAJI PRINTING PRESS, H.No. 4-4-/85, Thilak Road, Karimnagar, Telangana - 505001 and Published at H.No.2-6-242, Ist Floor, Bus stand to Wesly Church Road, Mukarampura, Karimnagar, Karimnagar (Dist.), Telangana-505001, Editor: **GOLI SAMMI REDDY.** RNI.No.TELTEL/2010/35941. Cell: 9394322782, email: prajalakshyam@gmail.com